www.jagritiweekly.com
సంపుటి : 75 సంచిక : 14 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ మాఘ శుద్ధ విదియ
23-29 జనవరి 2023
వెల : ₹15/-



## పరవళ్లు తొక్కుతున్న
# పర్యాటకరంగం

ఒక దేశం బ్రాండ్ ఇమేజిని పెంచేది టూరిజమే

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక


सत्यमेव जयते

పాఠకులకు, ఏజెంట్లకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు

# గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు



ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
చైతన్యం నింపే వ్యాసాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.




## రండి..
## జాతీయభావాల వేదిక
## జాగృతి చందాదారులుగా
## చేరుదాం.. చేర్పిద్దాం!

**ఏప్రిల్ 1, 2023 తేదీ నుండి జాగృతి వార్షిక, 5 సంవత్సరాల చందా పెరగనున్నది. ఆ లోగా చందా కట్టేవారికి పాత ధరలే వర్తిస్తాయి త్వరపడండి...**

**జాగృతి చందాను ఆన్‌లైన్‌లో పంపుటకు కిందనున్న క్యు.ఆర్. కోడ్‌లను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి.. లేదా లింక్ ద్వారా చందా చెల్లించండి!**

ఒక సంవత్సర చందా రూ.650/-
http://payit.cc/S18970

Jagriti Bank A/c details :
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.3000/-
http://payit.cc/S18973

3-4-228/4/1, Kachiguda, Hyderabad-500027.
Ph : 040-27561453, 9959997013. email : jagritiweeklysub@gmail.com

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ **040-27561453/9959997013**

## జాగృతి చందా – సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- ✦ అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- ✦ తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- ✦ పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- ✦ చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- ✦ రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ✦ ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- ✦ మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- ✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- ✦ **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- ✦ చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | **9959991304** |

డిజైనర్లు : సిహెచ్. కుమార్, ఎం. అనిత

ఇది ప్రసూతి వైరాగ్యమా? శ్మశాన వైరాగ్యమా? వైరాగ్యమే కానీ, అది ఈ రెండింటిలో ఏ రకానిదో చెప్పడం కష్టం. పాకిస్తాన్ ప్రధాని ప్రకటించారు కాబట్టి ఉగ్రవాద వైరాగ్యం అని దీనికో పేరు నిర్ణయించవచ్చునేమో! అందులో హిందూ ద్వేషం, భారత ద్వేషం ఎలాగూ అంతర్భాగాలే. కొద్దిక్షణాలు, ఇంకా చెప్పాలంటే కాసిన్ని రోజులు ఒక నిర్వేదంలోకి జారిపోవడం, మళ్లీ యథాతథ స్థితికి రావడమే వైరాగ్యమనే స్థితిలోని వైచిత్రి. దాలిగుంటలో అప్పటిదాకా వెచ్చదనాన్ని అనుభవించి, చివరికి దులపరించుకుని వెళ్లిపోయే కుక్క మనస్తత్త్వం ఈ ధోరణికి కాస్త దగ్గరగా ఉంటుంది. భారత్‌తో మూడు యుద్ధాలు చేసిన తరువాత పాకిస్తాన్ గుణపాఠాలు నేర్చుకుందని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ‘అల్ అరబియా టీవీ’కి ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో ఈ విషయం చెప్పారు. ఇంకా, ‘నరేంద్ర మోదీగారూ! మేం శాంతిని కోరుతున్నాం!’ అని కూడా ముక్తాయించారు. కానీ ఇక్కడే మెలికపెట్టారు. దానిని పరిశీలిస్తే కుక్క తోక అమాంతం గుర్తుకు వస్తుంది.

సిరిల్ రాడ్‌క్లిఫ్ పథకం ప్రకారం 1947లో భారత్, పాకిస్తాన్ రెండు దేశాలుగా ఏర్పడ్డాయి. ఎర్రకోట మీద నుంచి ప్రథమ ప్రధాని నెహ్రూ చేసిన ప్రసంగం ఇంకా దేశ ప్రజల చెవులలో ప్రతిధ్వనిస్తుండగానే పాకిస్తాన్ భారత్ మీద దాడికి దిగింది. కాళ్లు తొక్కిన రోజే కాపురం ముచ్చట తెలిసిపోతుందని సామెత. భవిష్యత్‌లో భారత్‌తో ఎలాంటి సంబంధాలు ఉంటాయో ఆ విఫల దాడితోనే పాక్ ప్రకటించింది. మళ్లీ 1965, 1971 యుద్ధాలు జరిగాయి. మూడో యుద్ధంతో పాక్ తూర్పు బెంగాల్‌ను కోల్పోయింది. అయినా దాని బుద్ధి మారలేదు. భారత్ మీద వేయేళ్ల జిహాద్ ప్రకటించింది. ఎందుకో మరి షెహబాజ్ కార్గిల్ ఘర్షణ గురించి చెప్పలేదు. అది తన అన్నగారిని ఎడారులు పట్టించేసింది కాబట్టి తలుచుకోవడం ఇష్టం లేదేమో! సరే, ఇప్పుడే ఎందుకీ వైరాగ్యం? దేశంలో పది కిలోల గోధుమ పిండి రూ. 1500 పలుకుతుంటే, పిడికెడు పిండి కోసం జనం ఒకరినొకరు చంపుకుంటూ ఉంటే కాస్త వైరాగ్యం కమ్మింది కళ్లని. పాక్ నాయకులు ఎవరినీ బతకనివ్వం అంటూ అఫ్ఘానిస్తాన్

**శాలివాహన 1944 శ్రీ శుభకృత్ మాఘ శుద్ధ విదియ**

### లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం

**పరవళ్లు తొక్కుతున్న పర్యాటకరంగం** 6లో



జాతీయం

**జోషిమఠ్ కుంగుబాటుకు కారణాలేంటి?** 12లో



ధారావాహిక నవల

**వరాహమిహిర** 5

– పాలంకి సత్య 20లో

# జాగృతి

## సంపాదకీయం

తాలిబన్ ప్రకటించిన తరువాత కళ్లు బైర్లు కమ్మిన ఫలితంగానే పాకిస్తాన్ ప్రధాని ఆ మాటలు అన్నారని అనుకున్నా అనుకోవచ్చు.

యుద్ధాలతో బుద్ధొచ్చింది కాబట్టి, మేం భారత్‌తో శాంతిని కోరుకుంటున్నాం అన్నారు షెహబాజ్. అయితే కశ్మీర్‌లో భారత ప్రభుత్వం ఏం చేస్తున్నదో అది ఆపేస్తేనే సదరు శాంతి సాధ్యమట. కశ్మీర్‌లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనను మరచిపోవడం వారికి సాధ్యం కావడం లేదట. 'మాకు వైద్యులు ఉన్నారు. వృత్తి నైపుణ్యం కలిగిన శ్రామికులు ఉన్నారు. వారిని ఒక సంపదగా

# పాకిస్తాన్ వైరాగ్యం

భావిస్తూ దేశ సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకుని ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పాలని అనుకుంటున్నాం. అప్పుడు రెండు దేశాలు అభివృద్ధి చెందుతాయి. శాంతియుత జీవనమా, లేదా ఘర్షణ పడుతూ వనరులను వృథా చేయడమా అనేది మా రెండు దేశాల మీద ఆధారపడి ఉంది. మేం భారత్‌తో మూడు యుద్ధాలు చేశాం. అవి మాకు ఇచ్చినది ఏదైనా ఉన్నదీ అంటే మరింత పేదరికం, మరిన్ని కష్టాలు, ఇంకాస్త నిరుద్యోగం పెరగడమే'నని కూడా అంగీకరించారు. 'మేం నేర్చుకోవలసిన గుణపాఠాలేవో ఆ యుద్ధాలతో నేర్చుకున్నాం. న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించడం ద్వారా వచ్చిన శాంతియుత వాతావరణంలో అభివృద్ధి చెందాలని అనుకుంటున్నాం' అంటూ ప్రపంచం దంగైపోయేటంత మాట చెప్పారు. కానీ ఇలా తప్పంతా పాక్ మీద వేసేస్తే, అక్కడి సైన్యానికీ, ఐఎస్ఐకీ రక్తపోటు వస్తుందన్న పచ్చి నిజం తెలుసు కాబట్టి షెహబాజ్ ఇలా ముక్తాయించారు విషయాన్ని. ఇది కూడా మోదీకి పంపిన సందేశంలోనిది. అందులో, 'పాకిస్తాన్ తన వనరులను బాంబుల మీద, ఆయుధ సామగ్రి మీద వృథా చేయదలుచుకోలేదు. మనం అణ్వస్త్రాలు కలిగినవాళ్లం. ఒకవేళ భగవంతుడు అనుగ్రహం లేక యుద్ధం జరిగితే ఏం జరిగిందో చెప్పడానికి ఎవరు ఉంటారు' అని వాక్రుచ్చారు. నోరు మాట్లాడుతుంటే నొసలు వెక్కిరించడం అంటే ఇదే! యుద్ధాలతో అంతో ఇంతో బుద్ధొచ్చింది అంటూనే మళ్లీ అణ్వస్త్రాల గురించి ప్రస్తావించడమంటే అది నోరేనా! నా మొదటి ప్రాధాన్యం దేశంలో సామరస్యం నెలకొల్పడం, భారత్‌తో శాంతిని కోరడమే కానీ, ఇదంతా కశ్మీర్ సమస్య తేలనంత వరకు సాధ్యం కాదు అన్నారు షెహబాజ్, ఏప్రిల్ 10, 2022న. ఆయన ప్రధానిగా పదవి చేపట్టడానికి ముందు జియో న్యూస్ సంస్థతో అన్న మాటలివి. మరి ఆయనలో వచ్చిన మార్పు ఏమిటి? బుద్ధిరావడం మాటేమిటి? అయినా పాక్‌కు బుద్ధి వచ్చిందంటే భారత్‌లో, ప్రపంచంలో ఏ ఒక్కరూ నమ్మరు. ఆ అవకాశం లేదు. షెహబాజ్ పాక్‌కు బుద్ధొచ్చిన సంగతి ఆ న్యూస్ చానల్‌తో చెబుతున్న సమయంలోనే 'జీ న్యూస్' ఇంకొక వార్త చెప్పింది. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసే జైష్ ఏ మహమ్మద్ ఉగ్రసంస్థ నిర్మాణంలో ఉన్న అయోధ్య రామమందిరం మీద రాబోయే కాలంలో పెద్దఎత్తున ఆత్మాహుతి దళాలతో దాడి చేసే అవకాశాలు ఉన్నాయన్న సంగతి నిఘా వర్గాలకు తెలిసింది. దీనితో భద్రతను పెంచవలసి వచ్చింది. అదీ వార్త.

పాకిస్తాన్ ఒక విఫల దేశంగానే కొనసాగాలని కోరుకుంటున్నది. లేకపోతే యుద్ధాలతో బుద్ధి తెచ్చుకున్నామని అంటూనే, ఉగ్రవాదం విషయంలో మాత్రం తమ బుద్ధి మారదనీ, దానిని పెంచి పోషించుకుంటూనే ఉంటామనీ పరోక్షంగా చెబుతున్న దేశానికి మిగిలేదేమిటి? దేశంలో కరవు దాడులు జరుగుతుంటే పొరుగు దేశం మీద అణుదాడుల హెచ్చరికలు చేసే తెంపరితనాన్ని ఏమనాలి? మూడు యుద్ధాలతో బుద్ధి వచ్చిందని చెబుతూ మరొక యుద్ధం గురించి మాట్లాడే దేశాన్ని ఎవరు బాగు చేస్తారు? ★

 | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




32లో

కథ

**న మాతుః పరదైవతమ్**

– కపిల సాయిమోహన్‌దాస్





| | | |
|---|---|---|
| న్యాయపాలిక.... మోనికా (మహిళ) | – | 14 |
| వెంకన్న భక్తులపై ఆర్థికభారం (ఆంధ్రప్రదేశ్) | – | 16 |
| ప్రవాస భారతీయుల సంక్షేమమే లక్ష్యం! (జాతీయం-1) | – | 24 |
| విద్యల తల్లికి అక్షరాంజలి (ప్రత్యేక వ్యాసం) | – | 26 |
| భారత్ ఎందుకు పేద దేశమైంది? (చర్చ) | – | 30 |
| చైతన్యం నింపిన బస్వా మానయ్య! (అమృతోత్సవాలు) | – | 36 |
| ప్రపంచ క్రికెట్లో భారత బుల్లెట్! (క్రీడ) | – | 43 |
| సంక్రాంతి చిత్రాలకు పాస్ మార్కులు! (సినిమా) | – | 50 |



రెండేళ్ల పాటు నాలుగు గోడల మధ్య బందీ అయిన జనం రెక్కవిప్పుకున్న పక్షుల్లా ఎగురుతున్నారు. ఎన్నో కొత్త ప్రదేశాల్లో వాలుతున్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ వివిధ ప్రాంతాలు ఇప్పుడు పర్యాటకులతో నిండిపోతున్నాయి. పుణ్యక్షేత్రాలు, పురాతన కోటలు, రాజమహళ్లు, మ్యూజియాలు, ఉద్యానవనాలు, బీచ్‌లు, వన్యప్రాణుల అభయారణ్యాలు కళకళలాడుతున్నాయి. విమానాశ్రయాలు రద్దీగా కనిపిస్తున్నాయి. హోటళ్లు కిటకిటలాడుతున్నాయి. కొత్త ప్రదేశాలను సందర్శిస్తూ పర్యాటక అనుభూతిని కొల్లగొట్టాలన్న ఆరాటం అంతకంతకూ పెరుగుతోంది. దీంతో ఈ ఏడాది పర్యాటక రంగానికి మహర్దశ అని నిపుణులు భావిస్తున్నారు.

# పరవళ్లు తొక్కుతున్న

కరోనా ప్రభావం పడని రంగం ఏదీ లేదు. మిగతా రంగాల కంటే అది పర్యాటక రంగాన్ని దారుణంగా దెబ్బతీసింది. విమానయానం, రవాణా, హోటళ్లు, ఆతిథ్యరంగం, టూర్ ఆపరేటర్లు... పర్యాటక రంగానికి సంబంధించిన ప్రతిదీ ప్రతికూల ప్రభావాన్నే చూసింది. మన దేశం కూడా అందుకు మినహాయింపు కాదు. గత ఏడాది నుంచి పరిస్థితులు మెరుగుపడ్డాయి. మెల్లమెల్లగా కాలూచేయి కూడదీసుకుని పూర్వవైభవం దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ ఏడాది భారత్‌కు ప్రత్యేకం. జీ20 అధ్యక్ష హోదాను దక్కించుకున్న దేశం ఈ ఏడాది ఎన్నో సమావేశాల నిర్వహణకు రంగం సిద్ధం చేస్తోంది. దేశ, విదేశాలకు సంబంధించిన ఎందరో అతిథులు మనదేశానికి విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సురక్షిత, టూరిస్టు హిత గమ్యమైన ప్రదేశంగా భారత్‌ను ప్రపంచ దేశాలు గుర్తించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతోంది. వివిధ నగరాల్లో దాదాపు 300 వరకూ సమావేశాలు ఏర్పాటవుతాయని అంచనా. దేశంలోని ప్రసిద్ధ హోటళ్ల ప్రాంగణాలు ఇందుకు వేదికలు కానున్నాయి. భారతీయ సాంప్రదాయం ఉట్టిపడేలా, సేవల్లో 'అతిథి దేవోభవ' అన్న సంస్కారం ప్రదర్శించేందుకు ఆతిథ్యరంగం తన శాయశక్తులూ ఒడ్డుతోంది. హోటళ్లు, రిసార్టులు ఆధునికతను సంతరించుకుంటున్నాయి. వాటికి అనుబంధంగా మౌలిక సదుపాయాల కల్పనకూ రాష్ట్ర, జిల్లా యంత్రాంగాలు కదులుతున్నాయి.

టూరిజం అనేది ఆర్థిక రంగానికి చుక్కాని. అది ప్రత్యక్షంగా, పరోక్షంగా వివిధ రంగాలను ప్రభావితం చేస్తుంది. ఉపాధి కల్పనకు అవకాశమిస్తుంది. ప్రపంచాన్ని కొత్తగా చూడటం ఎలాగో నేర్పుతుంది. అంతేకాదు. 'క్రాస్ కల్చరల్ ఇంటరాక్షన్'–అంటే వివిధ సంస్కృతులు, సంప్రదాయాలు, నేపథ్యాలు ఉన్నవారి మధ్య బంధం బలపడేలా చేస్తుంది. తాము సందర్శించిన ప్రదేశాలు మిగిల్చిన అనుభూతులు ఆయా ప్రాంతాలు, అక్కడి వ్యక్తుల పట్ల ఏదో తెలియని అభిమానం, మమకారం ఏర్పరుస్తాయి. దీనివల్ల ప్రాంతాల మధ్య, దేశాల మధ్య పరస్పర అవగాహన, మైత్రి సాధ్యపడుతుంది. దానివల్ల శాంతియుత వాతావరణానికి అవకాశం ఉంది. ఒక దేశం బ్రాండ్ ఇమేజిని పెంచేది పర్యాటకమే. వాణిజ్య కార్యకలాపాలకు అది ఊతమిస్తుంది. రెవెన్యూ పెరుగుతుంది. విదేశీమారక ద్రవ్యం సంపాదించి పెడుతుంది. ఇకపోతే, ఉపాధి కల్పన పరంగా ఈ రంగం విశిష్టమైనది. ప్రతి హోటల్ గది ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఐదు నుంచి ఏడు రకాల ఉద్యోగాలను కల్పిస్తుంది. అలాగే రియల్ ఎస్టేట్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ రంగాలపైన ప్రభావవంతమైన పాత్రను పోషిస్తుంది. పర్యాటకులు సందర్శించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం



కాశీ



విరూపాక్ష దేవాలయం (హంపి)



దాల్ సరస్సు

# పర్యాటకరంగం

కృషి చేస్తుంది. రహదారులు, రైల్, రోడ్డు వసతి, ఎయిర్‌పోర్టుల అభివృద్ధి, యుటిలిటీస్ (తాగునీరు, విద్యుత్తు, పారిశుద్ధ్య) సేవల్లో నాణ్యతను మెరుగు పరిచేందుకు కృషి చేస్తుంది. వన్యప్రాణుల సంరక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటుంది. యాత్రికుల రద్దీ పెరగటం వల్ల హొటళ్లు, రిటైల్ షాపులు, ట్రాన్స్‌పోర్టు సర్వీసులు, వినోద ప్రదేశాలు లబ్ధి పొందుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే పర్యాటక రంగం అనేది.. వివిధ సమాజాలను ఒకటిగా చేసి మూసధోరణుల నుంచి బయటపడటానికి, ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనలకు, ప్రపంచ స్థాయిలో భౌగోళిక గుర్తింపులతో దేశం అభివృద్ధి చెందటానికి ఉపకరిస్తుంది. అది జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది కూడా.

కొంతమందికి ట్రావెలింగ్ అనేది ఒక ఫ్యాషన్. అభిరుచి అని చెప్పవచ్చు. మానసిక వికాసానికే కాదు. అంతర్గత ప్రేరణతో తమ వృత్తులలో రాణించటానికి అవసరమైన ఉత్సాహాన్ని ప్రోది చేసుకోవటానికి కూడా పర్యటనలు చేస్తుంటారు.

భారత ఆర్థికవ్యవస్థ ఎదుగుదల, వృద్ధిలో పర్యాటక రంగం కీలకపాత్ర పోషిస్తోంది. వరల్డ్ ట్రావెల్ అండ్ టూరిజం కౌన్సిల్ (డబ్ల్యుటీటీసీ) అంచనాల ప్రకారం, టూరిజం రంగం 13.2 లక్షల కోట్ల రూపాయలను (170 బిలియన్ల అమెరికన్ డాలర్లు) సంపాదించి పెట్టింది. ఇది జీడీపీలో 5.8 శాతం. అంతేకాదు. దీనివల్ల మూడు కోట్ల 21 లక్షల ఉద్యోగాలు సృష్టికి వీలయ్యింది. ఈ గణాంకాలు 2021 నాటివి. గత ఏడాది పర్యాటకం అంతకు ముందు ఏడాది కంటే పుంజుకుంది. ఈ సంఖ్య మరింత పెరిగి ఉంటుందనటంలో ఎలాంటి సందేహం లేదు. టూరిజం రంగం మొత్తం నాలుగు కోట్ల 26 లక్షల ఉద్యోగాలను కల్పించిందని ఒక ప్రయివేటు సంస్థ తన అధ్యయనంలో పేర్కొంది. అంటే మొత్తం ఉద్యోగాలలో 8.1 శాతం. 'పర్యాటక రంగాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చాలనేది ప్రభుత్వ విధానం. ఇందుకోసం ప్రభుత్వం అనేక కార్యక్రమా లను చేపడుతోంది' అని పేర్కొన్నారు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి. జీ 20 నేతృత్వం అనేది అన్ని శాఖలకు కీలకం. దానిని దృష్టిలో పెట్టుకుని పని చేయాలి. ప్రపంచం అంతా భారత్‌ను చూడాలని ఆశిస్తోంది. వాళ్లు మనకు కేవలం టూరిస్టులు కారు. భారత్‌ను ప్రభావితం చేసేవాళ్లు అని ఆయన అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాల సందర్భంగా, ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా భారతదేశ సహజ సౌందర్యం, సాంస్కృతిక వారసత్వం, ఆధ్యాత్మిక వైభవాలను ప్రదర్శించటానికి రివర్స్ క్రూజింగ్ వంటి వినూత్న పర్యాటక వనరులను, ఉత్పత్తులను అందిస్తున్నదని ఆయన పేర్కొన్నారు.

వచ్చే దశాబ్దంలో పర్యాటక రంగం అంతర్జాతీయంగా 2 కోట్ల 60 లక్షల కొత్త ఉద్యోగాలను కల్పిస్తుంది. ఇందులో 20 శాతం భారత ఉపఖండం నుంచే లభిస్తాయి. దీనిని సాధించేందుకు ప్రభుత్వ సహకారం అవసరం అవుతుంది. ప్రస్తుతం భారతీయ కంపెనీలు ఈ ఆర్థిక సంవత్సరంలో సానుకూల ఫలితాలు సాధిస్తూండటంతో అది అసాధ్యం కాదనే విషయం స్పష్టమవుతోంది. అంతేకాదు, విపత్తు ముందున్న నాటి పరిస్థితులకు మూడు రెట్లు అధికమై, 2030 నాటికి 250 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుతుందంటున్నారు. అది క్రమంగా అధికమై 2047 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ స్థాయికి చేరుతుందని అంచనా వేస్తున్నారు. ఆయా దేశాలు సాధించిన ఆర్థిక ప్రగతితో పాటు మరికొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని వరల్డ్ ఎకనమిక్



వైష్ణోదేవి ఆలయం



యాదాద్రి

ఫోరం (డబ్ల్యుఈఎఫ్) ద్వైవార్షికంగా ట్రావెల్ అండ్ టూరిజం ఇండెక్స్ (టీటీడీఐ)ను ప్రకటిస్తుంది. 2021లో దాదాపు 117 దేశాల స్థితిగతులను పరిగణించిన అనంతరం భారత్ 54 స్థానంలో ఉన్నట్టు పేర్కొంది. దాదాపు 17 అంశాలకు సంబంధించి 112 ఇండికేటర్లపైన అభిప్రాయ సేకరణ చేసింది. వాటన్నింటిని క్రోడీకరించిన తర్వాత ఫలితాలను ప్రకటిస్తుంది. ఇందులో భద్రత (సేఫ్టీ సెక్యూరిటీ), పర్యావరణ స్థిరత్వం (ఎన్విరాన్మెంట్ సస్టెయినబిలిటీ), ట్రావెల్, టూరిజం, ఎయిర్ ట్రాన్స్‌పోర్టు, మౌలిక సదుపాయాల కల్పన వంటి ఐదు కీలక అంశాలున్నాయి. అద్భుతమైన పనితీరు కనబరిచే దేశాలలో జపాన్ మొదటి స్థానంలో, అమెరికా ద్వితీయ స్థానంలో, స్పెయిన్ మూడో స్థానంలో ఉండగా… జర్మనీ, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, యూకే, సింగపూర్, ఇటలీలు వరుసగా తర్వాత స్థానాలను దక్కించుకున్నాయి. బ్రిక్స్ దేశాల విషయానికొస్తే, చైనా 12వ స్థానంలో, బ్రెజిల్ 49వ స్థానంలో ఉన్నాయి. భారత్ 54వ స్థానంలో ఉంటే, దక్షిణాఫ్రికా 68వ స్థానంలో నిలిచింది. సార్క్ దేశాల్లో శ్రీలంక (74), నేపాల్ (102), బంగ్లాదేశ్ (100), పాకిస్తాన్ (83), భారత్ కంటే దిగువనే ఉన్నాయి.

**కశ్మీరం కళకళ**

కశ్మీర్‌ను భూలోక స్వర్గం అంటారు. ప్రకృతి అందాలకు అది నెలవు. ఉద్యానవనాలు, పూలతోటలతో కనులపండువగా ఉంటుంది. నిన్నమొన్నటి వరకూ బాంబుల మోతతో, తీవ్రవాదుల దాడులతో, సైన్యం బూట్ల చప్పుళ్లతో దద్దరిల్లి రక్తపాతానికి నెలవుగా ఉన్న కశ్మీర్ లోయలో నేడు



గోల్కొండ

(ఆర్టికల్ 370 రద్దు తర్వాత) ప్రశాంత వాతావరణం నెలకొంది. పర్యాటకులు పోటెత్తు తున్నారు. ఈ భూఖండంలోనే అత్యంత పెద్దదయిన తులిప్ గార్డెన్‌ను చూడటానికి వస్తున్నారు. మంచు నిండిన హిమగిరి సొగసులను తనివితీరా వీక్షిస్తున్నారు. హిందూ రాజులు, మొగల్ చక్రవర్తులు, బ్రిటిష్ వలస పాలకులతో పాటు లక్షలాది మందిని సమ్మోహితుల్ని చేసిన ప్రకృతి సోయగాలను ఆస్వాదించటానికి వస్తున్నారు. శ్రీనగర్‌లో హౌస్ బోట్లు ఉండే దాల్



కోణార్క్

# పర్యాటకరంగంలో వ

- థామస్ కుక్ (22 నవంబరు, 1808- 18 జులై, 1892)ని 'ఫాదర్ ఆఫ్ టూరిజం'గా పేర్కొంటారు. ప్రపంచవ్యాప్త ట్రావెలింగ్ ఏజెన్సీ 'థామస్ కుక్'ను ప్రారంభించి పర్యటనలకు నాంది పలికింది ఆయనే. ప్రయాణంతో పాటు అద్దె గదుల వసతి, ఇతరత్రా సౌకర్యాలన్నింటికి ఛార్జీలను వసూలు చేసే 'ప్యాకేజీ టూర్‌లను కూడా ఆయనే ప్రారంభించారు. మొదట యూరప్‌లో రైల్ టూర్‌ను మొదలుపెట్టారు. 1860లో తన ఏజెన్సీని ప్రారంభించిన అనంతరం అమెరికా టూర్లు ఏర్పాటు చేశారు. 1880 ప్రాంతంలో ఈ కంపెనీ ఇంగ్లండ్, ఈజిప్టులలో మిలటరీ ట్రాన్స్‌పోర్టును, పోస్టల్ సర్వీసెస్‌ను కూడా చేపట్టింది. భారతదేశంలో కూడా మంచి ట్రావెల్ కంపెనీగా ఇది ప్రాచుర్యం పొందింది.
- బ్రిటిష్ వనిత మేరీజేన్ కార్బెట్‌ని 'మదర్ ఆఫ్ టూరిజం'గా పిలుస్తారు. ఈమె ప్రసిద్ధ పర్యావరణవేత్త జిమ్ కార్బెట్ తల్లి. టూరిజం సాంప్రదాయం అనే విత్తనాన్ని నాటింది ఆమే. అది శాఖోపశాఖలుగా వర్ధిల్లి, ఈ రోజు అక్కడ ప్రజలకు ప్రధాన వృత్తిగా మారటమే కాదు, ఆర్థికాభివృద్ధికి కీలక అంశంగా నిలిచింది. 130 సంవత్సరాల క్రితం, హిల్ టౌన్‌గా పిలిచే నైనిటాల్‌ని సందర్శించే వాళ్ల కోసం మొట్ట మొదట లాడ్జింగ్ సౌకర్యాన్ని ప్రారంభించింది. కాలగమనంలో ప్రభుత్వాలు, ప్రజలు కూడా ఆమెను విస్మరించారు. ఆమె ముస్సోరి, నైనిటాల్ కొండల్లో నివాసం ఉండి, చివరకు నైనిటాల్లోనే కన్నుమూసింది.
- భారతదేశంలో టూరిజం అనేది 19వ శతాబ్దంలో ప్రారంభం అయ్యింది. 1945లో ప్రారంభమైన సర్ జార్జి సార్జెంట్ కమిటీ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయటానికి ఏర్పాటయ్యింది.
- మొట్టమొదటి టూరిస్టు ఎవరు? ఇది తెలుసుకోవటం నిజంగా ఆసక్తి గొలిపే అంశం. ఏ మాత్రం సౌకర్యాలు లేని రోజుల్లో సిరియాకస్ ఆఫ్ అంకోనా (1391-1452) గ్రీకు, రోమన్ అవశేషాలపై అధ్యయనం చేసేందుకు మెడిటేరియన్ సాగరం మీదుగా ప్రయాణించారు.
- భారతీయ హోటల్ ఇండస్ట్రీ పితామహుడు రాయ్ బహదూర్ మోహన్ సింగ్ ఒబ్రాయ్‌ని ఫాదర్ ఆఫ్ ఇండియన్ టూరిజం అంటూంటారు.
- ప్రతి సంవత్సరం జనవరి 25వ తేదీని జాతీయ పర్యాటక దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా పర్యాటక రంగంలో సరికొత్త అవకాశాల గురించి, దాని వల్ల ఆర్థికాభివృద్ధిలో కలిగే ప్రభావం గురించి అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వం గత ఏడాది సంక్షోభం నుంచి పరివర్తన దిశగా (రీ థింకింగ్ టూరిజం.. ఫ్రం క్రైసిస్ టు ట్రాన్స్ ఫర్మేషన్) అన్న నినాదంతో కార్యక్రమాలు నిర్వహించింది. అజాదీ కా అమృత్ మహోత్సవ్ ప్రచారంలో పర్యాటకానికి భాగస్వామ్యం కల్పించింది. (ఈ ఏడాది థీమ్ ఇంకా నిర్ధారణ కాలేదు.)
- 1991లో భారతీయ పర్యాటకుల సంఖ్య 1.94 మిలియన్లు కాగా, 2021 నాటికి 4.9 శాతం వార్షిక వృద్ధి సాధించి (కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్.. సీఏజీఆర్) 8.55 మిలియన్లకు చేరుకుంది. కొవిడ్, దాని పర్యవసానంగా లాక్‌డౌన్ల కారణంగా 2020లో పర్యాటకుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. మరుసటి ఏడాది అంటే 2021లో సానుకూల వాతావరణం ఏర్పడింది. దాంతో ఒక్కసారిగా పర్యాటకుల సంఖ్య దాదాపు 17.4 శాతం అధికమైంది.
- 2021లో ప్రపంచవ్యాప్తంగా పర్యాటకం 5.4 శాతం వృద్ధి చెందింది. 2019, 2020,



లేక్‌ని చూసి పరవశిస్తున్నారు. అక్కడే ఉండే నిషాత్ గార్డెన్ అందాలను చూసి మైమరిచిపోతున్నారు. కార్గిల్ నుంచి శ్రీనగర్, పాడుం, లెహ్‌లకు ప్రయాణించటానికి చక్కటి రోడ్డు మార్గం ఉంటుంది. ట్రెక్కింగ్, మౌంటనీరింగ్‌లకు ఈ ప్రాంతం ప్రసిద్ధి. సాధారణంగా మార్చి నుంచి ఆగస్టు వరకూ కశ్మీర్ పర్యటనకు అనుకూలమైన సమయం. ఈ సీజన్లో అయితే హిమపాతం ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం అనేక ప్రాంతాలు మంచుదుప్పటి కప్పుకున్నట్టుగా తయారయ్యాయి. లెహ్, రాజౌలి తదితర ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విమానాశ్రయాలు కూడా మంచుతో నిండిపోవటంతో ప్రయాణాలను నిలిపివేశారు.

1990 నుంచి కశ్మీర్ తీవ్రవాదుల నిలయంగా ఉండేది. వేలాది మంది అమాయక ప్రజలు తీవ్రవాదుల కారణంగా మృత్యువాతపడ్డారు. దాంతో పర్యాటకుల సంఖ్య బాగా తగ్గిపోయింది. అయితే దశాబ్దం తర్వాత పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. సందర్శకులను ఆకర్షించటానికి, శ్రీనగర్ అధికారులు 2007లో తులిప్ గార్డెన్ ప్రారంభించారు. హౌస్ బోట్లతో నిండి ఉండే దాల్ లేక్‌కి, జబర్వాన్ హిల్స్‌కి మధ్య ఉన్న 30 హెక్టార్ల ప్రదేశంలో దీనిని ఏర్పాటు చేశారు. 12 రంగులు, పారడ్ నుంచి టెక్సాస్ గోల్డ్ వరకూ 68 రకాల తులిప్ రకాలు చూడముచ్చటగా ఉంటాయి. కరోనా తర్వాత ఈ ఉద్యానవనాన్ని చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో విచ్చేస్తున్నారు. గత ఏడాది 20 లక్షల మంది కశ్మీర్‌ను సందర్శించారని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.




**డాక్టర్ పార్థసారథి చిరువోలు**
**సీనియర్ జర్నలిస్ట్**



ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే మూడు రెట్లు అధికం. జమ్ముకశ్మీర్‌కి పర్యాటకులు తరలిరావటం మంచి పరిణామంగా కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2019లో ఆర్టికల్ 370ను రద్దు చేసి జమ్ముకశ్మీర్, లద్దాఖ్‌లను కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్పు చేసింది. దాంతో భయం గుప్పిట్లో బతికిన కశ్మీర్ వాసులు ఊపిరి పీల్చుకుంటున్నారు. తీవ్రవాదుల ఉనికి మాయమైంది. దీనిపై హోం మంత్రి అమిత్


# ...లుపులు, మెరుపులు

2021లలో పర్యాటకుల సంఖ్య 1466 మిలియన్లు, 405 మిలియన్లు, 427 మిలియన్లుగా నమోదయ్యారు.

- పర్యాటకులు ఎక్కువగా విచ్చేసే దేశాలలో ఫ్రాన్స్ ప్రథమస్థానంలో ఉంది. ఇటలీ, మెక్సికో, యూఎస్ఏ, స్పెయిన్, టర్కీ, ఆస్ట్రేలియా, జర్మనీ, యూకె, పోలెండు మొదటి పది స్థానాల్లో ఉన్నాయి. ప్రాంతాల వారీగా చూస్తే, 286.8 మిలియన్ల మంది యూరప్‌ను సందర్శించారు. తర్వాత 82.4 మిలియన్ల టూరిస్టులతో అమెరికా, 20.7 మిలియన్ల టూరిస్టులతో ఆసియా, పసిఫిక్, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా తర్వాత స్థానాల్లో ఉన్నాయి.
- పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ఉండే ప్రదేశాల్లో తాజ్‌మహల్‌ను సందర్శించటానికి ఎక్కువ మంది పర్యాటకులు ఇష్టపడుతున్నారు. తర్వాత స్థానాల్లో ఎర్రకోట, కుతుబ్ మినార్, మామల్లపురం, ఆగ్రాఫోర్ట్, గోల్కొండ ఫోర్ట్, సన్ టెంపుల్, కోణార్క్, అప్పర్ ఫోర్ట్ అగుఆటా, చిత్తోర్‌గఢ్, శనివార్వాడా ఉన్నాయి.
- కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం, 2021లో నెలవారీ ఫారిన్ ఎక్స్ఛేంజి (ఎఫ్ఈఈ) వసూళ్లు 65,070 కోట్లు. 2020లో 50,136 కోట్లతో పోలిస్తే అది 29.8 శాతం వృద్ధి చెందింది. అమెరికా డాలర్ల రూపంలో చెప్పాలంటే, 2020లో 6.95 బిలియన్ డాలర్లయితే, 2021లో 8,7970 బిలియన్ డాలర్లకు చేరింది.
- విదేశీ పర్యటనల్లో భాగంగా మన భారతీయ పర్యాటకులు ఎక్కువ మంది సందర్శించిన ప్రాంతాల్లో దక్షిణాసియా మొదటి స్థానంలో ఉంది. తర్వాత స్థానాల్లో ఉత్తర అమెరికా, పశ్చిమ ఆసియా, యూరప్, ఆఫ్రికా తదితర దేశాలు ఉన్నాయి. భారత టూరిస్టులు ఎక్కువ సమయం గడిపే దేశాల్లో పోర్చుగల్ (201.49 రోజులు) తొలిస్థానంలో ఉండగా, న్యూజిలాండ్ (195.86), ఐర్లాండ్ (169.62), ఇటలీ (161.78), స్వీడన్ (161.20), జెక్ (152.18) ఉన్నాయి. భారతీయులు తక్కువ సమయం గడిపే దేశాల్లో చైనా (6.48 రోజులు), మాల్దీవులు (17.52), శ్రీలంక (21.32), పాకిస్తాన్ (24.80), బంగ్లాదేశ్ (31.40) ఉన్నాయి.
- భారతీయ పర్యాటకులు రోడ్డు, రైళ్లతో పోలిస్తే ఎక్కువగా విమానాయానాన్ని ఆశ్రయించారు. ఈ విషయంలో హైదరాబాద్ ఎయిర్‌పోర్టు ఆరో స్థానంలో ఉంది. ఢిల్లీ, ముంబయ్, చెన్నై, కొచ్చిన్, బెంగుళూరు ఎయిర్ పోర్టులు మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. కాలికట్, త్రివేండ్రం, కలకత్తా, అహ్మదాబాద్ ఎయిర్ పోర్టులు 10లోపు స్థానాలను దక్కించుకున్నాయి.
- కొత్త ప్రదేశాలను సందర్శించటం వల్ల మానసికంగా చైతన్యం కలుగుతుంది. ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలలో మనకు ఏ మాత్రం సంబంధం లేని వ్యక్తులతో మన అనుభవాలను పంచుకోవటం సంతోషాన్ని ఇస్తుంది. వాషింగ్టన్ స్టేట్ యూనివర్సిటీ ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో ఒక ఆసక్తికరమైన అంశం వెల్లడయ్యింది. సంవత్సరంలో కొన్ని మార్లు పర్యటనలు చేపట్టి.. కనీసం ఇంటి నుంచి 75 మైళ్లన్నా వెళ్లగలిగినవారు, అసలు పర్యటించిన వారితో పోలిస్తే ఏడు శాతం అత్యధిక సంతోషంగా ఉంటారట.



ఢిల్లీ గేట్


సోమనాథ్


రామప్ప


అరకు వ్యాలీ యాత్ర

షా మాట్లాడుతూ, 'ఒకప్పుడు అది టెర్రరిస్టు హాట్ స్పాట్. నేడు అది టూరిస్టు హాట్ స్పాట్' అని వ్యాఖ్యానించటం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.

**గంగానదిలో నౌకా విహారం**

'2024లో అయోధ్యలో రామాలయం పూర్తవుతుంది. అప్పుడు చూడండి. మా రాష్ట్రానికి పర్యాటకుల రద్దీ ఎంత పెరుగుతుందో' అంటున్నారు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్. హిందువుల్లో ప్రతి ఒక్కరూ తమ జీవితకాలంలో ఒక్కసారయినా అయోధ్య సందర్శించాలని ఆశపడతారని ఆయన చెప్పిన మాటల్లో అతిశయోక్తి లేదనిపిస్తుంది. కాశీ.. మతపరంగా, ఆధ్యాత్మిక పరంగా, ఇకో టూరిజం పరంగా విశిష్ట స్థానం పొందింది. భారతదేశపు అతి ప్రాచీన నగరాల్లో కాశీ ఒకటి. ఇక్కడ ప్రవహించే గంగానదిలో స్నానం ఆచరిస్తే సర్వపాపాలు నశించి పునర్జన్మ నుంచి విముక్తి పొందుతారని హిందువులు నమ్ముతారు. అలాగే 'కాశ్యాన్తు మరణాన్ ముక్తి' అంటే కాశీలో మరణిస్తే ముక్తి లభిస్తుందన్న విశ్వాసం కూడా భక్తుల్లో ఉంది. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన విశ్వేశ్వర లింగం ఇక్కడ ఉంది. జైనులకు కూడా ఇది పుణ్యక్షేత్రం.

కాశీలో కాశీవిశ్వనాథుని ఆలయం, విశాలాక్షి ఆలయం, కాలభైరవాలయం, మృత్యుంజయేశ్వరాలయం, సారనాథ్ మందిరం, వ్యాసకాశిలతో పాటు దాదాపు 23వేలకు పైగా ఆలయాలున్నాయి. ఏటా కోటి మంది వరకూ పర్యాటకులు ఈ ప్రాంతానికి విచ్చేస్తారు. కాశీవిశ్వనాథ్ ధామం కొత్త హంగులు దిద్దుకున్న తర్వాత ఒక్క శ్రావణంలోనే కోటి మంది వరకూ యాత్రికులు విచ్చేశారు. ఇక ప్రయాగ్ రాజ్‌లో 2019లో కుంభమేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 24 కోట్లమంది భక్తులు హాజరయ్యారు. ఇకపోతే, ప్రభుత్వం రూ. 30వేల కోట్ల ఖర్చుతో మథుర-బృందావన్‌లో మౌలిక సదుపాయాల మెరుగుపరుస్తోంది. పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. తాజాగా 38వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి పర్యాటక మంత్రిత్వ శాఖ ఎంఓయూలు చేసుకుంది. భారత్ ఘనమైన సంస్కృతి, చరిత్రలను తెలుసుకుంటూ, మన దేశ వారసత్వ పరంపరను అవగాహన చేసుకుంటూ, జాతీయ ఉద్యానవనాలను తిలకిస్తూ 27 నదుల మీదుగా సాగే నౌకావిహారానికి వారణాసి వేదిక య్యింది. జనవరి 13వ తేదీన ప్రధాని మోదీ దీనిని ప్రారంభించారు. సాధారణంగా నౌకలనగానే అవి సముద్రం మీద ప్రయాణిస్తాయి. నదుల మీద నౌక ప్రయాణించటం విశేషం. అంతకు మించిన ప్రత్యేకతలు దీనికి ఉన్నాయి. బంగ్లాదేశ్ చారిత్రక మూలాలను కూడా తెలుసుకునే అవకాశం లభిస్తుంది. వారణాసి నుంచి బయలుదేరే 'గంగా విలాస్' అనే పేరు గల ఈ నౌక 51 రోజుల పాటు మొత్తం 3,200 కి.మీ. దూరం ప్రయాణిస్తుంది. బంగ్లాదేశ్ మీదుగా అస్సాంలోని డిబ్రూగర్ చేరుకుంటుంది. ఎనిమిదో రోజు పట్నాకి, 20వ రోజు కోల్‌కత్తాకి, 35వ రోజు బంగ్లాదేశ్‌లోని ఢాకాకు చేరుకుంటుంది. నౌకలో మూడు అంతస్తులు, 18 సూట్స్ ఉంటాయి. 62 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు, సౌకర్యవంతంగా ప్రయాణించటానికి వీలుగా 1.4 మీటర్ల డ్రాఫ్టు ఉంటుంది. నౌకలో జిమ్, స్పా వంటి సదుపాయాలు ఉంటాయి. ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పెంచేలా సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు ఉంటాయి. గంగావిలాస్ తొలి పర్యటనకు 32 మంది న్యూజిలాండ్ వాసులు మొత్తం నౌకను బుక్ చేసుకోవటం విశేషంగా చెప్పుకోవాలి.

**మూడో స్థానంలో ఆంధ్రప్రదేశ్**

మన దేశంలో టూరిస్టులు ఎక్కువ ఏ ప్రాంతాలను చూస్తారు? వారిని ఆకర్షించే అంశాలేమిటి? అనేది ఆసక్తికరంగా ఉంటుంది. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి అందిన సమాచారాన్ని క్రోడీకరించి పర్యాటకశాఖ ఫలితాలను ప్రకటిస్తుంది. 2021లో దేశీయ టూరిస్టులు సందర్శించిన ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉంది. 93.27 మిలియన్ల మంది పర్యాటకులు ఆ రాష్ట్రాన్ని సందర్శించారు. 115.33 మిలియన్ల మంది పర్యాటకులతో తమిళనాడు మొదటిస్థానంలో, ఉత్తరప్రదేశ్ (109.70మిలియన్లు) రెండో స్థానంలో ఉన్నాయి. కర్ణాటక (81.33 మిలియన్లు), మహారాష్ట్ర (43.56 మిలియన్లు) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ఇక విదేశీయులు సందర్శించే రాష్ట్రాల్లో పంజాబ్ (0.3 మిలియన్), మహారాష్ట్ర (0.18 మిలియన్), ఢిల్లీ (0.1 మిలియన్), కర్ణాటక (0.072 మిలియన్), కేరళ (0.06 మిలియన్) ఉన్నాయి.

స్వదేశీ టూరిస్టులు సందర్శించే రాష్ట్రాలలో.. తమిళనాడు 17.02 శాతం, ఉత్తరప్రదేశ్ 16.19 శాతం, ఆంధ్రప్రదేశ్ 13.77 శాతం, కర్ణాటక 12 శాతం, మహారాష్ట్ర 6.43శాతం, తెలంగాణ 4.72 శాతం, పంజాబ్ 3.93 శాతం, మధ్యప్రదేశ్ 3.77 శాతం, గుజరాత్ 3.62శాతం, పశ్చిమబెంగాల్ 3.59 శాతంగా ఉన్నాయి. విదేశీ టూరిస్టులు సందర్శించిన ప్రదేశాల్లో పంజాబ్ 29.22 శాతం, మహారాష్ట్ర 17.6శాతం, ఢిల్లీ 9.5 శాతం, కర్ణాటక 6.87 శాతం, కేరళ 5.74 శాతం, తమిళనాడు 5.46 శాతం, ఉత్తరప్రదేశ్ 4.24శాతం, మధ్యప్రదేశ్ 3.94 శాతం, పశ్చిమబెంగాల్ 3.30 శాతం, రాజస్థాన్ 3.3 శాతంగా ఉన్నాయి.

తమిళనాడులో అనేక దేవాలయాలు, వారసత్వ కట్టడాలు, హిల్ స్టేషన్లు, హెరిటేజ్ సైట్లు, జలపాతాలు, నేషనల్ పార్కులు, వన్యప్రాణుల అభయారణ్యాలు ఉన్నాయి. దేశంలో ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించే రాష్ట్రంగా తమిళనాడు నిలవటానికి ఇదే ప్రధాన కారణం. ఇక్కడ దాదాపు 74 ప్రదేశాలను ప్రాధాన్యం గల గమ్యాలుగా చెబుతారు. ఇందులో చెన్నై, రామేశ్వరం, ఏర్కాడ్, కొడైకెనాల్, ఊటీ, కన్యాకుమారి తదితరాలు ఉన్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే తిరుపతి, విశాఖపట్టణం, అరకు, శ్రీశైలం, అనంతపురం, అమరావతి, పాపికొండలు తదితర ప్రదేశాలను చూసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. పర్యాటక శాఖ, అటవీశాఖ సహకారంతో ఉత్తరాంధ్రలోని అరకు, అనంతగిరి, సరుగుడులలో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొంది స్తోంది. దట్టమైన అటవీప్రాంతంలో పర్యాటకులు రాత్రి బస చేయటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతగిరిలో 10 నుంచి 12 కాటేజీలను



తిరుమల



పాపికొండలు

నిర్మిస్తున్నారు. అక్కడ కాఫీ ప్లానిటేషన్లు ఉన్న ప్రాంతం అనువైనదిగా భావిస్తున్నారు. ఏపీ ఫారెస్టు డెవలప్‌మెంటు కార్పొరేషన్ (ఏపీఎఫ్‌డీసీ)తో దీని కోసం చర్చలు జరుపుతున్నారు. ప్రాజెక్టు వ్యయం రూ. ఐదు కోట్లు. వచ్చే రెండేళ్లలో వీటి నిర్మాణం పూర్తవుతుంది. తెలంగాణలోని హైదరాబాద్‌లోఎక్కువ చారిత్రక ప్రాధాన్యం ఉన్న ప్రదేశాలున్నాయి. దానితో పాటు నగరంలోనూ, దాని సమీప ప్రాంతాల్లోనూ అనేక దర్శనీయ స్థలాలున్నాయి. వరంగల్, నాగార్జునసాగర్, భద్రాచలం, ఆదిలాబాద్ తదితర ప్రదేశాలను సందర్శించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపిస్తారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ తన 'స్వదేశీ దర్శన్' స్కీంలో భాగంగా దేశంలోని ఎనిమిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మొత్తం 19 స్థలాలను ఎంపిక చేసింది. దక్షిణాదిలో కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు, హంపీలను ఏడాది పొడవునా పర్యాటకులను ఆకర్షించే ప్రదేశాలుగా గుర్తించింది. కర్ణాటకతో పాటు, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, బిహార్, గోవా, గుజరాత్, కేరళలలో రెండు ప్రాంతాలు, చండీగఢ్, లద్దాఖ్‌లలో ఒక్కో ప్రదేశాన్ని ఎంపిక చేశారు. ఆయా రాష్ట్రాలు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించటానికి ఇతోధిక కృషి చేస్తున్నాయి. పర్వత ప్రాంతాలు, నదులు, బీచ్‌లు, వెట్ ల్యాండ్స్, ఫారెస్టు, టీప్లాంటేషన్లు, వారసత్వ కట్టడాలు, సిటీ టూరిజం ఉన్న ప్రాంతంగా బెంగాల్ ప్రసిద్ధి చెందింది. సంస్కృతీ సాంప్రదాయాల ప్రకారంగానూ, ఆహారపు అలవాట్ల ప్రకారంగానూ ప్రత్యేకస్థానం సంపాదించుకుంది. విదేశీ టూరిస్టులను ఆకర్షించటంలో దేశంలో ఐదో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం 50 శాతం విదేశీయులు బంగ్లాదేశ్ నుంచి వస్తున్నారు. అమెరికా, యూరప్‌లతో సంబంధాలు మెరుగయితే పర్యాటకులు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతారని ఆ రాష్ట్రం భావిస్తోంది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఇటీవల రోడ్ షో నిర్వహించింది.

ఈ ఏడాది చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించటంతో మహారాష్ట్ర టూరిజం డెవలప్‌మెంటు కార్పొరేషన్ (ఎంటీడీసీ) వినూత్నమైన కార్యక్రమాన్ని తలకెత్తుకుంది. తన ఆధ్వర్యంలో పర్యాటకులకు 'సెరల్ ఫుడ్' అందించాలని నిర్ణయించుకుంది. రాగులు, సజ్జలు, జొన్నలు తదితర చిరుధాన్యాలతో చేసిన స్పెషల్ దోసె, ఊతప్పం, ఖిచిడి, బిస్కెట్లు, కేకు, మోదక్, పాపడ్, ఉప్మా తదితరాలను అందుబాటులోకి తెస్తోంది.

గోవా టూరిజం శాఖ అక్కడ బీచ్‌లను శుభ్రం చేసేందుకు రూ.10 కోట్లను ఏటా ఖర్చు చేస్తోంది. ఇంత వెచ్చించినా అక్కడక్కడా బీచ్‌లు మురికిగా ఉండటంతో బీచ్‌ను శుభ్రం చేసే సమయాన్ని రాత్రి 9గంటల వరకూ పొడిగించారు. అంతేకాదు, ఇటీవల బీచ్‌లను శుభ్రం చేసే బాధ్యత సంబంధిత పంచాయతీలు కూడా తీసుకోవాలని సూచించారు. అలాగే బీచ్‌ల దగ్గర స్వచ్ఛతను దెబ్బతీసే వారికి జరిమానాలు కూడా వేయాలని చూస్తున్నారు.

మధ్యప్రదేశ్ టూరిజం శాఖ గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆఫ్ పీపుల్స్ ఇండియన్ ఆరిజన్ (జీఓపీఐఓ) సంస్థతో కలిసి ఇటీవల ఎంఓయూ కుదుర్చుకుంది. విదేశాలలో ఉండే ఈ సంస్థల శాఖలు మధ్యప్రదేశ్‌లో ఉండే పర్యాటక ప్రదేశాల గురించి ప్రచారం నిర్వహిస్తాయి.

**పర్యాటక శాఖ అదనపు సేవలు**

పర్యాటక మంత్రిత్వ శాఖ కొందరు టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెంట్లు, టూరిస్టు ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్లు, అడ్వంచర్ టూర్ ఆపరేటర్లు, డొమెస్టిక్ టూర్ ఆపరేటర్లకు గుర్తింపునిస్తోంది. ఇందుకోసం వెబ్ ఆధారిత పబ్లిక్ డెలివరీ సిస్టమ్ (పీడీఎస్)ను ఏర్పాటు చేసింది. Etraveltradeapproval. nic.inలో ఆసక్తి గలవారు ఎవరైనా సంప్రదించవచ్చు. 30 జూన్ 2022 నాటికి 40 ట్రావెల్ ఏజెంట్లు, 16 టూరిస్టు ట్రాన్స్ పోర్టు ఆపరేటర్లు, 50 గ్రీన్ షూట్స్/స్టార్టప్‌లు, 105 టూర్ ఆపరేటర్లు రిజిస్టరయి ఉన్నారు. అలాగే హోటళ్లను స్టార్ రేటింగ్ ప్రకారం వర్గీకరిస్తోంది. ఒక స్టార్ నుంచి ప్రారంభించి, ఐదు స్టార్‌లు, ఐదు స్టార్‌ల డీలక్స్ వరకూ హోటళ్లు అందుబాటులో ఉంటాయి. ఆన్‌లైన్లో ఇందుకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంటాయి.


ఆతిథ్య రంగంలో మానవవనరులను సిద్ధం చేసుకోవటానికి కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంటు (ఐఐటీటీఎం), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంటు అండ్ ఫుడ్ క్రాఫ్ట్‌లను ఏర్పాటు చేసింది. ఐఐటీటీఎం స్వయంప్రతిపత్తి ఉన్న సంస్థ. పర్యాటక మంత్రిత్వ శాఖ 1983లో న్యూఢిల్లీలో దీనిని ప్రారంభించింది. ప్రస్తుతం దీని శాఖలు నెల్లూరు, భువనేశ్వర్, గ్వాలియర్, నోయిడా, గోవా, షిల్లాంగ్, బోధ్ గయలలో ఉన్నాయి. ఇందులో బీబీఏ, ఎంబీఏ, పీహెచ్‌డీ కోర్సులతో పాటు 14 నెలల డిప్లమా కోర్సులు కూడా ఉన్నాయి. హోటల్ మేనేజ్‌మెంటు, కేటరింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను అప్పటి కేంద్ర ప్రభుత్వం 1982లో ప్రారంభించింది. ఇది బీఎస్సీ, ఎంఎస్సీ హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్ కోర్సులను నిర్వహిస్తోంది. దాంతోపాటు ఒకటిన్నర సంవత్సరాల పాటు ఉండే డిప్లమో ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ కోర్సులను కూడా నిర్వహిస్తోంది.

పర్యాటకులకు నాణ్యమైన సేవలు అందించేందుకు ఈ రంగం ఎప్పటికప్పుడు తనను కొత్తగా ఆవిష్కరించుకుంటోంది. మారుతున్న అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తోంది. దీనివల్ల పర్యాటకులకు సరికొత్త అనుభూతి సొంతమవుతోంది. పెట్టుబడులు ప్రవహిస్తున్నాయి. ఇది నిరంతరం కొనసాగవలసిందే. ప్రభుత్వం కూడా తన వంతు ప్రోత్సాహం అందించాలి. రెగ్యులారిటీ నిబంధనలను సడలించటం, తక్కువ వడ్డీకి రుణాలు, పన్నుల్లో రాయితీలు వంటి చర్యలు చేపట్టాలని ఈ రంగం కోరుతుంది. దానితోపాటు ఆతిథ్య రంగానికి పరిశ్రమల హోదా కల్పించటం వల్ల కూడా మంచి ఫలితాలు వస్తాయి. మహారాష్ట్ర, కర్ణాటక, అస్సాం, గోవా, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాలు ఈ దిశగా ముందడుగు వేశాయి. మిగిలిన రాష్ట్రాలు కూడా ఇదే బాటలో నడవలసి ఉంది. అలాగే ఆతిథ్య రంగంలో ఉన్న కంపెనీలు బడ్జెట్, బిజినెస్, లగ్జరీ హోటళ్లు, హోమ్ స్టేలు, విల్లాలు వంటివి మరికొన్ని కొత్తవి ఏర్పాటు చేయటం ద్వారా ఈ ఏడాది అదనంగా కొత్త అవకాశాలను కొల్లగొట్టొచ్చు. ★



# జోషిమఠ్ కుంగు

'గేట్ వే టు ది వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్'గా పరిగణించే జోషిమఠ్ ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని చమోలీ జిల్లాలో సముద్రమట్టానికి 6150 అడుగుల ఎత్తున ఉన్న పట్టణం. హిమాలయ పర్వతారోహణలకు, ట్రెక్కింగ్‌కు, బద్రీనాథ్ యాత్రకు దీన్ని ముఖద్వారంగా పరిగణిస్తారు. ఒక పర్వత ఏటవాలుతలంలో ఉన్న ఈ చిన్న పట్టణ ప్రాంతంలో భౌగోళికంగా అస్థిర పరిస్థితులు కొనసాగుతున్నాయి. వందేళ్ల క్రితం భూకంపం కారణంగా కూలిపోయిన కొండచరియ శిథిలాలపై ఈ పట్టణం నిర్మితమైంది. ప్రస్తుతం కుంగిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న ఈ పట్టణానికి ఈ సమస్య కొత్తదేం కాదు.



**19**76 తొలినాళ్లలోనే జోషిమఠ్ వద్ద అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలు పట్టణం కుంగిపోయే ప్రమాదమున్నదని హెచ్చరించారు. ఇక్కడ భారీ నిర్మాణాలు చేపట్టకూడదని కూడా స్పష్టం చేశారు. తర్వాతి కాలంలో బద్రీనాథ్ (45 కి.మీ.దూరం), కేదార్‌నాథ్ వెళ్లే యాత్రికుల సంఖ్య విపరీతంగా పెరగడంతో పట్టణంలో పెద్ద ఎత్తున హోటళ్లు, రిసార్టులు వెలిసాయి. రవాణాకు విపరీతంగా వాహనాల వినియోగం వల్ల వాతావరణ కాలుష్యం పెరిగిపోయింది. ఇదే సమయంలో యాత్రికులు వదలివెళ్లే ప్లాస్టిక్ వ్యర్థాలు కూడా కాలుష్యాన్ని పెంచేస్తున్నాయి. అంతేకాకుండా పట్టణం చుట్టూ పెద్దఎత్తున జల విద్యుత్ కేంద్రాల నిర్మాణం జరిగింది. వీటన్నింటి ఫలితం ఇప్పుడు అనుభవించాల్సి వస్తున్నది. చమోలీ జిల్లాలోని వాతావరణ పరిస్థితులు కూడా ఎప్పటికప్పుడు పరీక్షలు పెడుతుంటాయి. ఇక్కడ భూకంపాలు, అధిక వర్షాలు, కొండచరియలు విరిగి పడటంతో పాటు, అడవులు దగ్ధం కావడం కూడా జరుగుతుంటుంది. జోషిమఠ్ పట్టణానికి కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉర్గామ్ ప్రాంతాల్లోని అడవుల్లో గడచిన నవంబర్ 1 నుంచి ఇప్పటివరకు 16 దావానల సంఘటనలు చోటుచేసుకోవడమే ఇందుకు ఉదాహరణ.



**జమలాపురపు విఠల్‌రావు**

సీనియర్ జర్నలిస్ట్

### కొంపముంచుతున్న ప్రాజెక్టులు

ప్రభుత్వం చేపడుతున్న వివిధ హైడ్రో పవర్ ప్రాజెక్టులు ప్రస్తుత విపత్తులకు కారణమని చమోలీ జిల్లా వాసులు ఆరోపిస్తున్నారు. జోషిమఠ్‌లో ప్రస్తుత దుస్థితికి, ఇక్కడి మార్వారీ జలాశయం తెగిపోవడం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. వాడియా సంస్థకు చెందిన శాస్త్రవేత్తల అంచనా ప్రకారం ఈ జలాశయం నుంచి ప్రస్తుతం నిమిషానికి 800 లీటర్ల నీరు బయటకు వస్తోంది. ఈ ప్రాజెక్టు వల్ల ఇతర ప్రాంతాల వాసుల ఇళ్లలో దీపాలు వెలుగుతున్నా, తమ ఇళ్లు కుప్పకూలి పోతున్నాయని జోషిమఠ్ వాసులు వాపోతున్నారు. నిజానికి ఉత్తరాఖండ్ రాష్ట్రం దేశంలోని భూకంప మ్యాప్‌లో సిస్మిక్ జోన్-4, సిస్మిక్ జోన్-5 పరిధిలో ఉంది. ఇప్పటి వరకు జోషిమఠ్‌లో 678 ఇళ్లు దెబ్బతినగా 81 కుటుంబాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. జోషిమఠ్‌లో 213, పిపల్‌కోటిలో 491 పునరావాస కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జోషిమఠ్‌తో పాటు కర్ణప్రయాగలో ఇళ్లు పగుళ్లు చూపుతుండటంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి ఇందుకు కారణాలను అధ్యయనం చేసే బాధ్యతను రూర్కీ యూనివర్సిటీకి చెందిన ఐఐటీ విభాగానికి అప్పగించింది. అలకనందా నదిపై ఉన్న పంచ ప్రయాగల్లో కర్ణ ప్రయాగ ఒకటి (మిగిలినవి విష్ణు ప్రయాగ, నంద ప్రయాగ, రుద్ర ప్రయాగ, దేవ ప్రయాగ).

ఉత్తరాఖండ్‌లో జోషిమఠ్, కర్ణప్రయాగ, ముస్సోరీ ప్రాంతాల తర్వాత ఇప్పుడు తెహ్రీ ఘర్వాల్ జిల్లా కూడా కుంగిపోయే జాబితాలో చేరడం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ముఖ్యంగా జిల్లాలోని చంబా పట్టణంలో ఎక్కువగా భూమి కుంగుబాటు చోటుచేసుకుంటున్నాయి. చహర్ ధ్యామ్ రోడ్డు ప్రాజెక్టు కోసం భూమిలో 440 మీటర్ల పొడవున నిర్మిస్తున్న టన్నెల్ చంబ మార్కెట్ ప్రాంతం గుండా వెళుతుంది. ఈ టన్నెల్ నిర్మాణం జరుగు తున్నప్పుడే ఇళ్లలో పగుళ్లు కనబడటం మొదలైందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నిజానికి ఉత్తరాఖండ్‌లో పర్వతాలు, నదులు, ఇరుకు దారులు కలిగిన ప్రాంతం మధ్యలో జోషిమఠ్ ఉంది. రాష్ట్రంలో 2000-2009 మధ్యకాలంలో కొండచరియలు విరిగిపడటం, వరదల కారణంగా 433 మంది అసువులు బాసారు. 2020-21 మధ్యకాలంలో విపరీతమైన వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల మరణించిన వారి సంఖ్య 1312. రాష్ట్రంలో 400 గ్రామాలు సురక్షిత నివాసయోగ్యాలు కావని నిపుణులు ఎప్పుడో తేల్చారు. 2021లోనే వరదలు, కొండ చరియలు విరిగిపడటం కారణంగా 300 మంది మరణించారు. ఇదంతా అధికారిక సమాచారమే. జోషిమఠ్ కుంగిపోవడం ఇలాగే కొనసాగితే పట్టణంలోని 40% మందిని ఖాళీచేయించక తప్పదని అధికారులు చెబుతున్నారు.

### తపోవన్ విష్ణుగడ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు

ప్రస్తుతం జోషిమఠ్ దుస్థితికి మానవ కార్యకలా

# బాటుకు కారణాలేంటి?

పాలే ప్రధాన కారణమన్న ఆరోపణలు వస్తున్నాయి. అన్నింటికంటే సమస్యాత్మకంగా మారింది తపోవన్ విష్ణుగడ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు. దీని విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 520 మెగావాట్లు. 2006లో ప్రారంభించిన దీన్ని ఎన్‌టీపీసీ నిర్వహిస్తుంది. నిజానికి 2009, 2012, 2014, 2021ల్లో ఈ ప్రాజెక్టు చుట్టూ వివాదాలు చోటుచేసుకున్నాయి. 2009లో టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) 900 మీటర్ల లోతున తవ్వకం జరుపుతుండగా ఆగిపోయింది. అప్పట్లో ఇక్కడినుంచి సెకనుకు 700 లీటర్ల చొప్పున నీరు బయటకు వచ్చింది. దీనివల్ల దాదాపు పదినెలలు పని నిలిపివేశారు. స్థానికులు ఆందోళన చేయడంతో తర్వాత ఎన్‌టీపీసీ జోషిమఠ్ వాసులకు నీటిసదుపాయం కల్పించింది. 2012లో టీబీఎం యంత్రం ఇట్లాగే ఇరుక్కుపోయింది. దాంతో 2013లో తపోవన్-విష్ణుగడ్ ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల పనితీరుపై సుప్రీంకోర్టు దృష్టి సారించి, 2013లో కేదార్‌నాథ్ వరదలపై ఇక్కడి ప్రాజెక్టుల ప్రభావం ఎంతమేర ఉన్నది తెలుసుకునేందుకు విచారణకు ఆదేశించే దాకా పరిస్థితి చేరుకుంది. తపోవన్ విష్ణుగడ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుకు సంబంధించిన టన్నెల్స్ జోషిమఠ్ కింది భాగంలో ఉన్న దుర్బల ప్రాంతం గుండా వెళుతున్నాయి. 2021లో సంభవించిన పెనువరదల్లో ఈ రెండు టన్నెల్స్‌లో ఒకటి బురదతో నిండిపోయి మూసుకుపోయింది. చమోలీ జిల్లా నందాదేవి నేషనల్ పార్క్‌లోని నందాదేవి గ్లేసియర్ విరుచుకుపడటంతో ఫిబ్రవరి 7, 2021న సంభవించిన విపత్తు కారణంగా రిషిగంగ, ధౌలిగంగ నదులకు పెద్ద ఎత్తున వరదలు సంభవించాయి. ఈ ప్రమాదాన్నే చమోలీ విధ్వంసం అని కూడా పేర్కొంటారు. ఈ ప్రమాదంలో 200 మంది మరణించడమో లేక ఆచూకీ లేకుండా పోవడమో జరిగింది. రిషిగంగ, ధౌలిగంగ నదుల కలయిక వల్ల అలకనందా నది ఏర్పడుతుంది.

విపరీతంగా భూగర్భ జలాలను తోడేసి వ్యవసాయానికి, తాగునీటి అవసరాలకు వాడటం వల్ల ఆయా పొరల్లో ఇసుక, రాళ్లు బలహీన పడటం కూడా ఇందుకు మరొక కారణమన్నది భూగర్భ శాస్త్రవేత్తలు చెబుతున్న మాట. 2009లో ఇక్కడ ఒక పెద్ద బోర్ తవ్వకం జరిపి రోజుకు 70 మిలియన్ లీటర్ల భూగర్భజలాన్ని తోడేసి మూడు మిలియన్ల మందికి నీటిసదుపాయం కల్పిస్తుండటం ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. అదీకాకుండా జోషిమఠ్‌లో సరైన మురుగునీటి పారుదల సౌకర్యం లేకపోవడం మరో సమస్య. భూమి క్రస్ట్‌లో కదలికలు చోటుచేసుకోవడం లేదా భూకంపం కారణంగా మట్టి దిబ్బల స్థితి మారిపోవడం, భూగర్భజలాల నిరంతర ప్రవాహం కారణంగా కింది భాగంలోని రాతిపొరలు అరిగిపోవడం, జలాలను విపరీతంగా వినియోగించడం, జలాశయాలు కూడా భూమి కుంగడానికి కారణాలుగా చెబుతున్న శాస్త్రవేత్తలు సరిగ్గా ఇటువంటి కారణాల వల్లనే ప్రపంచంలో అత్యంత వేగంగా జకార్తా నగరం కుంగిపోతున్న సంగతిని గుర్తుచేస్తున్నారు.

జనాభా పెరుగుదల కూడా ఈ పరిస్థితులకు మరో కారణంగా చెప్పవచ్చు. రాష్ట్రంలోని మైగ్రేషన్ ప్రివెంటివ్ కమిషన్, ఉత్తరాఖండ్ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం రాష్ట్రంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజల్లో 1/3వ వంతు మంది తమ సమీప పట్టణాలకు వలస వెళ్లారు. మరో 15శాతం మంది తమకు సమీపంలోని జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. ఈ కారణంగా గత రెండు దశాబ్దాల కాలంలో పర్వతాలపై ఉన్న పట్టణాల్లో జనాభా బాగా పెరిగిపోయింది.

**సామర్థ్యానికి మించిన యాత్రికుల సంఖ్య**

చైనా ఆక్రమణలోని టిబెట్‌తో ఉత్తరాఖండ్‌కు 300 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. మానసరోవర్‌కు, జోషిమఠ్‌కు మధ్య దూరం 50 కిలోమీటర్లు మాత్రమే. గత పదేళ్లకాలంలో కేవలం బర్హోటీ ప్రాంతంలోనే చైనా దాదాపు 63 చొరబాట్లకు పాల్పడింది. అటువంటి ఈ సరిహద్దు ప్రాంతానికి సైన్యం అన్ని కాలాల్లో తక్షణం చేరుకోవడానికి వీలుగా రోడ్ల నిర్మాణం చేపట్టడంలోని ప్రభుత్వ ఆంతర్యం ప్రశంసనీయమే. కాకపోతే నిర్మిస్తున్న రోడ్లు, సైనికావసరాల కంటే, పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరగడానికి దోహదం చేస్తున్నాయి. పర్యాటకం వృద్ధి చెందడం మంచి పరిణామమే కానీ ప్రస్తుతం ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య, ఈ ప్రాంత సామర్థ్యానికి మించి ఉంటోందన్నది ఒక వాదన. ముఖ్యంగా 2022 మేలో ప్రారంభమైన చార్‌ధామ్ యాత్రకు 9.5 లక్షల మంది యాత్రికులు రాగా వీరిలో 3.5 లక్షల మంది కేదార్‌నాథ్ దర్శనానికి తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. నిపుణుల అంచనా ప్రకారం ఈ సంఖ్య ఇక్కడి ప్రదేశాల సామర్థ్యానికి మూడు రెట్లు అధికం! తీర్థయాత్రికులు పెరుగుతున్న కొద్దీ పర్వత ప్రాంతాల్లో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్నది. ఈ నేపథ్యంలో యాత్రికుల సంఖ్యకు అనుగుణంగా ఇక్కడి ప్రదేశాల సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ★

**జో**షిమఠ్ యాత్రనే బద్రీనాథ్ యాత్ర అని కూడా పిలుస్తారు. ఎందుకంటే బద్రీనాథ్ వెళ్లే యాత్రికులు జోషిమఠ్ నుంచే వెళ్లాలి. జోషిమఠ్‌లో కల్పవృక్ష దేవాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, నరసింహ ఆలయం ప్రముఖమైనవి. వీటిని హిందువులు ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఇక్కడ ఉన్న గురుద్వారా పత్తర్ సాహెబ్ సిక్కులకు ఎంతో పవిత్రమైంది. జోషిమఠ్ పుణ్యక్షేత్రం మాత్రమే కాదు, సాహస క్రీడలకు కూడా ఎంతో ప్రసిద్ధి. ట్రెక్కింగ్, రాఫ్టింగ్, స్కైయింగ్ వంటి సాహస క్రీడలు ఇక్కడ జరుగుతుంటాయి. ఆదిశంకరాచార్యులు స్థాపించిన పీఠాల్లో ఇది కూడా ఒకటి (మిగిలిన నాలుగు శృంగేరి, పూరి, ద్వారక, కంచి). జోషిమఠ్ అథర్వ వేదానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. జోషిమఠ్‌లో నరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించింది ఆది శంకరాచార్యులే. పన్నెండు మంది తమిళ అళ్వార్లు





పేర్కొన్న 108 దివ్యమైన విష్ణు ఆలయాల్లో ఇది కూడా ఒకటి. స్థానికవాసుల విశ్వాసం ప్రకారం ఇక్కడి నారసింహుడి కుడిచేయి క్రమంగా సన్నబడుతూ వెంట్రుక మాదిరిగా రూపొంది చివరకు తెగిపోతుంది. ఎప్పుడైతే ఇది జరుగుతుందో అప్పుడు బద్రీనాథ్‌కు వెళ్లే దోవలో ఉన్న జయ-విజయ పర్వతాలు కలిసిపోయి ఒక్కటిగా మారతాయి. వెనువెంటనే బద్రీనాథ్ దేవాలయంలో ఉన్న బద్రీనాథుడు మాయమై, భవిష్యత్తు బద్రీనాథ్‌లో సాలిగ్రామంగా వెలుస్తాడు. ఈ భవిష్య భద్రీనాథ్ జోషిమఠ్‌కు 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రస్తుతం శీతాకాలంలో బద్రీనాథుడి విగ్రహాన్ని జోషిమఠ్‌లోని నారసింహ దేవాలయానికి తీసుకువచ్చి ఆరు నెలలపాటు పూజలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా రాబోయే కాలంలో ఇప్పటి కేదార్‌నాథుడు కూడా అక్కడ మాయమై భవిష్యత్తులో జోషిమఠ్‌లోని భవిష్య కేదార్ దేవాలయంలో వెలుస్తాడని కూడా స్థానికుల నమ్మకం. ప్రస్తుతం ఈ దేవాలయంలో చిన్న శివలింగం మాత్రం ఉంది. హిందువులకు ఇంతటి పవిత్ర పుణ్యక్షేత్రంగా ఉన్న జోషిమఠ్ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులు రాబోయే కాలంలో చార్‌ధామ్ యాత్రపై ప్రతికూల ప్రభావం కలిగించకూడదనే ఆశిద్దాం. ★

మన్‌ప్రీతీ మోనికాసింగ్. ఇటు భారత్‌లో, అటు అమెరికాలో మారుమోగుతున్న పేరు. పేరు ప్రఖ్యాతలు అంటుంటాం సహజంగా. పేరుతో వచ్చిన ప్రసిద్ధి. కాంతి అని భావం. అన్నీ ఆమెలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంటాయి. భారత సంతతి వనిత అయిన తాను అక్కడ మొట్టమొదటి సిక్కు న్యాయమూర్తి అయ్యారు. స్థానిక, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో న్యాయసాధనకు పరిశ్రమించిన నేపథ్యముంది. ఆ సేవాభావమే మోనికా కీర్తిని ఇప్పుడు అంతర్జాతీయ దశకు చేర్చింది. మహిళా జస్టిస్‌గా తన పేరు అన్నిటా అంతటా ప్రతిధ్వనిస్తూ, ఉభయ దేశాలకీ శిఖర సమానంగా నిలుస్తోంది. అది టెక్సాస్ ప్రాంతం. హోస్టన్ నగరం. హారిస్ కౌంటీ సివిల్ కోర్టు భవన ప్రాంగణం. అందులోని నాలుగో నంబరు న్యాయమందిరానికి ఆమె నియామకం. ప్రమాణ స్వీకరణ కార్యక్రమం ఈ మధ్యనే చక్కని వాతావరణంలో జరిగింది. ఆధ్వర్యం వహించిన సంథిల్ సైతం భారతీయ అమెరికన్ జడ్జి. ఇంతకంటే మించిన ప్రత్యేకత, ప్రాముఖ్యత ఇంకేం ఉంటాయి? అమెరికాలోని తొలి వనితా సిక్కు న్యాయమూర్తి స్థానాన్ని ఈ భారతీయ సంతతి పడతి అధిష్ఠించడం ఏ విధంగా చూసినా చరిత్రాత్మకమే. అందుకే ఇంతింత కీర్తీ ప్రతిష్ఠా!



# న్యాయపాలిక.... మోనికా

న్యాయవాద వృత్తిలో మోనికా ఇరవై ఏళ్ల అనుభవశాలి. వాదించిన కేసులు వందల్లో ఉంటాయి. సాగించిన న్యాయచైతన్య కార్యక్రమాలూ అసంఖ్యాకం. ఆమె కుటుంబ పెద్దలు దశాబ్దాల కిందటే అమెరికా దేశానికి వెళ్లి స్థిరపడ్డారు. అక్కడే హోస్టన్ నగర విద్యాలయాల్లోనే చదువుకున్నారామె. విద్యతో పాటు సేవాభావనను తల్లిదండ్రుల నుంచి పుణికి పుచ్చుకున్నారు. గొప్ప భవిష్యత్తు కేవలం కలలు కంటే రాదని, వాటిని నిజం చేసుకునేందుకు కృషి అవసరమని అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. చట్టం, న్యాయం, సామాజిక శ్రేయస్సు గురించిన ఆలోచనలు చిన్నప్పటి నుంచీ ఉండేవి. వాటిని ఆచరణలోకి తెచ్చేందుకు ఎంతో పరిశ్రమించారు. స్ఫూర్తి కలిగించింది తండ్రి అతార్‌జిత్ సింగ్. ఆయన ఆ రోజుల్లో నిర్మాణ పనులు చేస్తుండేవారు. ఏ పని చేపట్టాలన్నా ఒక ప్రణాళిక, ముందస్తు జాగ్రత్త, ఎన్ని అవాంతరాలు ఎదురైనా వెనుదిరగని తత్వాన్ని నాన్న నుంచే నేర్చుకున్నారు మోనికా. పాఠశాల విద్య క్లెయిన్ ఫారెస్ట్ ఉన్నత పాఠశాలలో, విశ్వవిద్యాలయ అభ్యాసం టెక్సాస్‌లో. అటు తర్వాత – న్యాయ విద్యపైన శ్రద్ధాసక్తులు ఆమె సౌత్ టెక్సాస్ కాలేజ్ ఆఫ్ లాలో చేరేలా చేశాయి. 2013లో ఎష్‌బీఐ సిటిజన్స్ అకాడమీ నుంచీ గ్రాడ్యుయేట్ అయ్యారు. మరుసటి సంవత్సరమే హార్వర్డ్ బిజినెస్ స్కూల్ నుంచి నాయకత్వ నిపుణ పాఠాల్లో రాటుతేలారు. అనంతరం యువ న్యాయవాదుల డివిజన్ లీడర్ షిప్ అకాడమీలో చేరారు. అక్కడే 2017 వరకు పలు అధ్యయన, సభల నిర్వహణలో తనవంతు పాత్ర పోషించారు. తండ్రి అతార్‌జిత్ సింగ్ నుంచి క్రియాశీలతను, తల్లి హరదీప్ ద్వారా ఆలోచనా స్రవంతిని పొందగలిగానని సగర్వంగా చెప్తుంటారు. ఎటువంటి పరిస్థితిలోనైనా సాటివారికి సాయపడే నైజం సోదరుడు గురుసింగ్ నుంచి నేర్చుకున్నానని అంటుంటారు. మోనికా భర్త మన్‌దీప్ అనేక ప్రాజెక్టుల నిర్వాహకుడు. దంపతులైంది 2003లో. ఆ తర్వాత ఆమె విద్య, శిక్షణ ప్రక్రియలు కొనసాగాయి. పిల్లలిద్దరినీ అల్లారు ముద్దుగా చూసుకుంటూనే, మరోవైపు న్యాయవాద ప్రావీణ్యాన్ని గడించారు ఆ అతివ.




**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్


**బోధన, శిక్షణ, సాధన**

ప్రజల హక్కులు, బాధ్యతల పరిరక్షణ మీదనే ఆమెకి ఎక్కువ మక్కువ. పలు సమస్యలకు పరిష్కారం ప్రధానంగా మధ్య వర్తిత్వం వల్లనే సాధ్యమవుతుంది


ఎంతో విశ్వాసం. నమ్మిన సూత్రాలకు క్రియా రూపం ఇచ్చేందుకే, అదే అమెరికాలో అటార్నీ విధులు నిర్వర్తించారు. ప్రభుత్వ ధ్రువీకృత మధ్యవర్తిగానూ కేసుల నిర్వహణ చేపట్టారు. ఆమె మాటల్లోనే చెప్పాలంటే 'చట్టం, ధర్మం, న్యాయం మధ్య ఉన్న సంబంధం ఏమిటో ప్రతి న్యాయవాదికి తెలియాలి. ఆ మూడింటితో పాటు మానవతా విలువలకు గల అనుసంధానాన్ని న్యాయమూర్తులు గ్రహించగలగాలి. ఒక కేసు వాదించాలన్నా, దాని గురించిన తీర్పు చెప్పాలన్నా లిఖిత ఆధారాలే ప్రాతిపదిక. కానీ, అన్నింటికీ అన్ని సందర్భాల్లోనూ రాత మూలక సాక్ష్యాలంటూ ఉండవు. ఆ కాగితాలలో పరచుకునే అక్షరాల్లో ఎన్నో జీవితాలుంటాయి. ఆశలూ, ఆశయాలూ కనిపిస్తుంటాయి. వాటిని గుర్తించడమే లాయర్ల, జడ్జీల పని.' రెండింట్లోనూ అనుభవమున్న మోనికా – ఎంతోమంది అంతరంగాల్లోకి తొంగి చూసి వాస్తవాలు రాబట్టే నిపుణురాలు. సదరన్ డిస్ట్రిక్ట్ ఆఫ్ టెక్సాస్‌కు చెందిన అమెరికన్ డిస్ట్రిక్ట్ కోర్టు నుంచి ధ్రువీకరణ పత్రాన్ని సాధించిన దరిమిలా, న్యాయవాద వృత్తిలో మరింత ముందుకు దూసుకెళ్లారు. సిక్కు– అమెరికన్ న్యాయవాద బృంద ప్రతినిధి అయ్యారు. వారి సభ్యత్వమున్న డైరెక్టర్ల బోర్డులో కీలక వ్యక్తిగా రాణించారు. తన సేవా సహాయ సహకార సమన్వయాలు కేవలం వృత్తికే పరిమితం కాలేదు. చట్ట విద్యకు సంబంధించిన తరగతులకు బోధకురాలిగా వ్యవహరించారు. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లా స్కూల్, స్టేట్ బార్ ఆఫ్ టెక్సాస్, హారిస్ కౌంటీ జుడిషియరీలో కూడా ప్రముఖత్వాన్ని సంతరించుకున్నారు. వాటికి అదనంగా– టెక్సాస్ గ్రివెన్స్ కమిటీకి విస్తృత సేవలందించి అపార గౌరవాభిమానాలు సంపాదించారు. సౌత్ ఏషియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (వాణిజ్య మండలి), సౌత్ ఏషియన్ బార్ అసోసియేషన్‌లో సైతం తానే ప్రముఖురాలు. అమెరికన్ అడ్వొకేట్ల బోర్డులో హోస్టన్ చాప్టర్ ప్రతినిధి హోదా వరించాయి.


**ఎంపికలూ ఎన్నికలూ**

ఆమె వృత్తిగత, వ్యక్తిపరమైన జీవితంలో ఎంపిక, ఎన్నికలు ప్రధాన స్థానం పొందాయి. హారిస్ కౌంటీ సివిల్ కోర్టుకు అక్కడి నియమాల ప్రకారం జరిగిన సార్వత్రిక ఎన్నికలలోనూ మోనికాదే పైచేయి. ఒక ముఖాముఖిలో వ్యక్తపరచినట్లు – 'నా అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తున్నందుకు గర్వంగా ఉంది. భావోద్విగ్న స్థితి నాలో చోటు చేసుకుంటోంది. న్యాయ నిర్ణయం ద్వారా సేవచేయాలన్నదే నా మనసులోని మాట. ఇదీ సేవా నాయకత్వం అంటాను నేను. సిక్కులు, ఇతరులకు సకాల న్యాయం అందించడానికి అన్ని విధాలా పనిచేస్తాను. నిజానికి ఈ హోస్టన్ ప్రాంతమంతా వైవిధ్యమయం. న్యాయపరమైన ఏకత్వ సాధనకు ఏది ఎప్పుడు చేయాలో దానిని అప్పుడు నిర్వర్తిస్తాను. నాకు వచ్చిన పురస్కారాలు నా బాధ్యతల్ని మరింత పెంచాయి. దక్షిణాసియా న్యాయవాదుల సంఘ సభ్య ప్రతిష్ఠాత్మక అవార్డు నాకే వచ్చిన సంగతి మీ అందరికీ తెలుసు. మరుసటి సంవత్సరమే టెక్సాస్ డైవర్సిటీ ఛాంపియన్ పురస్కారం వరించింది. ఎక్సలెన్స్ పురస్కృతులూ నాకే లభించాయి. ఇన్ని వచ్చాయని గొప్ప చెప్పడం కాదు. అవన్నీ నా కర్తవ్యాల్ని విస్తారం చేశాయని ప్రకటిస్తున్నా. ప్రజల హక్కుల పరిరక్షణకు మించి మరేదీ ఉండదు. గతంలో ఎదుర్కొన్న పరిస్థితులను ఎన్నటికీ మరవలేను. మా నాన్నగారు అమెరికా వచ్చిన తొలిరోజుల్లో జాతి వివక్ష ఎదురైంది. మా అందరికీ ఎంతో బాధ కలిగింది. ఆ తరహా వివక్షకు పూర్తిగా ముగింపు పలకాలన్న పట్టుదలే నన్ను జుడీషియల్ ఎన్నికలలో పోటీ చేయించింది. మరో వాస్తవాన్ని, అదీ కఠినమైనదాన్ని ఇప్పుడు ఈ సందర్భంలో మీ ముందు ఉంచుతున్నా... మునుపు సీనియర్ లాయర్ దగ్గర న్యాయవాదిగా చేసేదాన్ని. 'ఎవరితోనైనా పరిచయం చేసుకునేటప్పుడు 'అమెరికన్' అని చెప్పండి. 'అమెరికన్ ఇండియన్' అనకండి అని ఆయన సలహా.

ఎందుకలా చెప్పాలన్నదీ నా ప్రశ్న!' ఈ మాటలు చాలు, మోనికా భారతీయతత్వ మూలాన్ని వెల్లడి చేసేందుకు. అమెరికాలో దరిదాపు ఐదు లక్షల మంది సిక్కులున్నారు. వారిలో ఇరవై వేలమందిపైగా ఒక్క హోస్టన్ పరిసర ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. అదే హోస్టన్ మేయర్ సిల్వెస్టర్ టర్నెల్ 'ఇదంతా ప్రత్యేకించి సిక్కులందరికీ సగర్వ కారణం' అంటున్నారు. అంతేకాక, ప్రజలందరికీ సంతోషదాయకమని తానే చెప్తున్నారు. ఈ ప్రాంతమంతా విభిన్నతల నిలయం. ఇందులో ఏకత్వాన్ని చూడటమే అందరి ధ్యేయమూ కావాలి. న్యాయం, చట్టం అందరివీ. వాటిని కాపాడటం న్యాయమూర్తుల ప్రథమ బాధ్యత, విధి. ఇందులో మోనికా సఫలీకృతమవుతారన్నది ఆ మేయర్ దృఢ నిశ్చయం. తనదే కాదు, అందరిదీ అదే ఆశాభావం. భారతీయత మూర్తీభవించిన మన్‌ప్రీత్ మోనికా సింగ్ చదివిన చదువుతో, నేర్చుకున్న శిక్షణతో, సాగిస్తున్న సేవతో పౌరులందరి గౌరవాదరాలకూ పాత్రురాలు. వివక్ష, అంతరాలకు తావులేని సమాజమే అవసరం. అందుకు ఆమె న్యాయమూర్తిత్వం, అందునా అతివగా తన నాయకత్వం ఎంతగానో దోహదపడుతుందని ప్రతి ఒక్కరూ ఆశిస్తున్నారు. అది తప్పక ఫలిస్తుందని ఇంకెప్పుడు కాదు – ఇప్పుడే చెప్పవచ్చు మనం. ★

ఆమె వృత్తిగత, వ్యక్తిపరమైన జీవితంలో ఎంపిక, ఎన్నికలు ప్రధాన స్థానం పొందాయి. హారిస్ కౌంటీ సివిల్ కోర్టుకు అక్కడి నియమాల ప్రకారం జరిగిన సార్వత్రిక ఎన్నికలలోనూ మోనికాదే పైచేయి. ఒక ముఖాముఖిలో వ్యక్తపరచినట్లు – 'నా అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తున్నందుకు గర్వంగా ఉంది. భావోద్విగ్న స్థితి నాలో చోటు చేసుకుంటోంది. న్యాయ నిర్ణయం ద్వారా సేవచేయాలన్నదే నా మనసులోని మాట. ఇదీ సేవా నాయకత్వం అంటాను నేను.





# వెంకన్న భక్తులపై

**రాష్ట్రంలో హిందుధర్మంపై పరమత దాడులు, హిందువుల పట్ల ప్రభుత్వ వివక్ష కొనసాగుతూనే ఉన్నాయి. తిరుమల తిరుపతిల్లో భక్తులకు ఇచ్చే వసతి గదుల అద్దెను పెంచాలని నిర్ణయం తీసుకోవడం హిందూ వివక్ష కాగా, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని కొంతమూరులోని వరసిద్ధి వినాయక క్షేత్రాన్ని ఒక ఫాస్టర్ ధ్వంసం చేయడం హిందూ ధర్మంపై క్రైస్తవులు చేస్తున్న దాడిగా పేర్కొనవచ్చు. ఈ రెండే కాదు... మూడేళ్ల నుంచి రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలను పరిశీలిస్తే ఒక విషయం అవగతమౌతుంది. మతమార్పిడులు, హిందూ ఆలయాల వద్ద క్రైస్తవ మత ప్రచారం, హిందూ దేవతలను తూలనాడటం, హిందూ దేవతల విగ్రహాలు, ఆలయాలు ధ్వంసం చేయడం, హిందూ మత ఆచారాలను అవమానించడం, కించపరచడం, హిందూ యువతులను ఆకర్షించి వారిని బలవంతంగానైనా మత మార్పిడులకు పురికొల్పడటం వంటి హిందూ మత వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయి. అదే సమయంలో చర్చిలు, మసీదులను అక్రమంగా నిర్మించడం, చర్చిల నిర్మాణానికి ప్రభుత్వమే నిధులు కేటాయించడం వంటివి ఉన్నాయి. హిందూమత దాడులను ప్రభుత్వం ఏమాత్రం ఖండించకపోగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఈగ వాలనీయడం లేదు. నిందితులను తప్పిస్తూ, వారిని కొమ్ముకాసేలా మాట్లాడుతూ, బాధితులనే తిరిగి ఇబ్బందులు పెడుతోంది.**


వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటినుంచి తిరుమల భక్తులపై ఎప్పటికప్పుడు ఆర్థికభారం మోపుతూనే ఉంది. ఈ ప్రభుత్వ హయాం నుంచి తిరుపతి తిరుమల దేవస్థానం (తితిదే) నిర్వహణ ఏ మాత్రం సవ్యంగా లేదని భక్తులు అంటున్నారు. తితిదేని రాజకీయ వేదికగా మార్చారు. దేవస్థానం బోర్డును రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చి వైసీపీ నాయకులకు బోర్డులో పదవులిచ్చి ఉపాధి కల్పిస్తున్నారు. నేర చరిత్ర కలిగిన, అర్హతలేని వారు సభ్యులుగా పదవులు పొందారు. చివరికి వీరిని తొలగించాలని కోర్టు ద్వారా మొట్టికాయలు వేయించుకున్నారు. రిజర్వేషన్ల ద్వారా అక్రమంగా ప్రవేశించి ఉద్యోగాలు పొంది క్రైస్తవాన్ని అనుసరిస్తోన్నవారిని గుర్తించేందుకు ప్రయత్నించిన ఈవోను వెంటనే ఈ ప్రభుత్వం బదిలీ చేసింది. భక్తులు సమర్పించిన కానుకలను ప్రభుత్వం వాడుకోవాలని కూడా చూసింది.

**మూడింతలు పెంపు**

తిరుమలకు విచ్చేసే భక్తుల నుంచి కావాల్సినంత పిండేసి వారిపై ఆర్థిక భారం మోపుతోంది. ఆలయంలో సౌకర్యాలు మాత్రం పెరగలేదు. భక్తులకు అందించే సేవలపై ఛార్జీలు పెంచేస్తున్న ప్రభుత్వం చర్చిలు, మసీదుల పట్ల ఆదరణ కనబరుస్తోంది. ముల్లాలు, ఫాస్టర్లకు జీతాలు చెల్లిస్తూ వారి పట్ల అంతులేని ప్రేమను కనబరుస్తూ హిందువుల పట్ల ద్వేషాన్ని వెళ్లగక్కుతోంది.


తిరుమలలోని భక్తుల వసతి గదుల ధరలను మరోసారి పెంచింది. అక్కడి కొన్ని రెస్ట్ హౌస్‌లలో గదుల ధర రూ.150 ఉంది. వీటికి ఏసీలు, గీజర్‌లు బిగించి జీఎస్టీతో కలిపి ఒక్కసారిగా రూ.1700, రూ.750 నుంచి రూ.1700కు, మరోటి రూ.2200లకు పెంచారు. స్పెషల్ టైప్ కాటేజీలలో రూ.750 ఉన్న గది అద్దెను జీఎస్టీతో కలిపి రూ.2800 చేశారు. ఇది కాక భక్తులు గదుల అద్దెతోపాటు డిపాజిట్‌ను అంతే మొత్తంలో చెల్లించాలి. గదిని 1700కు పొందితే డిపాజిట్ నగదుతో కలిపి రూ. 3400 చెల్లించాలి. ఇలా ధరలు పెంచడంతో భక్తుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆధునికీకరణ పేరుతో వసతి భవనాలకు మరమ్మతులు చేపట్టడం, కొన్నిటికి ఏసీ, గీజర్ వంటి సదుపాయాలు కల్పించడం వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం దేవస్థానం విధి. అయితే ఖర్చుచేసిన డబ్బుకు మూడింతలు భక్తుల నుంచి రాబట్టాలని చూడటం సరైన చర్య కాదనేది భక్తుల అభిప్రాయం.

మధ్యతరగతి భక్తులకు అందుబాటులో ఉండే నందకం, పాంచజన్యం, కౌస్తుభం, వకుళమాత వంటి వసతి గృహాల్లో ధరలను ఒక్కసారిగా రూ.500, రూ.600 నుంచి రూ.1000కు పెంచారు. మరోవంక భక్తులకు ఇచ్చే లడ్డూల సంఖ్యను తగ్గించి వేశారు. దీంతో భక్తుల్లో అసహనం పెరుగుతున్నా ప్రభుత్వం ఏ మాత్రం తగ్గడం లేదు.




**తిరుమల హిందూ వారసత్వ సంపద**

తిరుమల హిందూభక్తుల వారసత్వ సంపదే తప్ప వ్యాపార స్థలం కాదు. చారిత్రక, పురాణ, ప్రశస్తిగల ఆధ్యాత్మిక కేంద్రం. ప్రపంచవ్యాప్తంగా వున్న కోట్లాది హిందువులు కలియుగ దైవంగా విశ్వసించే సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుడు కొలువుదీరిన సప్తగిరిని భక్తులు పరమపవిత్ర ప్రాంతంగా భావిస్తారు. జీవితంలో ఒక్కసారైనా భగవంతుని చూడాలని పరితపిస్తారు. ఇందులో ధనిక, పేద భేదం లేదు. అందరూ ఆయన దర్శనం కోసం ఎదురు చూస్తుంటారు. కొందరు



# ఆర్థికభారం



తురగా నాగభూషణం

కష్టపడి కూడబెట్టుకుని వస్తే, పేదలు వ్యయ ప్రయాసలతో స్వామి వారిని సేవించి తమ బాధల నుంచి ఉపశమనం కోసం వస్తుంటారు. ఇలాంటి వారిపై ధరల భారం మోపడం సరికాదని భక్తులంటున్నారు.

భక్తులు దేవస్థానానికి ఇచ్చే కోట్లాది రూపాయల కానుకలను ఆదాయంగా పరిగణించరాదని, వాటిని భక్తులకు కల్పించే సేవలకు ఖర్చు చేయాలన్నది హిందూసంస్థలు, భక్తులు, భారతీయ జనతా పార్టీ డిమాండ్. 'దేవస్థానానికి సంబంధించిన ఏ మౌలిక సదుపాయాలకు ఎంత ఖర్చయినా ఆ సంస్థ మాత్రమే భరించాలి. భక్తులపై రుద్ద వద్దు. తిరుమలకు వచ్చే సామాన్య, మధ్యతరగతి భక్తులను ధరాఘాతానికి గురిచేయవద్దు' అన్న డిమాండ్‌లతో బీజేపీ జనవరి 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించి వినతి పత్రాలు కూడా సమర్పించింది.

**ఏలికల తీరుపై ధర్మాగ్రహం**

ఇక వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తోన్న హిందు వ్యతిరేక చర్యల పట్ల ఆగ్రహం వ్యక్తమవుతోంది. హిందువులు భగ్గుమంటున్నారు. క్రైస్తవ, ముస్లింలకు అన్నివిధాల అనుకూలంగా పని చేసి ఓటుబ్యాంకును పెంచుకుంటూ మళ్లీ అధికారానికి రావాలన్నది వైసీపీ ప్రభుత్వ ఆలోచన. అందుకోసం ప్రజాస్వామ్యానికి లౌకికత్వానికి తూట్లు పొడుస్తోంది. అందులో భాగంగానే ఈ రెండు మతాల వారిని ప్రోత్సహించే కార్యక్రమాలు అమలుచేస్తూ, హిందువులను అణచివేసే పలు ప్రణాళికలు అమలు చేస్తోంది.

హిందూ ఆలయాలున్న ప్రాంతాలను ముస్లిం, క్రైస్తవ జనావాసాలుగా చేయాలనేది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. అంతేకాదు... ముస్లింలు, క్రైస్తవులకు హిందూ ఆలయాలున్న ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచుతూ వారు అక్కడ శాశ్వతంగా తిష్ఠ వేసేలా వ్యవహరిస్తోంది. అదే సమయంలో హిందువులను అణచివేయడం ద్వారా అక్కడి నుంచి తరిమేసేలా వ్యవహరిస్తోంది. ఇప్పటికే ఆలయ నిర్వహణ బాధ్యతలను తీసుకున్న వైసీపీ నాయకులు, స్థానిక ఎమ్మెల్యేల సాయంతో ఈ అజెండాను అమలు చేస్తున్నారని హిందూ సంస్థలు, బీజేపీ ఆరోపిస్తున్నాయి. శ్రీశైలం, శ్రీకాళహస్తి పరిసరాల్లో వేరే ప్రాంతాలకు చెందిన ముస్లింలు, క్రైస్తవులకు పెద్ద సంఖ్యలో ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు ఆరోపణలు వచ్చాయి. అలాగే శ్రీశైలంలో ఆలయ దుకాణాల్లో చాలా వరకు ముస్లింలకే కేటాయించారు. శ్రీశైలం దేవస్థానానికి సంబంధించిన పలు కాంట్రాక్టులు ఎమ్మెల్యే అనుచరుడైన ఒక ముస్లిం చేస్తున్నారు. తిరుమలలోనూ ఇదే పరిస్థితి. దేవస్థానాలకు సంబంధించిన పనులన్నీ వైసీపీ నాయకులు తమ అనుయాయులైన ముస్లిం, క్రైస్తవులకు అప్పగించి చేయిస్తున్నారు.

**ఆలయాల ధ్వంసం**

నవరత్నాలు పథకాల మాదిరిగా ఆలయాల ధ్వంసం అనేది వైసీపీ హయాంలో నిత్య పథకంగా మారింది. కొండ బిట్రగుంటలో జరిగిన రథం దగ్ధం నుంచి అంతర్వేదిలో కొనసాగింపు, పిఠాపురంలో విగ్రహాల ధ్వంసం నుంచి రామతీర్థంలో రాముల వారి విగ్రహం ఖండించడం వరకు సుమారు 100కు పైగా హిందూ ఆలయాలపై దాడులు జరిగాయి. ఈ నెల పదో తేదీన రాజమహేంద్రవరం గ్రామీణ పరిధిలోని కొంతమూరు అఫిషియల్ కాలనీలోని వరసిద్ధి వినాయక ఆలయంలోకి కొంతమంది పాదరక్షలతో వెళ్లి ఆయుధాలతో ఆలయ గోడ కూల్చివేసిన సంఘటన స్థానికులైన హిందువుల మనోభావాలు దెబ్బతీశాయి. ఆలయానికి అమర్చిన సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేశారు. ఆలయగోడలు కూల్చివేస్తోన్న వారిలో ఒక ఫాస్టర్ కూడా వున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనను చూసి వారిని ఎదిరించిన మహిళకు హిందూ సమాజం తలవంచి నమస్కరిస్తోంది. ఆలయంపై దాడికి దిగిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక హిందువులు అదే రోజు రాత్రి ఆందోళనకు దిగారు. గతంలోనూ ఇలాంటి ఘటనలే జరిగినప్పుడు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చినా న్యాయం జరగలేదంటున్నారు. దీనికి సంబంధించి ఓ పోస్టు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. తమ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేందుకు కొందరు అతివాద క్రైస్తవ, ముస్లింలు సంఘటనలుగా హిందువులు అనుమానిస్తున్నారు. ఆత్మకూరులో అనుమతిలేని మసీదును నిర్మిస్తూ, అడ్డుకునేందుకు వచ్చిన బీజేపీ నంద్యాల నాయకులు డాక్టర్ బుడ్డా శ్రీకాంత్‌రెడ్డిపై హత్యాయత్నం జరగడం, తిరుపతి సమీపంలోని ఓటేరు పంచాయతీ పరిధిలోని నక్కలవారిపాలెంలోని సంచార తెగలున్న గ్రామంలో వీరభద్రస్వామి ఆలయం వద్ద సమస్యలు సృష్టించడం, త్రిపురాంతకం పెద్దారవీడు మండలంలోని చెంచుగూడెంలో చర్చిని అక్రమంగా నిర్మించడాన్ని అడ్డుకున్న స్థానిక హిందూ చెంచులపై దాడులు వంటివి జరుగుతూనే ఉన్నా ప్రభుత్వం మాత్రం వీటిని అరికట్టే ప్రయత్నం చేయడం లేదు.


**వందేభారత్ రైలుపై రాళ్లు రువ్వడం**

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా దేశంలోని పలు మార్గాలలో ప్రారంభించిన వందే భారత్ రైళ్లపై జాతీయవాదాన్ని వ్యతిరేకించే వేర్పాటువాద శక్తులు రాళ్లురువ్వాయి. కొన్నిరోజుల క్రితం పశ్చిమబెంగాల్‌లో ఇలాంటి ఘటన జరిగితే ఇటీవల విశాఖలో చోటు చేసుకుంది. జాతీయవాదాన్ని ప్రోత్సహించే బీజేపీ ప్రభుత్వం వందేభారత్ రైళ్లను ప్రతిష్ఠాత్మకంగా భావించి పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేయించి నడుపుతోంది. ఇది ఓర్వలేని వేర్పాటువాదులు, కుహనా లౌకికవాద పార్టీల మద్దతుతో ఈ రైళ్లపై రాళ్ల దాడికి దిగారు. ఇది దేశ ప్రజలంతా ముమ్మాటికి ఖండించాల్సిన విషయం.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

హిందూ ఆలయాలున్న ప్రాంతాలను ముస్లిం, క్రైస్తవ జనావాసాలుగా చేయాలనేది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. అంతేకాదు... ముస్లింలు, క్రైస్తవులకు హిందూ ఆలయాలున్న ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచుతూ వారు అక్కడ శాశ్వతంగా తిష్ఠ వేసేలా వ్యవహరిస్తోంది. అదే సమయంలో హిందువులను అణచివేయడం ద్వారా అక్కడి నుంచి తరిమేసేలా వ్యవహరిస్తోంది.

❋ రామాయణంలోని పాత్రలు ❋



# సంయమనం లేని శూర్పణఖ

శ్రీరాముడి కీర్తిప్రతిష్ఠలు ఇనుమడించేలా, రామావతార లక్ష్యాన్ని సాధించడంలో రామాయణంలో మూడు స్త్రీ పాత్రలు ప్రేరణగా నిలిచాయి. వారిలో ప్రథమ స్థానం కైకేయిది. ఆమెను ప్రేరేపించిన మంథరది ద్వితీయ స్థానం కాగా మూడో స్థానంలోకి వచ్చే పాత్ర శూర్పణఖ. ఈమె రావణాసురుడి చెల్లెలు. కేకసి, విశ్రావసు కుమార్తె. రావణ, కుంభకర్ణ, విభీషణ, ఖర, దూషణులకు సోదరి. మారీచ, సుబాహులకు మేనకోడలు. అంటే.. తాటక ఈమెకు అమ్మమ్మ.

వాల్మీకి రామాయణం అరణ్యకాండలో శూర్పణఖ పాత్ర కనిపిస్తుంది. కానీ, అనంతరం విభీషణుడి రాజ్యంలో కొంతకాలం నివసించి, ఆ తర్వాత మరణించిందని వివిధ వ్యాఖ్యానాలలో పేర్కొన్నారు.

ఇక ఈమె గురించిన వివరాలలోకి వస్తే... కాలకేయ వంశానికి చెందిన విద్యుజ్జిహ్వుడనే రాక్షసుడు ఈమెను వివాహమాడాడు. లోకాలన్నిటినీ జయించాలన్న ఉత్సాహంలో రావణుడు కాలకేయులతో పోరాడుతూ, పొరపాటున విద్యుజ్జిహ్వుడిని వధించాడు. అంటే.. శూర్పణఖ వైధవ్యానికి అన్న రావణుడే కారణమయ్యాడు. భర్త మరణంతో దుఃఖితురాలైన శూర్పణఖను రావణుడు 'తెలియక తప్పు జరిగిపోయింది' అని ఓదార్చాడు. మనసు కుదుట పడటానికి ఖరుడు, దూషణుడు, త్రిశిరుడు అనే అనుచరులను తోడిచ్చి దండకారణ్యంలో విహరించాలంటూ పంపించాడు. అప్పటి నుంచి ఒంటరైన ఆమె.. లంకకు, దండకారణ్యానికి మధ్య తిరుగుతూ కాలం వెళ్లదీసేది. ఆ సమయంలోనే జగన్మోహనాకారుడైన రాముని చూసి మనసు పారేసుకుంది. ఎలాగైనా రామునితో సుఖించాలని ఉవ్విళ్లూరింది. అయితే ఏకపత్నీవ్రతుడైన రాముడు, రూపం మార్చుకుని జగన్మోహినిలా తయారైన శూర్పణఖని చూసి ఏమాత్రం చలించడు. ఆయన పక్కన ఉండే సీతను చూసి అసూయ చెంది ఎలాగైనా వారిద్దరని వేరు చేయాలనుకుంటుంది. అందులో భాగంగానే రావణుని వద్దకు వెళ్లి సీత అందచందాలను వర్ణించి ఆమెను అపహరించేందుకు కారకురాలవుతుంది. సంయమనం పాటించకపోతే, ఎంతటివారైనా పతనం కాక తప్పదని శూర్పణఖ పాత్ర ద్వారా మరోసారి స్పష్టమవుతుంది. ★

❋ 'మొక్క'బడి ❋

# బహుళ ప్రయోజ

ఇంటి పెరటిలో తప్పనిసరిగా ఉండవలసిన మొక్క బ్రాహ్మి. దీనినే సరస్వతి ఆకు అని సాధారణ పరిభాషలో పిలుస్తుంటారు. ఈ మొక్క ఆకులను పలు ఆయుర్వేద మందుల తయారీలో ఉపయోగిస్తారు. చిన్న పిల్లలకు త్వరగా మాటలు రావడానికి, మేధస్సు పెరగడాని ఈ ఆకుతో తయారు చేసే లేహ్యాన్ని తినిపిస్తుంటారు. నాలుగు ఆకులు నమిలి తింటే మేధస్సు పెరుగుతుందని ఆయుర్వేదం చెబుతోంది. రక్తంలో చెడు కొవ్వును కరిగించడానికి ఈ ఆకు అద్భుతంగా సహాయ పడుతుంది. ఈ ఆకుల నుంచి రసం తీసి అందులో కొద్దిగా వాము కలిపి తీసుకుంటే చెడు కొవ్వు క్రమంగా కరిగిపోయి గుండె ఆరోగ్యవంతంగా మారుతుంది. ఈ ఆకులు మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. జ్ఞాపకశక్తిని పెంచుతాయి.

ఒత్తిడి, ఇతర మానసిక సమస్యలు ఉన్నవారు నిత్యం ఈ ఆకులను తింటే ప్రయోజనం కలుగుతుంది. ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలల్లో ఒక టేబుల్ స్పూన్ ఆకురసం కలిపి తీసుకుంటే ఒత్తిడి లాంటివి తగ్గుతాయి. మెదడు చురుగ్గా, ఉత్సాహంగా పని చేస్తుంది. పచ్చకామెర్లు వచ్చిన వారికి ఈ మొక్క ఆకుల రసాన్ని నిత్యం తాగిస్తుంటే వెంటనే కోలుకుంటారు. ఆకుల రసం తాగితే రక్తం బాగా తయారవుతుంది. రక్తం శుభ్రంగా మారుతుంది.

సరస్వతి మొక్క

ఆధ్యాత్మికం

❋ తాత్వికత ❋

ఆమె ఓ జెన్ సన్యాసిని. సౌందర్యవతి. ఆమె దగ్గర కొందరు విద్యార్థులకు పాఠాలు చెప్తుండేవారు.

ఓసారి ఓ యువకుడు ఆమె దగ్గర చదువుకోవడానికి వచ్చాడు. అతను రెండో రోజుకే ఆమె ఓ గురువు, సన్యాసి అనే వాస్తవాన్ని మరచి ఆమె అందానికి ముగ్ధుడయ్యాడు. తన చదువుపై దృష్టిపెట్టలేకపోతున్నాడు.

ఇక లాభం లేదనుకుని మూడో రోజు అతను ఎవరేమనుకుంటే నాకేమిటీ అనే ధోరణిలో ఆమెతో 'మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. ఆరాధిస్తున్నాను. మిమ్మల్ని విడిచిపెట్టి ఉండలేను. మిమ్మల్ని పొందాలనుకుంటున్నాను" అని ఏవేవో చెప్పాడు. కానీ ఆమె అతని మాటలను పట్టించుకోకుండా పాఠాల చెప్పుకుంటూ పోవడంతో అతనికి కోపం వచ్చింది.

"నేనింతలా మీకోసం పడి చస్తుంటే పాఠం చెప్తారా? మిమ్మల్ని చూసినప్పటి నుంచి చదువు మీద శ్రద్ధ లేకుండా పోయింది. మిమ్మల్ని ప్రేమిస్తున్నాను" అని కచ్చితంగా చెప్పాడు.

దోర్బల పూర్ణిమాస్వాతి

# నాలనిచ్చే 'బ్రాహ్మి'





ఆకులను నీడలో ఎండబెట్టిన ఆకులకు ఐదు బాదంపప్పులు, రెండు మిరియపు గింజలు వేసి, వేడి నీరు పోసి మెత్తగా పేస్ట్‌లా చేయాలి. తరువాత ఆ మిశ్రమాన్ని పలుచని వస్త్రంతో వడకట్టి ఆ ద్రవంలో తగినంత తేనె కలిపి తాగాలి. ఆకుల పొడిలో తేనె కలిపి తీసుకుంటే.. గొంతు బొంగురు తగ్గుతుంది. స్వరపేటిక వృద్ధి చెందుతుంది. మంచి కంఠస్వరం కూడా వస్తుంది.

మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా సరస్వతి ఆకు ఒక దివ్యౌషధమని చెప్పుకోవచ్చు. పావు స్పూన్ ఆకుల పొడిని ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కలిపి తీసుకోవడం వల్ల మధుమేహుల రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది.

ఈ ఆకు రసాన్ని తరచూ తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరిగి జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యలు దరిచేరవు. ★




అప్పుడు ఆమె "ఇదిగో నువ్వెన్నన్నా చెప్పుకో. నన్ను ప్రేమించు. ప్రేమించకపో. ఆరాధించు. చదువుకోలేకపోతున్నాను అని అనడం నీ సమస్య. నీ మాటలకు నేను పడిపోను. నా మనసు మారదు. నేను కృతనిశ్చయంతోనే ఉన్నాను. నేను ఓ సన్యాసిని. ఈ జన్మలో పెళ్లి చేసుకోను. సాధువుగానే ఉంటాను. నా దగ్గరకొచ్చిన వారికి నాకు తెలిసిన పాఠాలు చెప్తాను. అంతేతప్ప నన్నెవరూ ప్రభావితం చేయలేరు. ప్రేమించడం, చదువుకోలేకపోవడం నీ తలనొప్పి. నీ సమస్యతో

# నువ్వు నువ్వుగా ఉండు

నాకెలాంటి సంబంధమూ లేదు. చదువుకుంటానంటే చదువుకో. లేకపోతే పో. అది నీ ఇష్టం' అన్నారు.

**ఆమె మాటలూ ఓ పాఠమే.**

మనందరికీ ఎవరో ఒకరు ఇష్టం ఉండొచ్చు. అంతమాత్రాన వాళ్లు మనల్ని ఇష్టపడాలని నియమం లేదుగా. వాళ్లూ మనల్ని ఇష్టపడాలని ఆశించడం, ఇష్టపడకుంటే భంగపడి నిరాశా నిస్పృహలకు గురికావడం అనవసరమైన సమస్యలకు దారి తీస్తాయి.

కనుక పరిమితులు తెలుసుకుని హద్దుల్లో ఉండటం అందరికీ మంచిది. ★




5

రోమ్ చరిత్రను వివరంగా చెప్పిన తర్వాత తండ్రి కుమారుని ప్రశ్నించాడు. "విషయమంతా అవగతమయిందా? ఈ పాఠంతో నీకు తెలిసినదేమిటి?"

"పూర్తిగా అర్థమయింది. అధికారం చేజిక్కించుకొనడానికి సోదరులను బంధించినా, సంహరించినా తప్పులేదు. అది పాపహేతువు కాదు. దేవతల ఆగ్రహానికి గురిచేయదు".

"నీవు చెప్పింది నిజమే. కానీ నీకు అధికారం కోసం పోరాడే అవకాశం లేదు. నగర నిర్మాణం జరిగినప్పుడు రోములస్ ముఖ్యమైన వంద కుటుంబాలకి పెట్రీషియన్లు అనే ముఖ్యస్థానం అప్పగించాడు. మన కుటుంబం వాటిలో ఒకటి. మన వంశానికి విహితమైన విధి దేవరాజైన జూపిటర్‌ని పూజించడమే. అర్చకత్వ విధిలో ఉన్నవారు అశ్వారోహణం చేయరాదు. గుర్రాన్ని తాకడం కూడా నిషిద్ధమే. స్వగృహంలోనే నిద్రించాలి. ఆపద్ధర్మంగా ఇల్లు వదలివెళ్ల వలసి వస్తే ఎక్కడా మూడురాత్రులు మించి శయనించరాదు. రోమ్ నగరాన్ని వీడి ఒక్కరోజు కూడా ఎక్కడా ఉండిపోకూడదు. సైన్యంతో ఏ సంబంధముండకూడదు. జూపిటర్ దేవాలయంలోని ప్రధానార్చకులకు ఈ నియమాలు తప్పనిసరి. నా అనంతరం నీవే ప్రధాన పూజారిగా బాధ్యతలు స్వీకరించగలవు. కాబట్టి, నీకు శత్రుసంహారం, అధికారం చేజిక్కించుకొనడం వంటివి అసాధ్య కార్యాలు."

"మీ దగ్గరకి చావు అప్పుడే రాదు. ఈలోగా నేను అధికారం సంపాదించి, నియమాలు మార్చేస్తాను" అని జూలియస్ సీజర్ అనుకొన్నాడు. అతని ధైర్యానికి రెండు కారణాలు. మేనత్త జూలియా భర్త మారియస్ సైన్యంలో ఉన్నత పదవిలో ఉన్నాడు. జూలియస్ సీజర్ తల్లి ఆరిలియా కోట్టా రాజ వంశీకురాలు.

జూలియస్ సీజర్ మనసులో ఏమనుకున్నా తండ్రి ఎదుట మౌనం వహించాడు. విద్యాబోధన పూర్తయ్యే నాటికి సీజర్ పదహారేళ్ల వయసువాడయినాడు. జనకుని వద్ద పూజా నిర్వహణ, బలి సమర్పణ మొదలయినవి నేర్చుకుంటున్న సమయంలోనే మన్మథ శాస్త్రం కూడా పఠించినాడు. కామసూత్రాలనతడు పఠించినది సెర్విలియా అనే వివాహిత వద్ద. తన కన్నా నాలుగు సంవత్సరాలు పెద్దదయిన స్త్రీతో శయన సంబంధం సీజర్‌కు తప్పుగా అనిపించలేదు. ధర్మ, అర్థ, కామాలన్న పురుషార్థాలను వరుసగా సాధించాలన్నది సనాతన భారతీయ నీతి. అర్థ, కామములనే ముఖ్యంగా గ్రహించడం అనార్య సంస్కృతి. ఇక జూలియస్ సీజర్ దృక్పథంలో వింత ఏముంది?

* * *

జూలియస్ సీజర్‌కి తండ్రి ప్రధాన అర్చకుని ముఖ్యమైన నియమ నిబంధనలను బోధించిన నాటి సాయంకాలమే సెర్విలియా నుండి అతనికి లేఖ వచ్చింది. సూర్యాస్తమయమయ్యే సమయానికి తన వద్దకు రమ్మంటూ గూఢమైన సంకేతం ఆ లేఖలో ఉంది. తన ప్రేయసి కోరినట్లుగానే అతడు ఆమె దగ్గరికి వెళ్లాడు. కుశల ప్రశ్నలయిన తరువాత ఆమె తాను గర్భవతినని చెప్పింది.


జూలియస్ సీజర్ పుత్రోత్సాహంతో పొంగిపోయాడు. "చిన్న జూలియస్ సీజర్ పుట్టబోతున్నాడన్నమాట."

"అదేం మాట? కుమారుడు జన్మిస్తే అతనికి మార్కస్ బ్రూటస్ అన్న పేరే సరియైనది."

"నీ భర్త పేరా? పుట్టబోయేది నా పుత్రుడు కదా!"

"నీవు నా భర్తవు కావు. వంశ పరంపరగానే పిల్లల పేర్లు ఉంటాయన్న సంగతి నీకు తెలియనిది కాదు."

"ఆ విషయమే మాట్లాడాలని వచ్చాను. నీ భర్తను



విడిచిపెట్టి నన్ను వరించు. త్వరలోనే నేను రాజ్యాధికారం చేజిక్కించుకోగలను. నిన్ను నా హృదయ సీమకు రాణిగా ఏనాడో చేసుకున్నాను. రోమ్‌కు నిన్ను రాణిని చేయగలను”.

“రోమ్‌లో రాజరికమే లేదు. దుర్మార్గులైన రాజులను సహించలేని రోమనుల రాజరికపు వ్యవస్థను కూలదోసి సెనేట్ ద్వారా పరిపాలిస్తున్నారని నీకు తెలియదా? లేనిపోని ఊహలు మనసులోకి రానీయటం నీకు శ్రేయస్కరం కాదు జాగ్రత్త.”

“విద్యావతివి, విదుషీమణివి, అనేక కళలలో ఆరితేరిన దానవు. నీతో వాదించి నేను గెలవగలనా?”

“మరి ఏమి చేయగలవు?”

సీజర్ ఆమె దగ్గరగా జరగబోయేసరికి ఆమె నిలబడి “నా భర్త ఇంటికి వచ్చే సమయమైంది” అన్నది.

“అందుకే అతనిని వదలి నన్ను వివాహం చేసుకోమని అడుగుతున్నాను” అన్నాడు సీజర్.

“సెలవు” అని చెప్పి సెర్విలియా లోనికి వెళ్లిపోయింది. జూలియస్ సీజర్ కొంత నిరాశతో, కొంత కోపంతో బయటకు నడిచాడు.

* * *

మరునాడు సీజర్ తన మేనత్త భర్త మారియస్ వద్దకు వెళ్లి, తనకు సైన్యంలో చేరి, యుద్ధంలో పాల్గొనాలని ఉందన్న కోరికను తెలియపరచాడు. మారియస్ “నీ కోరికను నీ జనకులెరుగుదురా?” అని ప్రశ్నించినాడు. తెలియదని సీజర్ ప్రత్యుత్తర మిచ్చాడు.

“నీ తండ్రి అనంతరం నీవు జూపిటర్ ఆలయంలో ప్రధాన అర్చకుడవు కావలసియున్నది. అర్చకత్వమూ, సైన్యాధిపత్యమూ ఒకే సమయంలో చేయగలిగిన కార్యాలు కావు. అయినంతలో నీ కోరికను తిరస్కరించుట సరియైనది కాదు. నా సహచరుడైన కొర్నీలియస్ సిన్నాతో సంప్రదించి, నీకు నా నిర్ణయం చెబుతాను.”



* * *

తన కుమార్తె కొర్నీలియాను వివాహమాడేందుకు అంగీకరించిన పక్షంలో సీజర్‌ను సేనలో చేర్చుకొనడానికి అంగీకరించగలనని కొర్నీలియస్ సిన్నా అన్నాడు. వరకట్నంగా చాలా ధనం, భవనాలు ఈయగలనని తెలిపాడు. కొర్నీలియాతో వైవాహిక సంబంధంను తిరస్కరించవలసిన కారణం సీజర్‌కు కనిపించలేదు.

తానొకటి తలస్తే దైవమొకటి తలిచిందని ఆర్యోక్తి. సీజర్ తండ్రి ఆకస్మికంగా మరణించాడు. పదనారేళ్ల వయసులోనే జూలియస్ సీజర్ ఇంటి బాధ్యతనూ, దేవాలయ ప్రధాన అర్చక బాధ్యతనూ స్వీకరించవలసి వచ్చింది. అదే సమయంలో రోమ్‌లో జరుగుతున్న ఆధిపత్య పోరాటం అంబరాన్ని అంటింది.

రోమ్ రక్త ప్రవాహంలో కొట్టుకొని పోగలదనిపించింది. సీజర్ మేనమామ మారియస్, మామగారు కొర్నీవియస్‌లు తమ ప్రత్యర్థి జుల్లాతో యుద్ధం చేయవలసి వచ్చింది. చివరకు జుల్లాదే పైచేయి అయింది. తన ప్రత్యర్థులకు బంధువయిన కారణంగా అతడు సీజర్ ఆస్తినీ, సీజర్‌కు భార్య ద్వారా సంక్రమించిన కట్నకానులకలనీ స్వాధీనం చేసుకొని, వంశ పరంపరగా సంక్రమించిన అర్చక పదవి నుంచి కూడా తొలగించాడు.

ప్రాణాలకు ముప్పు తప్పదేమోనన్న భయంతో సీజర్ భార్యతో సహా అజ్ఞాతం లోనికి వెళ్లిపోవలసి వచ్చింది. కొంత కాలానికి సీజర్ తల్లి ఆరివియా కోట్టా తన బంధువుల సహాయంతో సీజర్‌ని మరణ భయం నుంచి తప్పించింది. కానీ ప్రాణగండం ఏనాటికైనా తప్పదన్న భయంతో సీజర్ రోమ్‌ను వదలి వెళ్లిపోయినాడు. అనేక రాజ్యాలలో ఎందరో సైన్యాధిపతుల దగ్గర పనిచేసి, యుద్ధవిద్యలలో ఆరితేరినాడు. జుల్లా చనిపోయేవరకు రోమ్ నగరంలో అడుగు పెట్టలేదు. ఇరువది రెండేళ్ల యౌవనంలో ధనహీనుడిగా ఒక సాధారణ గృహంలో నివాసమేర్పరుచుకుని, రోమ్ నగరవాసి కాగలిగాడు.

* * *

విక్రమాదిత్యుడు మంత్రి సామంతులతో కొలువు తీర్చినాడు. ఆనాడు ఇతర రాజ్యాల నుంచి వచ్చిన దూతలకు మహారాజు దర్శనమీయగలడని ముందుగానే తెలియచేశారు. రాయబారులు తెచ్చిన కానుకలను సమర్పించి, సందేశాలు విన్నవిస్తున్నారు. విక్రమాదిత్యుడు మంత్రులకు తగు ఆదేశాలు ఇస్తున్నాడు.

“ప్రభూ! నేను అజయమేరు నగరం నుంచి చహమాన వంశీయుడు అజయ రాజు వద్ద నుండి

తమ ధర్శనార్థం వచ్చాను. మా ప్రభువులు తమకు స్వర్ణ కంకణమునూ, మృణ్మయ భంజికలనూ కానుకగా పంపినారు."

"తమ రాకకు కారణం?"

"తమ దర్శనానికే మహాప్రభు!"

"మంచిది... మా నగరంలోనే తమకు నివాస మేర్పరచడం జరుగుతుంది."

"కృతజ్ఞుణ్ణి"

(అజయము-నేటి అజ్మీరు; చహమాన వంశం పేరే చౌహాన్‌గా మారింది)

"చిత్తం! మహాప్రభూ... మా రాజుగారు అజయ రాజు తమ కుమార్తె లక్ష్మీదేవి కోసం తమ హస్తాన్ని అర్థిస్తున్నారు. ప్రభువుల సాహచర్యంలో తమ పుత్రిక జీవితం ఆనందమయం కాగలదని వారి నమ్మకం.


విక్రమాదిత్యుడు తన పంకించి, దూతను వీడు కొలిపాడు. ఆపైన మహామంత్రిని పిలిపించి మాట్లాడాడు. చహమాన వంశం కూడ పరమార వంశం వలెనే అగ్ని నుండే ఉద్భవించింది. మ్లేచ్ఛులూ, శకులూ తమ రాజ్యాన్ని ఆక్రమించకుండా చహమానులు నిరోధించగలుగుతున్నారు. అజయమేరు పాలకునితో వైవాహిక బంధం ఉజ్జయినికి లాభదాయకమే కాగలదు.

ఆనాటి రాత్రి విక్రమాదిత్యుని ఆలోచనా ప్రవాహం అనేక దిక్కులకు సాగింది. తన పితృ పాదులు అగ్నివంశ క్షత్రియులతో వివాహ బంధం శ్రేయస్కరమని ఇదివరలోనే సూచించారు. నేడు మహామంత్రి అదే మాట అంటున్నాడు. వివాహం కేవలం రాజ్యశ్రేయస్సున కేనా? తన మనసులోనికి వలపు, అనురాగం, ప్రేమ వంటి పదాలు రానీయ రాదా? ఇంద్రప్రస్థ నగరం వెలుపల యోగమాయా దేవి మందిరంలోని బహిః ప్రాంగణంలో కన్పించిన దెవరు? వీర విద్యా ప్రదర్శనను తన మనసు మెచ్చుకున్నది. తీయని కంఠమూ, ఒత్తైన దీర్ఘ కుంతలాలూ ఆమె స్త్రీ అనే అన్పిస్తున్నది. ఇంతకూ ఎవరామె? ఎవరైన నేమి? తన ప్రస్తుత కర్తవ్యం భరతభూమిని ఏకచ్ఛత్రం క్రిందకు తీసుకొని వచ్చి, మ్లేచ్ఛుల దురాక్రమణ పాలు కాకుండా కాపాడడం. ఆ ప్రయత్నానికి చహమాన రాజులతో సంబంధ బాంధవ్యాలు ముఖ్యం.

విక్రముడు తండ్రి ఆశ్రమానికి వెళ్లి, విషయం విన్నవించి, జనకుని అనుమతితో "అజయమేరు రాజ కుమార్తెను చేపట్టడం మాకు అంగీకారమే" అన్న వార్తను దూత ద్వారా అజయరాజుకు పంపించినాడు.

* * *

ఉజ్జయినీ పతి బంధుమిత్రులతో, పరివారంతో అజయమేరు నగరాన్ని సమీపించడానికి ఆరు యోజనాల దూరంలోనే కన్యాదాత మంత్రులతో, భటులతో ఎదురు వచ్చి, స్వాగత సత్కారాలు చేసి,



పాట ముగిసే సరికి పాదాల దగ్గర ఒక కర్ర వచ్చి పడింది. ఆ కర్రకు భూర్జపత్రం చుట్టి ఉన్నది. అతడు నలువైపులా చూసినప్పటికీ ఎవరూ కన్పించ లేదు. కోటగోడపై నిలబడి ఎవరైననూ విసిరి ఉండ వచ్చునా? దూరంగా అడుగుల చప్పుడు వినబడినది. ఎవరా వ్యక్తి? కొయ్యముక్కను విసిరిన వారేనా? "విక్రమా! ఇక్కడకు వచ్చావా? నిద్రపట్టడం లేదా"?

కోటకు దగ్గరలోని ఉద్యానవనంలోని భవనంలో విడిది చేయించాడు. వివాహానికి ఏర్పాట్లు పూర్తయినవనీ, మూడవనాటి ఉదయమే కోటలోనికి తీసుకొని వెళ్లగలననీ విన్నవించినాడు.

విక్రమాదిత్యుడు "ఆ విషయం తర్వాత ఆలోచింపవచ్చును" అని రాజును వీడు కొలిపాడు.

* * *

వివాహానికి ముందు నాటి రాత్రి ఎంత ప్రయత్నించినా విక్రమునికి నిద్ర పట్టలేదు. అతడు ఉద్యానవనంలోనికి వెళ్లి, భవనాలకు దూరంగా, కోట గోడకు దగ్గరగా ఒక వృక్షం క్రింద కూర్చుండి, పరమేశ్వరుని ఉద్దేశించి పాట పాడుకోసాగినాడు. తన మనసు ధర్మానికే అంకితం కావలెననీ, కోరికల వైపు మరలరాదనీ పాట సారాంశం.

పాట ముగిసే సరికి పాదాల దగ్గర ఒక కర్ర వచ్చి పడింది. ఆ కర్రకు భూర్జపత్రం చుట్టి ఉన్నది. అతడు నలువైపులా చూసినప్పటికీ ఎవరూ కన్పించ లేదు. కోటగోడపై నిలబడి ఎవరైననూ విసిరి ఉండవచ్చునా?

దూరంగా అడుగుల చప్పుడు వినబడినది. ఎవరా వ్యక్తి? కొయ్యముక్కను విసిరిన వారేనా?

"విక్రమా! ఇక్కడకు వచ్చావా? నిద్రపట్టడం లేదా"?

"మిహిరా, నీవా?"

"ఎవరనుకున్నావు?"

"అజ్ఞాత వ్యక్తి ఎవరో ఒక కొయ్యకు పత్రం చుట్టి విసిరినారు. ఆ వ్యక్తి ఈ ప్రాంతంలోనే ఉండాలి కదా!"

"తెల్లవార వస్తున్నది... లోనికి పోదాం రా!"

విక్రముడు లేచి మిత్రునితో పాటు నడచి భవనం చేరుకునేసరికి అజయమేరు రాజభటులు వేచి ఉన్నారు.

లేఖను చదివిన విక్రమాదిత్యుడు స్తంభీభూతుడై నిలబడిపోయినాడు.

"దేవాలయంలో ప్రేమగీతమెందుకు?

ఉద్యానవనములో భక్తి సంగీతమెందుకు?"

"మిత్రమా" అన్న మిహిరుని పిలుపు విక్రమునకు విన్పించలేదు. రెండవసారి పిల్చినా వినబడలేదు. "మహారాజా! మనం తరలివెళ్లే సమయమైంది" అని మిహిరుడు విక్రముని చెవి దగ్గరగా చెప్పి, అతనిని బాహ్య ప్రపంచంలోకి తీసుకొచ్చాడు.

* * *

వివాహ కార్యక్రమం ప్రారంభమైంది. పురోహితులు చెప్పిన విధంగా విక్రమాదిత్యుడు హోమ, దాన మంత్రోచ్చారణ విధులను నిర్వహిస్తున్నాడు. అతని మనసులో ఒక్కటే ఆలోచన నిలకడగా ఉంది. "నా కర్తవ్యం నేను మరువకుందును గాక. ధర్మం తప్పకుందును గాక. వివాహం ధర్మాచరణకే కానీ తృతీయ పురుషార్థమైన కామం కోసం కాదని మరువకుందును గాక. నేను వివాహమాడుతున్న కన్యయందే నా హృదయం లగ్నమగును గాక.

వధువును నెమ్మదిగా ఆమె మాతృమూర్తి, సఖీ జనం కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చి కూర్చుండ పెట్టారు. "ఈమె చేతిని గ్రహించి, సహధర్మచారిణిగా స్వీకరించవలసినది" అనే అర్థంతో మంత్రాలు చదువుతుండగా, కన్యాదాత తన కుమార్తె లక్ష్మీదేవి చేతిని వరుని చేతిలో ఉంచాడు. అప్రయత్నంగా కనులెత్తిన విక్రమాదిత్యుని ముఖంలో ఆశ్చర్యమూ, ఆనందమూ కలసి తాండవించినాయి. వధువు మోముపై చిరునవ్వు కదలాడినది. అది ఆనంద సంకేతమా లేక పరిహాస సూచకమా?

మంత్ర పఠనం సాగిపోతోంది. లక్ష్మీదేవి నెమ్మదిగా "నా లేఖ తమకు చేరినదా?" అని అడిగినది.

"వేడుకగా ఉన్నదా?"

"లేదు...భయం" ఆమె చేయి చెమటతో తడిసి, అతని చేతిలో ఇమిడిపోయింది. అతడు ధైర్యం కలిగించడానికా అన్నట్లుగా ఆమె చేతిని గట్టిగా పట్టుకున్నాడు. సభాసదులంతా చూస్తున్నారన్న భావం సంభాషణకు అడ్డుపడింది. (సశేషం)




# నెరి గిట్లనా?

**మా** అమ్మా, నాయినలు అనలేదు. మా అన్నదమ్ముండ్లు, అక్కచెల్లెండ్లు అనలేదు. ఆకర్కి నా సోపల్లు గుడ్క అనలేదు. గని నా పెండ్లాం అన్నది. ఏమన్నదంటె నాకే పని శాతగాదని అన్నది.

గామె అన్న మాటల నిజమున్నది. నిజంగనే నాకు ఎసువంటి పని చెయ్యరాదు. ఎసువంటి పనంటె వొంట పని, ఇంటి పని.

అందరి లెక్కనె నేను సుత ఆపీస్ బోత. కొల్వు జేస్త. ఇంటికొచ్చినంక గింత దింట. మంచిగ పంట. బజార్ల కెల్లి బియ్యం, నూనె, ఉప్పు, పప్పులను నా పెండ్లామే కొన్కోని వొస్తది. కూరగాయలు దెస్తది. కమ్మగ వంట జేస్తది. తినుడే నా పని. తిన్నావుర ఎంకటీ అంటె తిన్న. పన్నావుర ఎంకటీ అంటె పన్న.

మా పోరగాల్లను నా పెండ్లామే బల్లె షరీక్ జేసింది. గాల్లతోని సదివిస్తది. బల్లె పంతుల్లను గల్సి మా పోరగాల్ల మంచిచెడ్డలు అర్సుకుంటది. గామె ఎసువంటి పని జెప్పినా మా పోరలు జేస్తరు. నేను చిన్న పని జెప్పినా గాల్లు జెయ్యరు.

నెలకొకసారి టప్పుఖానకు బోయి నా పెండ్లాం మా ల్యాండ్‌లైన్ ఫోన్ బిల్లు గట్టివొచ్చేడ్డి. గా జమానల గిప్పటి తీర్గ సెల్‌ఫోన్లు లేకుండె. వాడకట్టుల ఎవలింట్లనన్న ఫోనుంటె వాడకట్టోల్లందరు గా ఫోన్ నెంబర్ అందరికి ఇచ్చెటోల్లు.

"నాకు శాతనైత లేదు. గీపారి నువ్వే ఫోన్ బిల్లు గట్టిరా" అని నా పెండ్లాం అన్నది.

"మంచిది కట్టొస్త"

ఫోన్ బిల్లు దీస్కోని టప్పుఖానకు బోయిన. గని సర్వర్ డౌనుండె బట్కె ఫోన్ బిల్లు కట్టకుండనే మర్లొచ్చిన.

"కట్టినవా?" అని నా పెండ్లాం అడిగింది.

"కట్టలే"

"ఎందుక్కట్టలే"

"సర్వర్ డౌన్ అయింది"

"అమాస పున్నానికి పనిజేస్తె గిట్లే ఉంటది. నా పని నాకు దప్పదు" అని నా పెండ్లాం అన్నది.

నాకు ఒక బేంకుల కాత ఉన్నది.

"నడి నాత్రి పైసలతోని పని బడ్తె యాడ్కి బోతవు బావా" అన్కుంట నా బామర్ది ఎటిఎం కారట్ ఇప్పిచ్చిండు.

ఒకపారి రానిగంజ్‌కు బోయిన. కీసల పైసలు లేకుండె. గని ఎటిఎం కారట్ ఉన్నది. ఒక బేంకు కాడ్కిబోయి ఎటిఎం మిషన్ల కారట్ బెట్టిన. నేనెట్ల బెట్టిననో ఏమో గని గా కారట్ బోయి మిషిన్ల బడ్డది. కారట్ బాయె. పైసల రాకపాయె. గీ సంగతి బెంకోల్లకు జెప్పిన. గాల్ల రానిగంజ్ బ్రాంచిబోతె ఎంటిఎం కారట్ దొరుకతదని జెప్పిండ్రు.

గివన్ని జూసి నీ చెయ్యి ఇన్పచెయ్యి అని నా పెండ్లాం అంటుంటది. గీనడ్మ ఊకూకె నేను యాది మరుస్తున్న. ఏందో సోంచాయించుకుంట మా ఇల్లు దాటి ముంగట్కి బోతున్న.

"గిటెటు బోతున్నరు" అని ఎవ్వలన్న అడిగితె "మా ఇంటికి" అని జెప్తున్న.

ఇల్లుగిన బద్లాయించనమేమో అని అడిగినోడు అనుకుంటున్నడు. హోష్లకొచ్చినంత మా ఇల్లు దాటిపోయిన సంగతి యాదికొస్తున్నది.

నా పెండ్లయి ముప్పై ఏండ్లయినయి. మీరు నమ్మండ్రి. నమ్మకపోండ్రి. ఎన్నడు నా పెండ్లాం కోసం నేను మల్లెపూలు గొంచబోలేదు. ఏం జెయ్యమంటరు. నేను ఒక పత్రికల పనిజేస్తున్న. నాత్రి ఆరుగొట్టంగ డ్యూటిలకెక్కేది. మల్ల నాత్రి రొండుగొట్టంగ డ్యూటిల కెల్లి దిగేది.


గా దినం దివిలె. మా పత్రికకు తాతీల్ ఇచ్చిండ్రు. బజార్లకెల్లి వొస్తుంటె మల్లెపూలు గండ్లబడ్డయి. మల్లెపూలు గొన్న. ఇంటికి బోయి నా పెండ్లాంకిచ్చిన. గామె తిట్టిన తిట్టు తిట్టకుంట నన్ను ఒక తీర్గ తిట్టింది. ఎందుకంటె –

నెల దినాల కింద మేము తిర్పతికి బోయినం. మొక్కుంటె నా పెండ్లాం గుండు గొట్టిచ్చుకున్నది. గుండుతోని ఉండంగ మల్లెపూలిస్తె గామెకు మండింది. ★



**తెలిదేవర భానుమూర్తి**
**సీనియర్ జర్నలిస్ట్, 9959150491**


ఉన్నత విద్య, మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం దశాబ్దాల క్రితమే భారతీయులు విదేశాలకు వెళ్లారు. అక్కడ వారు ఆయా రంగాల్లో అత్యుత్తమ ప్రతిభా పాటవాలను చాటి స్థిరపడ్డారు. పేరు, ప్రతిష్టలను పొందారు. తద్వారా తాము స్థిరపడిన దేశానికి, జన్మభూమికి మంచిపేరు తెచ్చారు. వారి తెలివితేటలు, ప్రతిభ ఆయా దేశాలకే కాకుండా మాతృదేశానికి కూడా ఉపయోగ పడాలన్న ఉద్దేశంతో ఎల్.ఎం సింఘ్వీ కమిటీ 2002లో 'ప్రవాస భారతీయ దివస్'ను ఏర్పాటు చేయాలని సూచించింది. దానిని మన్నించిన నాటి ప్రధాని అటల్ బిహారీ వాజపేయి మరుసటి ఏడాది (2003) నుంచి ప్రవాస భారతీయ దివస్‌ను ప్రారంభించారు. అప్పటినుంచి ఏటా క్రమం తప్పకుండా ఈ సదస్సులను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా నుంచి 1915 జనవరి 9న భారత్‌కు తిరిగివచ్చారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా జనవరిలో ప్రవాస భారతీయ దివస్ నిర్వహిస్తున్నారు.




# ప్రవాస భారతీయుల సంక్షే

కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏటా ఒక్కో నగరంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 17వ ప్రవాస భారతీయ దివస్‌ను మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో నిర్వహించారు. జ్యోతిర్లింగ క్షేత్రమైన ఇండోర్ ఆధ్యాత్మిక నగరంగా పేరొందింది. అత్యంత పరిశుభ్రతా నగరంగా కూడా గుర్తింపు పొందింది. దీనికి ముందు 16వ ప్రవాస భారతీయ దివస్ మరో ప్రముఖ జ్యోతిర్లింగ క్షేత్రమైన వారణాసి నగరంలో 2019లో జరిగింది.

ఈ జనవరి 8 నుంచి 11 వరకు మూడు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రిపబ్లిక్ ఆఫ్ గయానా అధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ ఇర్ఫాన్ ఆలీ ప్రత్యేక అతిథిగా, మారిషస్ ప్రధాని ప్రవింద్ కుమార్ జగన్నాథ్ ముఖ్య అతిథిగా, రిపబ్లిక్ ఆఫ్ సూరినామ్ గౌరవ అధ్యక్షుడు చంద్రికా పర్సార్ సంతోఖి పాల్గొన్నారు. ఆస్ట్రేలియా పార్ల మెంటు సభ్యురాలు జానెట్ మస్క రెనహాన్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. మధ్యప్రదేశ్ గవర్నర్ మంగుభాయ్ పటేల్, ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, 70 దేశాలకు చెందిన సుమారు 3500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. దాదాపు 110 దేశాల్లో నివసిస్తున్న ప్రవాస భారతీయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పాల్గొని ప్రవాస భారతీయ సమ్మాన్ అవార్డులను అంద జేశారు. రెండేళ్ల తరవాత ఈ సదస్సు జరిగింది. ప్రపంచవ్యాప్తంగా 2019 నాటికి 1.8 కోట్ల మంది ప్రవాస భారతీయులు ఉన్నట్లు అంచనా. 'అమృత కాలంలో భారతదేశ ప్రగతికి విశ్వసనీయమైన భాగస్వామ్యం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య పోరాటంలో ప్రవాసుల సహకారంపై డిజిటల్ ప్రదర్శనను ప్రధాని ప్రారంభించారు. 'సురక్షిత్ జాయేన్, ప్రశిక్షిత్ జాయేన్' అనే అంశంపై స్మారక స్టాంపును విడుదల చేశారు. సదస్సును ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా అనేక అంశాలను ఆయన లోతుగా విశ్లేషించారు. ముఖ్యంగా భారత ప్రగతిలో ప్రవాస భారతీయుల పాత్రను, వారు అందిస్తున్న సేవలను, చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. స్వదేశంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా, కొత్తగా పరిశ్రమలను ప్రారంభించడం ద్వారా భారత ప్రగతికి పాటుపడు తున్నారని ప్రశంసించారు. తద్వారా అనేకమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఈ విధంగా పుట్టిన గడ్డ, నివసిస్తున్న దేశానికి ఉభయ తారకంగా పని చేస్తున్నారని అన్నారు. వాస్తవానికి ఆయా దేశాల్లో భారత్‌కు ప్రత్యేకంగా రాయబారులు, హై కమిషనర్లు అక్కరలేదని, అక్కడ స్థిరపడిన ప్రవాస భారతీయులే స్వదేశానికి బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తూ దేశ ప్రతిష్టను ఇనుమడింపజేస్తున్నారని అభిప్రాయ పడ్డారు. ఒక్కో ప్రవాస భారతీయుడు ఒక్కో రాయబారికి సమానమని, ప్రవాస భారతీయులు తమ ప్రవర్తన, చిత్తశుద్ధి, నైతికత, విలువలు, కష్టపడే తత్వం, సాంకేతికత ద్వారా భారత్ పేరు ప్రతిష్టలు పెంచుతున్నారని ప్రశంసించారు. అంతేకాక కొంతమంది ప్రవాస భారతీయులు ఆయా దేశాల్లో రాజకీయ రంగాల్లో సైతం రాణిస్తూ, అత్యున్నత రాజకీయ పదవులను చేపడుతూ భారతీయతను అక్కడి ప్రజల్లోకి తీసుకెళుతున్నారని కొనియాడారు. అగ్రరాజ్యాలైన అమెరికా (కమలా హారిస్, ఉపాధ్యక్షురాలు), బ్రిటన్ (రిషి సునాక్, ప్రధాని) వంటి దేశాల్లో కీలక రాజకీయ పదవులు చేపట్టడం ద్వారా భారతీయ వెలుగులు విరజిమ్ము





# మమే లక్ష్యం!

తున్నారన్నారు. భారత్ ఏనాడూ తన స్వప్రయోజనా లకే పరిమితం కాలేదని, వసుధైక కుటుంబం భావనతో విశ్వమానవాళి శ్రేయస్సుకు పాటుపడిందని ప్రధాని అన్నారు. కరోనా సమయంలో భారత్ నిర్వహించిన పాత్రను అంతర్జాతీయ సమాజం కొనియాడిందని గుర్తు చేశారు. జి-20 సదస్సుకు అధ్యక్షత వహించే అరుదైన అవకాశం ఈ ఏడాది భారత్‌కు లభించిందని, దీనిని ఒక హోదాగా కాకుండా, బాధ్యతగా, గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. జి-20 అధ్యక్ష హోదాలో ప్రపంచ శాంతికి, విశ్వ మానవాళి శ్రేయస్సుకు భారత్ పాటుపడుతుందని తెలిపారు.

ప్రవాస భారతీయుల కోసం కేంద్రం కొన్ని కార్యక్రమాలను చేపట్టనుంది. వలస వచ్చిన ప్రవాస భారతీయ కార్మికుల నైపుణ్యాభివృద్ధి ప్రక్రియను సంస్థాగతీకరించడానికి ప్రవాసీ కౌశల్ వికాస్ యోజన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ప్రవాస భారతీయుల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు, విద్యార్థుల కోసం స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయను న్నారు. 18-30 సంవత్సరాల ప్రవాస భారతీయ పిల్లలు భారతీయ మూలాలు, భారతీయ సమకాలీన పరిస్థితులు తెలుసుకునేందుకు 'నో ఇండియా ప్రోగ్రామ్'ను ప్రారంభించనుంది. వలసదారుల సంక్షేమం, వారి ఇబ్బందులను తొలగించేందుకు ఇ-మైగ్రేట్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

ఈ సందర్భంగా నలుగురు కేంద్ర మంత్రుల ఆధ్వర్యంలో నాలుగు కీలక సదస్సులు జరిగాయి. ఈ సదస్సుల్లో ఆయా అంశాలకు సంబంధించి లోతుగా అధ్యయనం చేశారు. ఈ రంగాల్లో ఇంకా ఎలా ముందుకెళ్లాలి, ప్రవాస భారతీయుల సేవలను మరింత సమర్థంగా ఎలా వినియోగించుకోవాలి, మరిన్ని పెట్టుబడులు ఎలా రాబట్టాలి, కొత్త పరిశ్రమల స్థాపనకు ఏ చర్యలు చేపట్టాలి అనే అంశా లపై చర్చించారు. ఆర్థిక అంశాలు, విదేశీ పెట్టు బడులు, నూతన పరిశ్రమల స్థాపన, సరళీకరించిన ఆర్థిక, పారిశ్రామిక విధానాల అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలను ఆమె వివరించారు. అమృత కాలంలో ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ .. అనే అంశంపై నిర్వహించిన రెండో సదస్సుకు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మనసుఖ్ మాండవీయ అధ్యక్షత వహించారు. ఆరోగ్య పరిరక్షణకు, పర్యావరణాన్ని కాపాడేందుకు భారత్ చేపడుతున్న, చేపట్టనున్న చర్యలను ఈ సందర్భంగా మాండవీయ వివరించారు. కొవిడ్ సమయంలో యావత్ ప్రపంచం ఆటుపోట్లకు గురైనప్పటికీ భారత్ ఎదుర్కొన్న తీరును, విదేశాలకు టీకాలు సరఫరా చేసి మానవాళి పరిరక్షణకు చేసిన నిస్వార్థ యత్నం అంతర్జాతీయ సమాజం అభినందిం చిందన్నారు. అదేవిధంగా కర్బన ఉద్గారాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను ఆయన సోదాహరణంగా తెలియజేశారు. భారత్ శక్తి యుక్తులను సద్వినియోగపరచుకోవడంలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను సదస్సుకు అధ్యక్షత వహించిన విదేశాంగ శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి వివరించారు. విద్యపై నిర్వహించిన సదస్సుకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షత వహించారు. ప్రాథమిక రంగం నుంచి ఉన్నత విద్యారంగం ఉన్నతికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, కేటాయిస్తున్న నిధులు, తీసుకువస్తున్న సంస్కరణలు తదితర అంశాలను ఆయన వివరించారు. ముగింపు కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పాల్గొని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 27 మంది ప్రవాస భారతీయ దివస్ విజేతలకు అవార్డులు అందజేశారు. వీరిలో ఆస్ట్రేలియా, ఇథియోపియా, ఇజ్రాయెల్, జపాన్‌లకు చెందిన వారున్నారు. ఇజ్రాయెల్‌కు చెందిన చెఫ్ రీనా పుష్కర్ణకు అవార్డు అందజేశారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, దుబాయ్‌లకు చెందిన తెలుగు వారు కూడా ప్రథమ పౌరురాలు నుంచి అవార్డులు అందుకున్నారు. తెలుగువారైన కుంభాల మహేందర్ రెడ్డి (రాజన్న సిరిసిల్ల జిల్లా), బాలు బొమ్మిడి (తిరుమనపల్లి, నిజామాబద్ జిల్లా), భోగ వేణుగోపాల్ (చౌట్‌పల్లి, నిజామాబాద్ జిల్లా), కచ్చు కొమరయ్య (అబ్బపూర్, పెద్దపల్లి జిల్లా), సౌదీ అరేబియా రాజధాని రియాద్ నుంచి ఆంటోనీ (హైదరాబాద్), ఖతర్ నుంచి రజనీ కుమారి (అనంతపురం), పన్నేరు నరేంద్ర (జగిత్యాల) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవాస తెలుగువారిని కూడా భాగస్వాములను చేయడం ద్వారా ప్రధాని తమను గౌరవించారని కుంభాల మహేందర్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. మొత్తానికి 17వ ప్రవాస భారతీయ దివస్ ప్రవాస భారతీయుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. మున్ముందు వారినుంచి మరిన్ని పెట్టుబడులు వచ్చేందుకు మార్గం సుగమం చేసింది.

**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**



# విద్యల తల్లికి

‘విద్వాన్ సర్వత్ర పూజ్యతే..’ హితోక్తికి హేతువు సకలజ్ఞాన ప్రదాయిని సరస్వతీమాత. సురగురువు లాంటి అసామాన్యులు నుంచి సామాన్యుల వరకు ఆమె దయాలబ్ధపాత్రులే. మేధాశక్తి, విద్యాసంపద గల దేవతాగురువు బృహస్పతి విద్యాసిద్ధి కోసం వాణిని ఆశ్రయించారని కథనం. గురుశాపంతో విద్యలన్నీ కోల్పోయిన యాజ్ఞవల్క్య మహర్షి తిరిగి వాటిని పొందినా, అజ్ఞానిగా ఉన్న వ్యక్తి మహాకవి కాళిదాసుగా వినుతికెక్కినా, బోయవాడు ఆదికవి వాల్మీకిగా అవతరించి దివ్యభవ్య రామాయణం రాసినా వాగ్దేవి కరుణా కటాక్ష వీక్షణలే కారణం. సరస్వతిని భారతి, వేదమాత, వాగీశ్వరి, శారద, వాగ్దేవి వంటి పేర్లతో అభివర్ణిస్తారు. సామాన్య పరిభాషలో ‘చదువుల తల్లి’.

విద్యవల్ల జ్ఞానం, దాని ద్వారా భుక్తి, ముక్తి సిద్ధిస్తాయి. కేవలం చదవడం, రాయడమే (అక్షర జ్ఞానం) విద్యకాదు. మనిషిలోని వివేకం,కళలు, బుద్ధి(విచక్షణ) నైపుణ్యం/సృజన, విషయాల పట్ల అవగాహన, సమయస్ఫూర్తి వంటివీ చదువు కిందికే వస్తాయంటారు. ఈ సకల మేధో సంపదలకు ఆమెను అధిష్ఠానదేవతగా కొలుస్తారు.

సరస్వతీనది అంతర్వాహినిగా ఉన్నట్లే వాణీ ప్రసాదిత జ్ఞానసంపద వివేకవంతమైన జీవితానికి చుక్కానిగా నిలుస్తుంది. అఖిల విద్యావరదాయనిగా, జ్ఞానవల్లీ సముల్లాసినిగా సరస్వతీదేవి మాఘ శుద్ధ పంచమి (శ్రీ పంచమి) నాడు అభివ్యక్తమైందని బ్రహ్మాండ పురాణం పేర్కొంటోంది. సృష్టి నిర్మాణ నిర్వహణా శక్తులన్నిటిలో సర్వోత్కృష్ట మూలకారకశక్తి మహాసరస్వతి అని జగద్గురు ఆదిశంకర భగవత్పాదులు ‘సౌందర్యలహరి’లో శ్లాఘించారు. తాము నెలకొల్పిన నాలుగు ఆమ్నాయపీఠాలలో దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠం మొట్టమొదటిది. తుంగాతీరంలో ప్రసవవేదన పడుతున్న కప్పకు తాచుపాము తన పడగ నీడలో ఆశ్రయమిచ్చిన దృశ్యం ఈ పీఠస్థాపనకు ప్రేరణగా చెబుతారు. లోకానికి ప్రేమసుధలు పంచే విద్యానిలయంగా శంకరులు ఈ పీఠాన్ని స్థాపించారు. ‘ప్రణోదేవి సరస్వతి’ అని రుగ్వేదం, ‘సరస్వతీ శాస్త్రమయీ’ అని లలితా సహస్ర నామావళి శారదాంబ వైభవాన్ని కీర్తించాయి. ‘తెల్లని వస్త్రం ధరించిన సరస్వతీదేవి కాంతిమంత వదనంతో చల్లని చిరునవ్వు వెదజల్లుతుంటుంది. సత్త్వగుణ ప్రధానంగా విరాజిల్లుతుండగా, బ్రహ్మాది దేవతలు ఆమెను కీర్తిస్తుంటారు’ అని (దేవీ భాగవతం) శ్రీ మహావిష్ణువు నారదమునికి వర్ణించి చెప్పారు. అనంతమైన అక్షర మహిమతోనే జ్ఞానం వెలుగులు విరజిమ్ముతుంది. అలాంటి జ్ఞానవేత్తలను సరస్వతీ అవతారంగా సంభావిస్తూ ‘పుంభావ సరస్వతులు’గా అభివర్ణిస్తారు.

ఈ జగత్తు ఒక దశలో నిస్తేజంగా, నిశ్శబ్దంగా మారడంతో ఆందోళన చెందిన దేవతలు విధాతను ఆశ్రయించగా, ఆయన తన దివ్య కమండలంలోని మంత్రపూరిత జలాన్ని భూమిపై చిలకరించాడట. దాంతో రెండు చేతులతో వీణ వాయిస్తూ, మరో రెండు చేతులలో జపమాల, పుస్తకాన్ని ధరించిన బ్రాహ్మీశక్తి ఉద్భవించిందని చెబుతారు. ఆమే విద్యల రాణి వాణి. ఆమె పంచమి నాడు అవిర్భవించారు కనుక ఆ రోజును ‘శ్రీపంచమి’ అంటారని పురాణాలు. శాస్త్రాలు పేర్కొంటున్నాయి. శ్రీపంచమిని ‘మదన పంచమి’ అనీ అంటారు. శివుడు కోపాగ్నికి ఆహుతైన మన్మథుడు భార్య రతీదేవి ప్రార్థనతో తన రూపం ఆమెకు మాత్రమే కనిపించేలా వరం పొందిన రోజు ఇదేనని చెబుతారు.

# త్రిమూర్తి స్వరూపు

సూర్యభగవానుడు కర్మసాక్షి. సకల లోకాలకు ఆత్మస్వరూపుడు. ‘సర్వం సూర్యమయం జగత్’ అన్నట్లు సకల జగత్తు ఆయన తేజస్సుతో చైతన్యం పొందుతోంది. సమస్త ప్రాణకోటి ఆయనపైనే ఆధారపడి ఉంది. సకల చరాచరసృష్టికి, జీవరాశి మనుగడకు సూర్యశక్తి అనివార్యం. ఆయన కాలస్వరూపుడు. సూర్యగమనాన్ని అనుసరించే సంవత్సర కాలాన్ని ఉత్తర దక్షిణాయనాలుగా విభజించారని తెలిసిందే. సమస్త జీవరాశికి ఆధారభూతుడు కనుకనే వేదాలు ఆయనను త్రిమూర్తి స్వరూపుడిగా, సర్వదేవతా సమాహారమని అభివర్ణించాయి.




సూర్యనారాయణమూర్తి త్రిమూర్తి స్వరూపుడు. ఉదయం బ్రహ్మ, మధ్యాహ్నం మహేశ్వరుడు, సాయంత్రం విష్ణు స్వరూపుడిగా అర్చిస్తారు. సూర్యకాంతిలో కనిపించే సప్తవర్ణాలను సప్తాశ్వాలుగా మహర్షులు కీర్తించినట్లు తెలుస్తోంది. ద్వాదశ ఆదిత్యులు (పన్నెండుగురు) అని మన ఆధ్యాత్మిక గ్రంథాలు పేర్కొంటున్నాయి. తీక్షణతను బట్టి ఒక్కొక్క మాసానికి ఒక్కొక్క సూర్యుడు సారథ్యం వహిస్తాడు. ఆ ప్రకారం, ఆయన జన్మతిథి (రథసప్తమి) వచ్చే మాఘ మాసంలోని ఆదిత్యుడిని ‘పూషుడు’అనే పేరుతో వ్యవహరిస్తాడు. భాస్కరుడు నిత్యానుసంధానీయుడు. మరీ ముఖ్యంగా మాఘమాసంలోని ఆదివారాలలో ఆయన అర్చనను మరింత ప్రత్యేకతగా చెబుతారు. ఆదివారాలలో సూర్య నమస్కారాలు చేసి పాలను నివేదిస్తే సకల శుభాలు కలుగుతాయని విశ్వాసం. **‘నమస్కార ప్రియోభానుః’** అని ఆర్యోక్తి. కేవలం వందనంతోనే ప్రసన్నుడై ఆరోగ్య విజ్ఞానాలను ప్రసాదించే ప్రత్యక్ష భగవానుడు దివాకరుడు. ఉదయాస్తమయ వేళల్లోని సూర్యకిరణాలు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయని ఆయుర్వేదం చెబుతోంది. సూర్య

# అక్షరాంజలి



బౌద్ధులు దీనిని 'మంజుపంచమి'గా పిలుస్తారు. సరస్వతి ఆరాధన సనాతన వైదిక ధర్మంలోనే కాకుండా బౌద్ధ జైనాలలోనూ కనిపిస్తోంది. బౌద్ధులు 'మంజుశ్రీ' పేరుతో, జైనులు 'శ్రుతవదన'గా ఆమెను అర్చిస్తారు. రోమన్లు, గ్రీకులు శ్రీవాణిని 'జ్ఞాన దేవత'గా ఆరాధిస్తారు.

సరస్వతిని జ్ఞాన ఐశ్వర్య సౌభాగ్యశక్తుల ప్రతీకగా చెబుతారు. జ్ఞానం వల్ల ఐశ్వర్యం, ఐశ్వర్యం వల్ల సౌభాగ్యం, సౌభాగ్యం వల్ల జీవిత పరమార్థం సిద్ధిస్తాయని పెద్దలు చెబుతారు. వాణీ బ్రహ్మ స్వరూపిణి. సర్వవిద్యలకూ అధి దేవత. ఆమె శక్తి వల్లనే ప్రాణులకు ఉలుకు, పలుకు సిద్ధిస్తున్నాయి. దీపం నుంచి కాంతి ప్రసరించినట్లు అమెలోని చైతన్యం జగత్తంతా వెల్లివిరుస్తుంది

చదువుల తల్లిని నియమ నిష్ఠలతో ఆరాధించడమే అక్షరాభ్యాసం. శ్రీపంచమినాడే కాకుండా శరన్నవరాత్రుల సందర్భంగా మూలా నక్షత్రం నాడు చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తారు. విద్యా సామగ్రిని అమ్మవారి సమక్షంలో ఉంచి ప్రత్యేకంగా అర్చించినా ప్రతినెలా మూలానక్షత్రం నాడు సరస్వతిని పూజించాలని, పాయసం, చెరకు రసం, ఆవుపాలు, అరటి పళ్లు, చక్కెర, పటిక బెల్లం లాంటి సాత్విక పదార్థాలు నివేదించాలని పెద్దలు చెబుతారు.

వేదవ్యాస భగవానుడు ప్రతిష్ఠించిన నేటి తెలంగాణ రాష్ట్రంలోని బాసరలోని జ్ఞానసరస్వతి ఆలయంలో పుష్య బహుళ పంచమి నుంచి మాఘ శుద్ధ అష్టమి వరకు పద్దెనిమిది రోజుల పాటు శ్రీ పంచమి ఉత్సవాలు నిర్వహిస్తారు. శ్రీపంచమి నాడు అమ్మవారికి మహాభిషేకం తరువాత పుష్పాలంకరణ కన్నుల పండువుగా ఉంటుంది.

***'శరదిందు సమాకారే పరబ్రహ్మ స్వరూపిణి***
***వాసరా పీఠ నిలయే సరస్వతీ నమోస్తుతే'*** ★



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి

నమస్కారాల వల్ల జ్ఞానం, సద్గుణం, వర్చస్సు, బలం, ధనం, సంతానం, పాపనాశనం, సకల రోగ నివారణ, ఆయుర్వృద్ధి కలుగుతాయని రుగ్వేద వచనం. అందుకే ఆయన పుట్టినతిథి 'రథ సప్తమి'ని 'ఆరోగ్య సప్తమి' అనీ అంటారు.

**రథసప్తమి విశిష్టత**

అదితి కశ్యపులకు మాఘ శుద్ధ సప్తమినాడు సూర్యభగవానుడు జన్మించాడు. ఈ పర్వదినాన్ని సూర్యజయంతి అని వ్యవహరిస్తారు. ఈ తిథి నాడే రథాన్ని అధిరోహించడం వల్ల 'రథసప్తమి' అని పేరు వచ్చిందని మత్స్యపురాణం పేర్కొంటోంది. దీనినే మహాసప్తమి, భానుసప్తమి, అచలా

# డు ఆదిత్యుడు

సప్తమి అనీ వ్యవహరిస్తారు. ఆయన ఉత్తర దిశ ప్రయాణం ఈ రోజునే మొదలవుతుంది.

రథసప్తమి నాడు సూర్యోదయానికి ముందు నక్షత్ర సమాహారం రథాకారంలో ఉంటుందంటారు. ఏకచక్ర రథాన్ని సప్త అనే అశ్వం లాగుతుంది. సూర్యరశ్ములే (కిరణాలే) అశ్వ రూపాలు. ఆదిత్యుడి నుంచి వెలువడే కిరణాలలో ఏడవది 'సప్త' పేరుతో లోకాన్ని ఉద్దీపింప చేస్తోందని, మిగిలిన ఆరు కిరణాలు ఆరు రుతువులుగా కాలచక్రాన్ని నడుపుతున్నాయని వేదవాక్కు.

***'సప్తలోక ప్రకాశాయ సప్తసప్త రథాయచ***
***సప్త ద్వీప ప్రకాశయ భాస్కరాయ నమోనమః'***

స్నానం, దీపం, అర్ఘ్యం, అర్చనం, తర్పణం రథసప్తమి నాటి ప్రత్యేక ధర్మాలు. ముందురోజు (షష్ఠి) నిరాహారంగా ఉండి మరునాడు శాస్త్రోక్తంగా రథ సప్తమి వ్రతం ఆచరించడం వల్ల ఆరోగ్యం సిద్ధించడంతో పాటు ఏడేడు జన్మల పాపాలు నశిస్తాయని 'ధర్మసింధువు' పేర్కొంటోంది.

రథసప్తమి నాటి స్నానప్రక్రియ, ప్రత్యేకత గురించి 'వ్రత చూడామణి' పేర్కొంది. దాని ప్రకారం, ఆరోజు సూర్యోదయానికి ముందే నెయ్యి లేదా నువ్వుల నూనెతో దీపాన్ని వెలిగించి నదీతీరంలో కాని, చెరువులో కానీ వదిలి, జిల్లేడు ఆకులు, రేగుపండ్లు తలమీద ఉంచుకుని స్నానం చేయాలి. దీనివల్ల ఆరోగ్య ఐశ్వర్యాలు, తేజస్సు పెంపుతో పాటు చర్మ రోగాలు నశిస్తాయని, జన్మాంతర సప్తవిధ పాపాలు (ప్రస్తుత,గత జన్మల పాపాలు, మాట, మనసు, శరీరంతో చేసిన పాపాలు,తెలిసీ తెలియక చేసినవి) నశిస్తాయని, రథసప్తమి నాడు సూర్యోదయ సమయ స్నానంతో సూర్యగ్రహణం నాటి స్నానమంత ఫలితం లభిస్తుందని విశ్వాసం.

సూర్యారాధన అనాదిగా వస్తున్నదే. దేవతలు, మానవులే కాదు.. శ్రీరామ, శ్రీకృష్ణుడు లాంటి అవతారపురుషులు ఆయనను అర్చించారని ఐతిహ్యం. శ్రీరామచంద్రుడు అగస్త్య మహర్షి అనుగ్రహంతో పొందిన ఆదిత్య హృదయస్తోత్ర పఠనంతోనే లంకేశ్వరుడిపై విజయం సాధించాడని, నవమ బ్రహ్మగా వినుతికెక్కిన హనుమ సూర్యోపాసన ద్వారానే సర్వ విద్యలు అభ్యసించినట్లు పురాణ కథనం. శ్రీకృష్ణుడి కుమారుడు సాంబుడు సూర్యారాధనతో కుష్ఠువ్యాధి బాధ నుంచి విముక్తుడయ్యాడట. ధర్మరాజు వనవాస కాలంలో సూర్యారాధనతోనే 'అక్షయపాత్ర'ను పొంది ఆకలిదప్పులను జయించగలిగాడు.

**తిరుమలలో**

తిరుమలలో ఇతర పండుగల మాదిరిగానే రథ సప్తమికి ప్రత్యేకత ఉంది. ఏడాదిలో ఎన్నడూ లేని విధంగా ఆ ఒక్కరోజే శ్రీవారు ఏడు రథాలపై వివిధ అలంకారాలలో ఊరేగి కనువిందు చేస్తారు. సూర్యప్రభ వాహనంతో తిరువీధి ఉత్సవం మొదలై చిన్నశేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వ భూపాల, చంద్రప్రభ వాహనాలతో ముగుస్తుంది. దీనిని అర్ధ బ్రహ్మోత్సవం అంటారు. ★

**మార్కండేయుడు పట్టుదలకు ప్రతీక. కాలజ్ఞాని. మాఘ శుద్ధ తదియ నాడు మృకండు, మనస్విని దంపతులకు జన్మించిన ఆయన సప్త చిరంజీవులలో ఒకరు. తన తపస్సుతో పరమ శివుడిని మెప్పించి మృత్యుంజయుడయ్యాడు. పెద్దలు పిన్నలకు ఇచ్చే 'దీర్ఘాయుష్షు, శతాయుష్షు, మార్కండేయాయుష్య' లాంటి దీవెనలకు మూల పురుషుడు. బ్రహ్మకల్పాలు ముగిసి జలప్రళయం సంభవించినా నిలిచినవాడు. అష్టాదశ పురాణాలలో ఒకటైన 'మార్కండేయ పురాణం' సృష్టి కర్త.**

సకల సద్గుణవంతుడైన పుత్రుడు కావాలన్న మృకండుని తపస్సు ఫలించింది. కానీ పుత్రుడు అల్పాయుష్కుడు. మృకండుడి తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమైన శివుడు 'సద్గుణవంతుడు, సచ్ఛీలుడై పదహారు సంవత్సరాలు మాత్రమే జీవించే కుమారుడు కావాలా? దుష్టగుణాలు, క్రూరమనస్తత్వం కలిగి పూర్ణాయుష్షు గలవాడు కావాలా? అని ప్రశ్నించాడట. కులదీపకుడి కోసం మొదటి అవకాశాన్నే కోరాడు మృకుండ ముని. అలా జన్మించినవాడే మార్కండేయులు. తపోనిష్ఠాగరిష్ఠుడిగా, ధర్మనిరతుడిగా, విజ్ఞానవంతుడిగా ఎదుగుతున్న కుమారుడిని చూచి




ఆనందం ఒకవైపు, తరుగుతున్న ఆయుష్షు మరోవైపు తండ్రిని కలవరపరుస్తున్నాయి. ఆయన విచార వదనం చూచి కారణం తెలుసుకున్న మార్కండేయులు, తపస్సుతో మెప్పించితే 'జన్మ వరదాతే జీవితం ఇవ్వక పోడు' అనే విశ్వాసంతో చెట్ల బెరడును వస్త్రంగా ధరించి శివలింగం ముందు తపస్సును ఆరంభించాడు. మరణ ఘడియలు సమీపించడంతో పాశం విసిరిన మృత్యుదేవత సేవకులు, ఆతని శరీరం నుంచి వెలువడుతున్న కాంతికి భీతిల్లి వెనుకంజ వేశారు. దాంతో సాక్షాత్తు కాలుడే కదలిరాగా మార్కండేయులు శివలింగాన్ని గట్టిగా ఆలింగనం చేసుకున్నాడు. కాపాడవలసిందిగా పరమేశ్వరుడిని వేడుకున్నాడు. బాలభక్తుని మొరవిన్న హరుడు శూలపాణిగా ప్రత్యక్షమై యమధర్మరాజును వారించి, మార్కండేయుడికి 'చిరంజీవిత్వం' ప్రసాదించాడు. అనంతరం మార్కండేయుడు ధ్యానంలో నిమగ్నం కాగా ఆరు మన్వంతరాలు పూర్తయ్యాయి. ఏడవ మన్వంతరంలో అతని తపస్సు భగ్నానికి ఇంద్రుడు విఫలయత్నం చేశాడు. శ్రీహరి రావడంతో ధ్యానం నుంచి మేల్కొని ఆయనను అర్చించాడు. భూగోళం జలమయమై శ్రీహరి శిశువు ('వటపత్రశాయి')గా అవతరించాడు. మార్కండేయుడు తనకు గల వరబలంతో ఆ ఉపద్రవాన్ని అధిగమించి, వటపత్రంపై పడుకున్న బాలుడి ఉదరంలో ప్రవేశించి అందులో సర్వసృష్టిని తిలకించాడు. జలప్రళయం మాయమై, సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయి. వెలుపలికి వచ్చిన ఆతడు వటపత్రశాయిని కౌగలించుకోబోగా ఆతను అదృశ్యమయ్యాడు. ఆశ్చర్యచకితుడై, ధ్యానంలోకి వెళ్లగా పార్వతీరమణుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నప్పుడు, 'నారాయణ చరణాం బుజ ధ్యానం' (నిరంతరం శ్రీహరి చరణ సేవా భాగ్యం) ప్రసాదించాలని వేడుకున్నాడు. జీవితం ఆశించినంత స్థాయిలో సాగదని కలియుగ ధర్మాన్ని ముందే మార్కండేయుడు చెప్పారు. ధర్మరాజు ఒక సందర్భంలో 'మనుషుల కర్మగతిని తెలియచెప్పాల'ని కోరగా 'మానవులు అల్పాయుష్కులు అవుతారు. కామక్రోధాది గుణాలు కలిగి ఉంటారు. మాయాప్రవక్తలు అవతారు. దరిద్రులుగా సంచరిస్తారు. నాస్తికులు, మచ్చరులు, వ్యాధి పీడితులై కాలచక్రంలో కొట్టుకుపోతుంటారు' అని వివరించారు. పితృకర్మలపై గౌరవ ముఖుడనే రాజు సందేహాలను తీరుస్తూ, 'పితృదేవతలు సప్తలోకాలలో ఉంటారు. పితృదేవతలకు శ్రాద్ధాదిక కర్మలు చేయడం సంప్రదాయం. కిందిలోకం వారు పైలోక వాసులను ఆరాధించడమే పితృకర్మ. దానిని నిర్వర్తించడమే జన్మ సార్థకత' అని తెలిపాడు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



**సాహితీ ప్రక్రియల్లో అన్నిటికి మిన్నగా నిలిచేది కథా ప్రక్రియ. అనుభూతి మాత్రమే కాదు, అనుభవాన్ని, చైతన్యాన్ని, స్ఫూర్తిని, ఆత్మస్థైర్యాన్ని అందించగల సత్తా కథా ప్రక్రియ సొంతం. గురజాడ నుంచి నేటితరం రచయితల వరకు ఎందరో తెలుగు కథను శిఖరాయమానంగా తీర్చిదిద్దారు. తెలుగు కథ పురుడు పోసుకున్న విజయనగరంలోనే పుట్టిన శివల పద్మ రాసినవి 'పసిడికి పన్నీరు పులిమిన' చందంగా, అసలైన కథా వస్తువుకు అబ్బుర పరిచే శిల్పం సరిజోడితో ఉండే 'ఆశావాద చైతన్య కథలు.' పద్మ తెలుగు కథాసీమకు అంతగా పరిచయం లేదేమో అనే కన్నా, రాసినవి రాశిలో కొంచమైన వాసిలో ఘనమైనవి. ఆ కథలకు అంతటి విలువను ఆపాదించినది- చక్కని శిల్పం.**

# అటు దేశభక్తి... ఇటు అడవి మీద అనురక్తి..

తన కథా ప్రస్థానంలో సుమారు అర్ధశతి వరకు కథలు రాసిన పద్మ, 'ఫలించిన స్వప్నం', 'ఎన్నాళ్ళీ మౌనం?' అనే రెండు కథా సంపుటాలు వెలువరించారు. ఆమె కథల్లో దేశభక్తి, వనవాసి ప్రేమ సమపాళ్లలో కనిపిస్తాయి. రచనలతో కంటే చర్యల పరంగానే సమాజంలో వేగవంతమైన మార్పు తేగలమని దృఢంగా నమ్మిన పద్మ మూడు దశాబ్దాలుగా వనవాసీ కల్యాణ పరిషత్ సేవా సంస్థలో పని చేస్తున్నారు. వివిధ హోదాల్లో నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ అడవిబిడ్డల జీవితాలు ఆకళింపు చేసుకున్నారు. ఈ నేపథ్యం వల్లే ఆమె కథల్లో తత్త్వచింతన, భారతీయతత్త్వం అభిమాన విషయాలుగా సాక్షాత్కరిస్తాయి.

వస్తువు అతి సాధారణమైనది అయినా, శివల పద్మ కథాశిల్పం సాయంతో అసాధారణ కథగా మలుస్తారు. వీరి కథలను రెండు భాగాలుగా విభజించుకుంటే అందులో మొదటివి దేశభక్తియుతమైనవి, రెండో వర్గానివి వనవాసి ప్రజలవి. 'ఎన్నాళ్ళీ మౌనం?' అని ప్రశ్నిస్తూ చైతన్య పరిచే కథలు కొన్ని అయితే,



"ఫలించిన స్వప్నం" అంటూ లక్ష్యం ఉంటే సాధన సుసాధ్యమే అని నిరూపించి ఆత్మస్థైర్యం పెంచేవి మరికొన్ని. చైతన్యం ఆత్మస్థైర్యం, అనే రెండు దారుల గుండా సాగిన పద్మ కథలు చదువుతుంటే సంభాషణల సాయంగా శిల్పం తోడుగా విషయం కళ్ల ముందు కదలాడి చిత్రం చూస్తున్న అనుభూతి కలుగుతుంది.

చైతన్య పూరిత కథల సరసన చేరేవి 'ఎన్నాళ్ళీ మౌనం?', 'వెంటాడే వాస్తవం', 'గుణపాఠం', 'హామీ', 'పాజిటివ్ థింకింగ్', 'ఆరోజు వస్తుంది', 'చూసే వాళ్లంతా ఎందుకు చూస్తారో?', 'పిడికెడంత గుండెలో', 'శిలాక్షరాలు', 'తప్పటడుగు' ఉంటాయి.

కొత్త సహస్రాబ్ది మొదటి దశకంలో మన ఆధునిక సమాజ పోకడలు బహు చిత్రం. ప్రాచీన విధానాలతో సంతృప్తి చెందలేనితనం, సౌకర్యాలు ఉన్నా వాటి దరిచేరలేని ఆశనిరాశల సమయం. ఒకరకంగా అది ప్రాచీన ఆధునిక కాలాల సంధి యుగం. రచయిత్రి ఆలోచనలు సహజంగా ఆధునికత వైపే దూసుకు పోతున్నప్పటికీ, సమాజ పరిస్థితులు అందుకు సిద్ధంగా కనిపించడం లేదు. మనిషిలో ఎంత ఆధునీకరణ కనిపించినా, ఆలోచనలు మాత్రం అత్యంత హేయంగా, చేష్టలు మృగాలను పోలి ఉంటే ఇక మానవజాతిని దేనితో పోల్చాలి? అన్న ఆలోచనలకు ప్రతిరూపం 'అదేప్రశ్న' కథ. దీనిలో తరతరాలుగా స్త్రీలు అనుభవిస్తున్న అవమానాలు, బాధలు చూపిస్తూ, ఒక ప్రశ్న లేవదీశారు. స్త్రీ విద్యాపరంగా, ఆర్థికంగా ఎంతో ఎత్తుకు ఎదిగిన ఈ కాలంలో కూడా, ఒక తరంలో విద్యకు నోచుకోని స్త్రీ పడ్డ పాట్లే పడటం ఏమిటి? అంతర్గతంగా స్త్రీ చైతన్యాన్ని ఇందులో రచయిత్రి ఆవిష్కరించారు. స్త్రీ పురుష సంబంధాలు, అంతరాల తీరుపై వైవిధ్యంగా చెప్పిన కథ 'తప్పటడుగు'. మనుషుల మనసుల కలయిక, ప్రేమానుబంధాలకు వయోభేదం తగదనే భావాన్ని ఈ కథలో వివరించే ప్రయత్నం చేశారు.

నిత్యం సమాజ కార్యంలో మమేకం కావడం, సేవాభావంతో మెలగడమనే సహజ గుణాలు ఉన్న రచయిత్రి కాలయాపనకు కారణభూతమైన టీవీల మీద స్పందించకుండా ఎలా ఉంటారు? వాటి మీద ఆమె సంధించిన వ్యంగ్యబాణమే 'చూసేవాళ్లంతా ఎందుకు చూస్తారో?' కథ. అంతర్ధానమవుతున్న లేఖల సంస్కృతి గురించి విచారం ప్రకటిస్తూనే, లేఖా రచన ప్రయోజనాల గురించి వివరించిన కథ 'నీ లేఖ కోసం'. మానవ సంబంధాలను పర్యావరణంతో అన్వయించి అందంగా చెప్పిన కథ 'పిడికెడంత గుండెలో'.

పద్మ దృష్టిలో దేశభక్తి అంటే జాతీయ పర్వదినాల్లో త్రివర్ణ పతాకానికి వందనం చేయడం, స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన దేశభక్తులను స్మరించుకొని గౌరవించడం, నేడు దేశ రక్షణలో భాగస్వాములవుతున్న జవాన్లను అభిమానించి ఆదరించడం మాత్రమే కాదు. సాటివారికి సాయపడటంలోనూ దేశభక్తి ఉందని నిరూపించే యత్నం చేశారు రచయిత్రి. సామాజిక అంశాలే ఇతివృత్తంగా తీసుకున్నా, కుటుంబ నేపథ్యాలతో కథలు చెప్పినా వాటిని తనదైన దేశభక్తి భావనతో సింగారించారు శివల పద్మ.

గురువు విలువను చాటి చెప్పిన కథ 'ఫలించిన స్వప్నం.' స్త్రీశక్తినీ తల్లి ప్రేమనూ ఆవిష్కరించే కథలు 'న ధైర్యం న పలాయనం', 'అమ్మ మనసు.' సాంస్కృతి వల పునాదిగా సంఘటిత కార్యానికి స్ఫూర్తిని పంచే కథలు, 'యువత చేజారితే', 'చేయి చేయి కలిపి'. ఆశా, తృప్తి సమపాళ్లలో ఉన్నప్పుడు అవి జీవిత గమనానికి ఎంత చక్కగా ఉపయోగ పడతాయో చెప్పిన కథ 'ఆనందం'. అలాగే ఆనందించే తీరు, ఆనందం విలువ తెలియ చెప్పినది 'లక్ష్యం' కథ. సమాజానికి మానవ సంబంధాల ఎంత అత్యవసరమో విశ్లేషించిన అందమైన కథ 'ఏది తన పాలు?


శివల పద్మ

ఏది గంగపాలు?'. ఇలా ప్రతి కథలో విలువైన అర్థం, పరమార్థం కలసి ఉండటమే కాక చదివిన సంతృప్తిని కూడా అందించే మంచి కథలు ఇవి.

మానవజాతికి మూలవాసులని చెప్పుకునే ఆదివాసుల జీవన నేపథ్యంతో రాసిన కథలు అడవిబిడ్డల మీద రచయిత్రికి గల గౌరవాభిమానాలను వెల్లడిస్తాయి. 'మానవత్వం', 'నిజం', 'సీత కథ', 'యద్భావం తద్భవతి' వంటి కథల్లో అచ్చంగా గిరిజన జీవితాలను వివరించారు. అదే సమయంలో ఆధునికకాలంలో స్వార్థపరుల చెరలో అడవిబిడ్డలు అనుభవిస్తున్న అష్ట కష్టాలను ఆవిష్కరించారు. ఇంకా, వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించే ప్రయత్నం చేశారు, ఆత్మస్థైర్యానికి విలాసమనదగ్గ పద్మ.

సాధారణంగా గిరిజనులు సంస్కృతీ సంప్రదాయాలను జవదాటరు. అలాగే బలీయమైన వారి నమ్మకాలే ఒక్కోసారి మూఢనమ్మకాలుగా రూపాంతరం చెంది ఇబ్బందులు తెస్తాయి. ఆ విషయంలో వారిని చైతన్యపరచాల్సిన గురుతర బాధ్యత మాననీయ విలువల పట్ల విశ్వాసం కలిగిన వారందరిదీ నన్న భావన రచయిత్రి తన కథలతో ఆవిష్కరించారు. ఆడపిల్లలను అమ్మడం అనే అలవాటు లంబాడా గిరిజనుల్లో కనిపిస్తుంది. అదంతా వారి ఆర్థిక



**డా. అమ్మిన శ్రీనివాసరాజు**
**7729883223**

వెనుకబాటుతనం వల్ల కావచ్చు, మరో కారణమూ ఉండి ఉండవచ్చు. ఏదైనా ఆ ధోరణి తప్పు అని ఒప్పించడమే కాదు, తల్లీబిడ్డల పేగుబంధం విలువ, మానవ సంబంధాలతో ముడిపెట్టి చెప్పడం వెనుక రచయిత్రిలోని మాతృమూర్తి ప్రభావం అయి ఉండాలి. 'సీత కథ'లో ఈ మాతృప్రేమను పాఠకులు చవిచూస్తారు. గిరిజనుల మంచితనాన్నీ, మాట తప్పని గుణాన్నీ ఆసరా చేసుకుని స్వార్థ మతశక్తులు కొందరు అడవిబిడ్డలను ఎలా మతం మారుస్తున్నారో చెబుతూనే, అలాంటి సమయాల్లో ఎలాంటి చర్యలు తీసుకోవాలో చైతన్యవాద దృక్పథంతో చెప్పిన కథలు 'మానవత్వం', 'యద్భావం తద్భవతి'.

యద్భావం... కథలో చుక్క అనే గిరిజన యువతి సాధారణ స్థితి నుంచి గొప్ప లక్ష్యంతో, కృషి పట్టుదలతో ఎంతో ఎత్తుకు ఎదిగి తనవారి అభివృద్ధి కోసం కంకణం కట్టుకుంటుంది. ఈ కథాంశం నేటి గిరిజన విద్యావంతులందరికీ ఆదర్శం. 'హిందూ సంస్కృతిలో అంతర్భాగమైన గిరిజన సంస్కృతిని అడవి అంతటా చాటుతాను...' అనే మాటలు చుక్కి నోటితో చెప్పించినా.. అవి అక్షరాల రచయిత్రి మాటలే.

గిరిజన సంస్కృతిని కాపాడటం అంటే వారికి ఆధునిక సంస్కృతి అంటకుండా చేయడం కాదు. వారిని వారిలా జీవించేటట్టు చేస్తూనే సాయపడుతూ వారు నచ్చిన, మెచ్చిన తీరులో బతికేందుకు అవకాశం కల్పించాలి. అదే ఉత్తమ గిరిజన వికాసమనే విషయాన్ని రచయిత్రి తనదైన కొత్త కోణంలో ఆవిష్కరించారు, 'నిజం' కథలో. ప్రతి కథలో ఒక సామాజిక అవసరాన్ని చూపించడమే గాక అంతర్గతంగా ఆత్మవిశ్వాసం రంగరించి అందమైన శిల్పంతో మానవతా విలువలు గుండా రచనను నడిపించిన తీరు అపురూపం, ఆదర్శనీయం.

కథల ప్రత్యేక లక్షణాలని చెప్పే ఊహించని మలుపులు, ముగింపులు, శివల పద్మ కథలు బాగానే కనిపిస్తాయి. పాఠకులకు అనిర్వచనీయమైన అనుభూతినీ, సంతృప్తినీ అందిస్తాయి. మాతృభాష పట్ల మమకారం, అచ్చ తెలుగు పదాలు పొందుపరచడం ఆ కథలకు అదనపు ఆకర్షణలు. చక్కని కథాశిల్పి పద్మ కలం నుంచి మరెన్నో కథాశిల్పాలు వెలుగు చూడాలని ఆశిద్దాం.

**వ్యాసకర్త: తెలుగు ఉపన్యాసకుడు,**
**ప్రభుత్వ జూనియర్ కళాశాల, వాజేడు.**


# భారత్ ఎందుకు పేద

ఇంగ్లిష్ వాళ్లు రాసిన భారత చరిత్రనే మనం చదువుతున్నాం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా అదే చదువుకోవడం దురదృష్టకరం. ఈస్టిండియా కంపెనీ తరఫున వచ్చిన సివిల్, మిలటరీ అధికారులు కొంత సమాచారం సేకరించి వాళ్ల దృష్టికోణం నుంచి చరిత్ర రాశారు. ఈ దేశాన్ని శాశ్వతంగా పరిపాలించాలంటే ఇక్కడి ప్రజల మనసులను ఎలా చెడగొట్టవచ్చునో అలా రాశారు. జాన్ స్ట్రాచీ మొదలు కన్నింగ్‌హ్యామ్ వరకు పెద్ద జాబితాయే ఉంది. చరిత్రను వక్రీకరించడానికి వాళ్లు చేసిన ప్రయత్నంలో కీలకమైనదే ఆర్యులు బయటి నుంచి వచ్చారని చెప్పడం, నమ్మింపచేయడం. ఆర్యులు ఇక్కడివారేననీ, ఆ వాదన అసంబద్ధమైనదనీ



శాస్త్రీయంగా వివరించే ప్రయత్నం నేను చేశాను. సామ్రాజ్యవాదుల దృష్టికోణంతో రాసిన చరిత్రలోని అనేక అంశాలను వడబోయడానికి ప్రయత్నం చేశాను. అది మొదటి విషయం. రెండవది విదేశీ దండయాత్రలు. గ్రీకులు, శకులు, కుషాణులు, హూణులు వచ్చారు. తర్వాత అరబ్స్ వచ్చారు. ఈ దండయాత్రలని ఏ దృష్టితో చూడాలి? వాళ్లని ఆనాడు ఏ విధంగా మనవారు ఎదిరించగలిగారు? దేశంలో స్థానం లేకుండా చేయగలిగారు అన్న అంశాన్ని సరైన కోణంలో చూపించడానికి ప్రయత్నించాను. ఇస్లామిక్ దండయాత్రలలో, యూరోపియన్ దండయాత్రల సమయంలో ప్రతి యుద్ధంలో ఓడిపోయిన జాతిగా చరిత్రలో మనని నిలబెట్టేందుకు ప్రయత్నించారు. ఓడిన మాట వాస్తవం, రాజ్యాన్ని పోగొట్టుకున్న మాట వాస్తవమే. కానీ, అనేక సందర్భాల్లో ఇక్కడి పాలకులు వీరోచితంగా ప్రతిఘటించారు. గెలిచిన సందర్భాలు కొన్ని ఉన్నాయి.

అక్బర్‌ను ప్రతిఘటించిన రాణాప్రతాప్ యుద్ధ నీతిని మార్చాడు. ఇది లోతుగా విశ్లేషించవలసిన అంశం. గజబలంతో కూడిన ఆనాటి యుద్ధనీతితో మనం ఓడిపోయాం. దాన్ని రాణాప్రతాప్ విశ్లేషించి పక్కకు పెట్టాడు. గుర్రం (చేతక్) మీద నుంచి యుద్ధం చేశాడు. రెండవ విషయం–ఒక ప్రత్యేక వర్గం నుంచి కాక, సాధారణ ప్రజలను సైన్యంలోకి తీసుకున్నాడు. మూడవది – కోశాగారాన్ని ఎప్పుడూ రాజధానిలో అట్టేపెట్టలేదు. దీనిని చాలామంది చరిత్రకారులు గమనించలేదు. అంతకుముందు ఎవరు రాజధానిని ఆక్రమించినా, సంపదంతా వాళ్ల చేతుల్లోకి పోయేది. రాణాప్రతాప్ యుద్ధానికి బయలుదేరేముందు కోశాగారాన్ని అడవుల్లో దాచాడు. అందువల్ల యుద్ధంలో వెనుకడుగు వేయాల్సి వచ్చినా వెంటనే సైన్యాన్ని పునర్నిర్మించుకోవడానికి వనరులు సమకూరాయి. అందుకనే చివరిదాకా పోరాడాడు, ఓడిపోలేదు. రాణాప్రతాప్ రాజ్యం చివరిదశలోనూ స్వతంత్రంగానే ఉంది. శివాజీ ఇంచుమించు ఇదే రకమైన యుద్ధనీతిని అనుసరించాడు. శివాజీ యుద్ధనీతిని వియత్నాం ఉద్యమకారుడు హొచిమన్ కొనియాడాడు. అనుసరించారు కూడా. 20వ శతాబ్దిలో గెరిల్లా పోరాటానికి అదే మూలం.





వీటితో పాటు నేను ప్రత్యేక దృష్టితో రాసిన అంశాలూ ఉన్నాయి. వాటిని ఇతర చరిత్ర గ్రంథాల్లో చూడం. అసలు భారతదేశానికి ఎందుకీ దారిద్ర్యం? అధ్యయనం చేయవలసిన చారిత్రక అంశాలలో ఇది ప్రధానమైనది. చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానంలో గ్రీకు రాయబారి మెగస్తనీస్ 'ఇండికా' అనే గ్రంథం రాశాడు. అందులో భారతదేశంలో కరవులు రావు, పేదరికం ఉండదు అని రాశాడు. అనేక నదులు, సారవంతమైన నేల, మంచి పంటలు పండుతాయి. ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారం తింటారు అని రాశాడు. అలాంటి దేశానికి పేదరికం ఎలా వచ్చింది? ఇస్లామిక్ దండయాత్రలు జరిగినప్పుడు, ఖిల్జీలు, తుగ్లక్‌లు దేవాలయాల్లో ఉన్న అపార సంపత్తిని దోచుకున్నారు. తర్వాత కోటల నుంచి వజ్రవైఢూర్యాలు, బంగారం తీసుకెళ్లిపోయారు. పంట కోసుకుపోయేవారు. ఇవన్నీ ఖాళీ చేసి సామాన్య ప్రజల మీద పడ్డారు, పన్ను వసూళ్ల పేరుతో. ఢిల్లీ సుల్తానుల పన్నులు, వసూళ్లు ఎలా ఉండేవో రాశాను. ఒక సంవత్సరం పంటను ఎత్తుకుపోతే భరిస్తారు కానీ, ఏళ్ల తరబడి దోచుకపోతుంటే ఏ రైతు మళ్లీ పండించగలడు? అందుకే గంగా, సింధు మైదానాలలో సారవంతమైన భూములను బీళ్లుగా వదిలేశారు. అలా కరవులు మొదలైనాయి. తొలితరం మొగల్ చక్రవర్తులు హుమాయున్, అక్బర్, జహంగీర్, షాజహాన్, ఔరంగజేబ్‌ల కాలంలో 24 దుర్భిక్షాలు వచ్చాయి. వేల సంవత్సరాల భారత చరిత్రలో అత్యంత భీకరమైన కరవు కనిపించేది అక్బర్ కాలంలోనే. కోట్లాదిమంది నశించిపోయారు.

సంపదను పోగొట్టుకోవడంతోను, సంపదను ఉత్పత్తి చేసే సాధనాలు వినియోగించులేక పోవడంతోనూ దేశం బీదదవుతూ వచ్చింది. సుల్తానులు, పాదుషాలు ఇక్కడి సంపద తరలించడం మానేసిన తర్వాత కూడా వీళ్లు ఢిల్లీ, ఆగ్రా, లాహోర్‌లలో దాచిన సంపద, సామాన్య ప్రజలను లూటీ చేసి పోగేసిన సంపద మంగోలులు లేదా ఇరానియన్స్ కొల్లగొట్టేవారు. కాకతీయుల కోహినూరు వజ్రాన్ని ఢిల్లీలో పెట్టుకుంటే నాదిర్షా ఎత్తుకెళ్లాడు. ఇది ఒక చిన్న ఉదాహరణ. మన సంపదంతా తరలిపోయింది. దేశం బీదది కావడానికి

ఇది ప్రధాన కారణం. ఆ తర్వాత బ్రిటిషువారు, పోర్చుగీసు వారు ఏ విధంగా దేశాన్ని లూటీ చేశారో వివరంగా చెప్పాను. ఇక్కడే ఇంకొక అంశం కూడా హైలైట్‌ చేశాను. అది ప్రపంచ గతిని మార్చింది. ప్లాసీయుద్ధం (1757)లో క్లైవ్‌ గెలిచాక ఓడిన సిరాజిద్దౌలా కోశాగారాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ముర్షీదాబాద్‌ నగరంలో ఉన్న ఆ కోశాగారంలోని సంపద వెలకట్టలేనిది. దాన్ని ఓడలలో నింపుకొని ఇంగ్లండ్‌ తీసుకెళ్లారు. అక్కడ అప్పుడే పారిశ్రామిక విప్లవం ఆరంభమైంది. యంత్రాలు కనుగొన్నారు, వాటిని ఉపయోగించుకోవటానికి కావలసిన పెట్టుబడి– కాపిటల్‌– లేదు. క్లైవ్‌ దోచుకుపోయిన బెంగాల్‌ సంపద, పారిశ్రామిక విప్లవానికి కాపిటల్‌ అయింది. అప్పటి నుంచి బ్రిటన్‌ అజేయ శక్తిగా ఎదిగింది. ప్రపంచ గతిని మార్చిన, రవి అస్తమించని సామ్రాజ్యాన్ని నిర్మించడానికి ముఖ్య కారణం సిరాజిద్దౌలా కోశాగారం.

# దేశమైంది?


వీటన్నితోపాటుగా సంస్కృతిని కూడా సమాంతరంగా అంచనా వేస్తూ వచ్చాను. ఇక్కడ మొదటి నుంచి అనేక రాజ్యాలు ఉన్నాయి. రాజులు ఒకరితో ఒకరు పేచీపడేవారు, మళ్లీ కలిసేవారు. కానీ దేశమంతటా అంతర్లీనంగా ఒక ఐక్యత ఉంది. ఆ ఐక్యతను కాపాడేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. అదే ఫండమెంటల్‌ యూనిటీ అనీ ఒక చాప్టర్‌లో చెప్పాను. ఉదాహరణకు జ్యోతిర్లింగాలు, వైష్ణవ క్షేత్రాలు దేశమంతా ఉన్నాయి. అష్టాదశ పీఠాలు విస్తరించి ఉన్నాయి. ఈ తీర్థ యాత్రలు చేయడం ద్వారా ఇది నా దేశం అనే భావం నిర్మాణం కావడానికి ఒక మెకానిజం ఆచారాల రూపంలో అమలైంది.




అదొక అద్భుత ప్రయత్నం. ఆదిశంకరాచార్యులు నాలుగు పీఠాలను నెలకొల్పడం దాన్లో భాగమే.

ఇది కాక ఇప్పుడు ఉపనిషత్తుల్లో సామాజిక స్పృహ ఏ విధంగా ఉందనే విషయాన్ని సంక్షిప్తంగా చూపే ప్రయత్నం చేశాను. సామాజిక స్పృహ లేకపోతే సమాజం ఇంతకాలం నిలబడడం సాధ్యం కాదు. ఎవరైతే సమాజాన్ని అనేక రకాలుగా సుసంపన్నంగా ఉంచే ప్రయత్నం చేశారో– బుద్ధుడు, మహావీరుడు, తరువాత ఆదిశంకరాచార్యుల వారు గానీ వీళ్లందరి సేవ విలువ ఏమిటి అన్న విషయం స్పృశించే ప్రయత్నం చేశాను.

తమిళనాడులో నాయనార్‌లు, ఆళ్వార్లు ఒక కులానికి సంబంధించినవారు కాదు. వారి




**సంక్షిప్త భారతదేశ చరిత్ర – సంస్కృతి (వేదకాలం నుంచి 1947 వరకు)కు ఆంగ్లానువాదం**

విగ్రహాలను అనేక దేవాలయాలలో పెట్టి పూజిస్తారు. కులవ్యవస్థ ఉన్నప్పటికీ దానికి అతీతంగా సమాజాన్ని ఒకటిగా ఉంచడం కోసం జరిగిన ప్రయత్నంలో భాగంగా మనం దీనిని చూడవచ్చు. రామానుజులు కులవ్యవస్థకు వ్యతిరేకంగా సమాజాన్ని నిలిపి ఉంచే ప్రయత్నం చేశారు. తర్వాత బసవేశ్వరుడు, మధ్వాచార్య రాజులు, రాజరికాలు, రాజ్యవ్యవస్థకు అతీతంగా సమాజాన్ని ఒకటిగా ఉంచడానికి ప్రయత్నం చేశారనే విషయం ఈ రచనలో చూపించే ప్రయత్నం చేశాను. ఇంకొక అంశం కూడా. ఇస్లామిక్‌ దండయాత్రల సమయంలో హిందూ రాజులు సామాన్య ప్రజలకు రక్షణ ఇవ్వలేకపోయిన తర్వాత, నిస్సహాయ స్థితిలో పడిపోయిన సామాన్య ప్రజలకు రామానంద, కబీర్‌, గోస్వామి తులసీదాస్‌, చైతన్య మహాప్రభు, అస్సాంలో శంకర్‌దేవ్‌, గురు నానక్‌దేవ్‌, భక్తతుకారం, సమర్థ రామదాసు, వీళ్లందరు భక్తి సందేశ రూపంలో, కీర్తనల రూపంలో అనేక రకాలుగా ప్రజలలో ఆత్మవిశ్వాసం నింపారు.

భారతీయ సంస్కృతికి సంబంధించినటువంటి ఇంకొక పార్శ్వం ఈ రచనలో ఉంది. భారతీయ సంగీతం, భారతీయ నృత్యం. ఇవి ఏ రకంగా జాతిని ఒకటిగా ఉంచడానికి ప్రయత్నం చేస్తూ వచ్చినది చెప్పాను. సంగీతం, నృత్యం ఆ రెండూ భక్తి ప్రధానంగా విస్తరించాయి. మణిపూరి, ఒడిస్సి వంటి అనేక సంప్రదాయ నృత్యాలు ఆవిర్భవించాయి. ఈ సందర్భంగా చిన్న అంశం చెబుతాను – 1025 జనవరిలో గజనీ సోమనాథ్‌ దేవాలయాన్ని ధ్వంసం చేస్తున్నప్పుడు సరిగ్గా అదే సమయంలో రాజరాజ చోళుడు బృహదీశ్వరాలయం నిర్మించాడనే విషయం చరిత్రలో చెబుతారు, గజనీ సోమనాథ్‌ దేవాలయాన్ని ధ్వంసం చేశాడన్న విషయం చెప్పరు. అలా చెప్పడం వల్ల ప్రజలకు అందే సందేశం వేరే. అదే సమయంలో అంకోర్‌వాట్‌లో బ్రహ్మాండమైన విష్ణుమందిరాన్ని హిందువులు నిర్మించారు.

వీటితోబాటు భారతీయ సైన్సు ఏ విధంగా విస్తరించింది, ఖగోళశాస్త్రం, ఇటువంటివన్ని కూడా ఏ విధంగా విస్తరించాయో దీంట్లో స్పృశించడం జరిగింది.

స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించి ఒక ముఖ్యమైన అంశాన్ని నేను హైలైట్‌ చేశాను. అది పొలిటికల్‌ ఇస్లాం. ఔరంగ జేబ్‌ చనిపోయిన తర్వాత ముస్లిం మేధావుల్లో వచ్చిన మార్పు. ఔరంగజేబ్‌ 1707లో పోయినాడు. ఆ తర్వాత ముస్లిం నవాబులు, పాలకులు, ఇస్లాంను ఇక ఎవరూ రక్షించలేరన్న అభిప్రాయానికి వచ్చారు.

కాబట్టి దీన్ని ఏ రకంగా ముందుకు తీసుకెళ్లాలని ముస్లిం మేధావుల్లో ఒకరకమైన ఆలోచనలు మొదలైనాయి. ఇది పొలిటికల్‌ ఇస్లాంగా పరివర్తనం చెందింది. దానిని ఫలితాలేమిటో మనందరికీ తెలుసు.

(సంక్షిప్త భారతదేశ చరిత్ర – సంస్కృతి (వేదకాలం నుంచి 1947 వరకు)ను వెలువరించడం వెనుక ఉద్దేశాన్ని, ప్రత్యేకతను వివరిస్తూ ఆచార్య శేషగిరిరావు చెప్పిన మాటలివి.) ★

కథ

**'మానస భజరే గురు చరణం, దుస్తర భవ సాగర తరణం'** ముందు దూరంగా లీలగా తరువాత దగ్గరగా వినిపించిన బృందగానంతో కళ్లు తెరిచింది వసుధ. నగర సంకీర్తన బృందం యిల్లు దాటి వెడుతోంది. "అమ్మో! అప్పుడే తెల్లారిపోయింది. ఇవాళేగా అబ్బాయి, కోడలు, మనుమలు వచ్చేది! ఈయనన్నా లేపచ్చుగా" అనుకుంటూ పడకగది నుంచి బయటికి వచ్చింది. శ్రీపతి అప్పటికే కాలకృత్యాలు అయి, యోగాభ్యాసంలో వున్నాడు. వసుధ మనసులో ఎన్నో ఆలోచనలు.. చాలా కాలం తర్వాత వస్తున్నాడు కొడుకు శశిధర్ అమెరికా నుంచి. అక్కడి పరిస్థితులు గందర గోళంగా వుండటం, పని ఒత్తిడి, శలవు పెట్టే అవకాశం లేక పోవటంతో నాలుగేళ్లుగా రానేలేదు. వస్తున్నాననటం, తీరా సమయానికి 'సారీ ప్రాజెక్టు పని అవలేదు, తర్వాత వీలు చూసుకొని వస్తాన' నటం. ఈసారి మాత్రం అంతా సవ్యంగా అయి వస్తున్నాడు.

క్రితం సారి చంటివాడితో వచ్చి, వున్న పదిహేను రోజుల్లో అది చూడాలి, ఇది చూడాలి అని, వాళ్లని కలవాలి, వీళ్లని కలవాలి అని ఇంటిపట్టునే లేదు. అప్పటి చంటిగాడు, అదే శ్రీనాథ్ యిప్పుడు ఎలా వున్నాడో? రెండవ పిల్లని చూడనే లేదు. వీడియో కాల్ చేసినప్పుడు చూడటమేగానీ.

వస్తున్నాడని తెలిసినప్పటి నుంచి హడావిడే! ఇంటిని శుభ్రం చేయించి, అన్నీ సక్రమంగా సర్దటం ఒకవైపు, అప్పడాలు, వడియాలు, తినుబండారాలు తయారు చేయటం మరొక వైపు. వాడికి ఇష్టమయిన వన్నీ చేసిపెట్టాలి మళ్లీ ఎప్పుడు వస్తాడో! అనే తపన. అసలే మొహమాటస్తుడు.

కోడలు రేవతి కూడా ఉద్యోగస్తురాలే. ఏం చేస్తుందో, ఏమి పెడుతుందో! పెళ్లయి ఏడేళ్లయినా పట్టుమని పది రోజులు కూడా లేదు తనదగ్గిర. పెళ్లవగానే అమెరికా వెళ్లడం, పురిటికి కూడా యిక్కడకి రాకుండా వాళ్ల అమ్మనే పిలిపించుకుంది. ఇద్దరు పిల్లల విషయం లోనూ అంతే అయింది. అదేమిటంటే పిల్లలకి అక్కడి సిటిజన్ షిప్ రావాలంటే అక్కడే పుట్టాలట. కాలవైపరీత్యం కాకపోతే ఏమిటీ! ఇక్కడ పుట్టిన వాళ్లు చెడిపోలేదుకదా!

అమెరికా వెళ్లాడనేమాటే గానీ శశిధర్‌లో మార్పేమీ లేదు. తామంటే ప్రేమా పల్లెత్తు తగ్గలేదు. పైగా పిల్లల పేర్లు కూడా తమ పేర్లు కలసివచ్చే టట్టుగా బాబుకి శ్రీనాథ్ అని, పాపాయికి వసుమతి అని పెట్టాడు. పిల్లలకి చిన్న చిన్న శ్లోకాలు, తెలుగు పద్యాలు చెప్పి,వల్లె వేయిస్తాడు. ప్రతివారం వీడియో కాల్ చేసి పిల్లల చేత మాట్లాడిస్తాడు. శ్రీనాథ్ కొంత యింగ్లీష్‌లో కొంత తెలుగులో కబుర్లు చెపుతాడు. చిన్నదీ వాడికి పోటీగా ముద్దుముద్దుగా మాటలు చెపుతూ వుంటుంది.



# న మాతుః పరదైవతమ్

## కపిల సాయిమోహన్‌దాస్

‘కొడుకు వచ్చే హడావిడిలో నన్ను మర్చిపోయావ్, కాఫీ యివ్వలేదు’ శ్రీపతి గారు గట్టిగా అనటంతో ఆలోచన సుడి లోంచి బైట పడింది. పనికి అలవాటు పడిన ప్రాణం అవటంతో అన్నీ గబగబా చేసేసింది. అంతలోనే కొడుకు, కోడలు, మనుమలు దిగారు. వీడియోలో చూడటం, మాట్లాడటం అలవాటవటంతో బామ్మ, తాత దగ్గర చాలా తక్కువ సమయంలోనే మచ్చిక అయ్యారు పిల్లలిద్దరూ. వాళ్లకి వచ్చిన శ్లోకాలు, పద్యాలు చెపుతూవుంటే తాత,బామ్మ తెగ మురిసిపోయారు. బామ్మ అయితే వెంటనే చారెడు ఉప్పుతో వాళ్ళకి దిష్టి తీసింది. మొదటిసారిగా దిష్టి గురించి వింటున్న పిల్లలకి తమాషాగా, రేవతికి చాదస్తంగా అనిపించేది.

పిల్లలకైతే అలవాటయింది కానీ రేవతికి కొంత బెరుకుగానే వుంది. తను అత్తగారితో కలసి వున్నది చాలా తక్కువ సమయం. అందువలన పెద్దగా చనువు ఏర్పడలేదు. పైగా శశిధర్ తరచుగా వాళ్లమ్మ గురించి చాలా గొప్పగా చెపుతూ వుండటంతో ఏమి చెయ్యాలన్నా బిడియంగానే వుంటుంది. తన పద్ధతి వేరు. అన్నీ కూడా ఒక క్రమంలో ఉండాలనుకుంటుంది. శశిధర్ ఆలోచన వేరు. అతనికి పనవటం ముఖ్యం కానీ ఒక పద్ధతిలోనే వుండాలని లేదు. దానితో పిల్లలకి కూడా వాళ్ల నాన్న చెపితే ఏదయినా యిష్టంగా చేస్తారు. పైగా ‘నీకు పిల్లల మనస్తత్వం తెలీదు. మా అమ్మ దగ్గర నేర్చుకో’ అంటాడు, ఆవిడేదో సైకాలజిస్ట్ లాగా.

అమెరికా నుంచి ప్రత్యేకంగా వీళ్లకోసం తెచ్చినవి యిస్తూవుంటే వసుధ, శ్రీపతి గారూ ఆనందంతో వుబ్బిపోయారు.

‘మీ కోడలి కానుక’ అంటూ గిన్నెలు కడిగే మిషను (డిష్ వాషర్) ని చూపిస్తే ‘నాలుగు గిన్నెలు కడగటానికి ఒక మిషను కావాలా! దానికి తెలియక పోతే నీ బుర్ర ఏమయింది’ అని వసుధ అనటంతో ‘చాదస్తపు మనిషి’ అనుకుంది మనసులో.

‘నేచెపుతూనే వున్నా, నిన్ను ఆశ్చర్యంలో, ఆనందంలో వుంచాలని తీసుకుంది. వాడి చూడు, దాని వుపయోగం నీకు తెలుస్తుంది” అంటూ వేరే విషయాలలోకి వెళ్లిపోయారు.

వీళ్లు వస్తారని చేసిన పిండివంటల రకాలు, పిల్లల కోసం, తనకోసం తయారుచేసిన బట్టలు చూసి రేవతి ఆశ్చర్యపోయింది. అంత సమయం, ఓపికా ఎలా వస్తాయని.

బామ్మచేసిన పిండివంటలు శ్రీనాథ్‌తోపాటు పిల్లలు కూడా ఆత్రంగా తింటుంటే రేవతి మనసు విలవిలలాడింది వాళ్ల కడుపులు ఎక్కడ పాడవుతాయోనని. ‘మరేం ఫరవాలేదు, తిననీ, హోమియో మందు వేస్తే సర్దుకు పోతుందిలే’ అనే అత్తగారి మాటలకి ఎదురు చెప్పలేకపోయింది. తాత ,బామ్మ ముద్దు చేయటంతో పిల్లల్లో పెంకితనం పెరిగింది. తనమాట అసలు వినటం మానేసారు. చాటుగా భర్తతో పిల్లల గురించి చెప్పినా ‘అమ్మ చూసుకుంటుందిలే, టెన్షను పడకు’ అంటాడు గానీ పట్టించుకోడు. నీటి మార్పో, తిండి మార్పో గానీ రేవతి భయపడ్డట్టే పిల్లలకి కొంత నలత చేయటం అత్తగారు ఆవిడ మందులపెట్టె తీసి ఏవో గోలీలు వేయటం, మర్నాటికి ఆరోగ్యాలు కుదుట పడటం జరిగింది. ‘అత్తగారు పెద్దగా చదువుకోలేదు కానీ చాలా సమర్థురాలు’ అనుకుంది రేవతి మనసులో.


రోజులు నిమిషాల్లాగా గడుస్తున్నాయి. ఆరోజు రేవతి తల్లి పుట్టినరోజు. శుభాకాంక్షలు చెప్పి, శ్రీనాథ్ చేత చెప్పిద్దామని పిలవటం, వాడు వినకుండా బయటకి పరుగెత్తడం జరిగింది. రేవతి చాలా బాధ పడింది. ఆడిఆడి యింటికి వచ్చాక కూడా రేవతి పిలుస్తున్నా వాడు బామ్మ దగ్గరకి పరుగుతీస్తుంటే రేవతికి కోపం, ఉక్రోషం అవధులు దాటి కొడుకుకి బుద్ధి చెప్పాలని, అత్తగారికి కూడా తన బాధ తెలియాలి అనుకుంటూ వాడి వెనుక వెడుతోంది. వంటగది నుంచి వసుధ గొంతు వినిపించి ఆగింది. ‘మీ నాన్నని తిట్టాలిరా’ వసుధ మాటలకి ‘ ఎందుకు బామ్మా’ అంటూ శ్రీనాథ్ అడిగితే ‘నీకు ఏవో శ్లోకాలు చెప్పాడుగానీ ముఖ్యమైనది చెప్పలా’ అని వసుధ అనటం ‘ఏమిటదీ ప్లీజ్ నువ్వు చెప్పవా’ అన్న మనవడితో “న గాయత్ర్యాః పరం మంత్రం న మాతుః పర దైవతా” అంటే గాయత్రి మించిన మంత్రం లేదు, అమ్మని మించిన దేవత లేదు అని. ‘గాయత్రీ మంత్రం చేయటానికి నీకు యింకా వయసు రాలేదు కానీ అమ్మని మించిన దైవం లేదు అనే దానికి మనిషి పుట్టుకతోనే మొదలవుతుంది’ బామ్మ మాటలకి ‘అందుకే డాడీ నీ గురించి చెపుతారు’ అని మనవడు అనగానే ‘ మరి నువ్వు మీ అమ్మ మాట వింటున్నావా’ అంటూ సూటిగా అడిగింది వసుధ. ‘ఇందాక మీ అమ్మ పిలుస్తున్నా వెళ్లిపోయావు. అమ్మమ్మకి హేపీ బర్త్‌డే చెప్పలేదు.’ బామ్మ మాటలు మనవడిని కొంచం కదిలించాయి. ‘సారీ బామ్మా’ అంటున్న మనవడితో ‘నాకు కాదు, అమ్మకి చెప్పు’ అంటూ వాడిని వెనక్కి పంపించింది. వాళ్ల సంభాషణ చాటుగా విన్న రేవతి గబగబా తనగదికి వెళ్లి పోయింది. ‘వెరీ సారీ మమ్మీ.. యిక ఎప్పుడూ నువ్వు చెప్పినట్టే వింటా’ అంటూ అమాయకంగా ఆవేదనగా వున్న కొడుకుని చూసి కరిగిపోయింది రేవతి హృదయం. వాడిని గట్టిగా కౌగిలించుకుని ‘సరే’ అని మాత్రం అనగలిగింది.

ఆ క్షణంలో తన భర్తకి వాళ్ల అమ్మ అంటే ఎందుకంత గురో కూడా అర్థమయింది. ఆవిడది చాదస్తం కాదు, వయసుతో వచ్చిన అనుభవం అనుకుంది. ఆరోజు రాత్రి పిల్లలు పడుకున్నాక ‘థాంక్స్ అత్తయ్యగారూ! శ్రీనాథ్‌ని దారిలో పెట్టారు’ అంటూ వచ్చిన కోడలుతో ‘ఓస్ దీనికేనా థాంక్స్? అయినా వాడు యింకా చిన్నవాడే. వయసుతో పాటు అన్నీ నేర్చుకుంటాడు. నీకూ కొంచం ఓర్పు వుండద్దా? పిల్లలతో మనం పంతం పడతామా?’ అంటూ సూటిగా అడిగింది. అత్తగారి మాటలకి కోపం రాలేదు పైగా ‘మీరూ మాతోపాటు కొన్నాళ్ళు వుంటే పిల్లలే కాదు, నేను కూడా చాలా నేర్చుకోవచ్చు. ప్లాన్ చేయండి ప్లీజ్ ’ అంటున్న కోడలితో ‘బాగుంది నీకేం తక్కువ? ఎటొచ్చీ ప్రథమ కోపం. రోజూ కొద్దిసేపు ధ్యానం చేస్తూ వుంటే అదీ పోతుంది. వయసుతో పాటు మన అనుభవాలు పెరుగుతాయి. వాటితో పాటు మనమూ మారతాము. మేము రావటం అంటావా! మాకు యిక్కడ వున్న స్వేచ్ఛ, పిలిస్తే పలికేవాళ్లు, తెలిసిన డాక్టర్ సదుపాయం అక్కడ దొరకవు. అందుకని మీరే వీలు కల్పించుకొని వస్తూ వుండాలి’ అంటూ జవాబిచ్చింది వసుధ. ‘తప్పకుండా వస్తాం. ఒకవేళ ఆయనకి వీలు కుదరక పోయినా పిల్లలని తీసుకుని నేను వస్తాను’ అంది రేవతి. ‘అత్తాకోడళ్లు ఒకటయి నన్ను వేరు చేస్తున్నారా? ఇంకొక రెండు సంవత్సరాలు అయితే నా కాంట్రాక్ట్ అయిపోతుంది. అందరం యిక్కడే వుంటాం’ అంటూ మాట కలిపాడు శశిధర్. ★

# అరవిందులు... రాజ్యాంగం

భారత రాజ్యాంగాన్ని ఎంతటి సమున్నత స్థానంలో ఉంచాలో నేటితరం ఇంకొంచెం తెలుసుకోవలసిన అవసరం ఉందనిపిస్తుంది. రాజ్యాంగ రచన బాధ్యతను నిర్వర్తించినవారికి సరే, దాని ఫలితాలను అనుభవిస్తున్నవారికీ దాని ఔన్నత్యం తెలిసి ఉండాలి. అది నేటితరానికి హక్కులను, బాధ్యతలను గుర్తు చేసేది మాత్రమే కాదు. పురాతన భారత మేధస్సుతో వర్తమానతరం సంభాషించేదని నాటి రాజ్యాంగకర్తలు భావించారు. దాని ఫలితమే అసలు రాతప్రతికి నందలాల్ బోస్ చేసిన అలంకరణ. ప్రతి ప్రకరణానికి బోస్ వేసిన బొమ్మలు హరప్పా, సింధు సంస్కృతి, రామాయణ భారతాలు ఇచ్చిన సందేశాన్ని ఆ అలంకరణ ద్వారా అందించారు. ధర్మం అనే అపురూపమైన తాత్త్వికత అర్థమయ్యేటట్టు చేయడానికి ఆ అలంకరణలో గొప్ప కృషి జరిగింది. దీని కొనసాగింపు, 'శ్రీఅరబిందో అండ్ ది కానిస్టిట్యూషన్ ఆఫ్ ఇండియా' కాఫీ టేబుల్ పుస్తకం.

అరవిందుల ఆధ్యాత్మిక, రాజకీయ, సామాజిక దృష్టి అనితర సాధ్యమైనది. రాజ్యాంగంలోని ప్రతి ప్రకరణంలోని సారాంశానికి అనుగుణంగా అరవిందుని రచనలలో కొన్ని వ్యక్తీకరణలు ఉన్నాయి. వాటినే కొన్ని అధ్యాయాలకు ముందు పొదిగి అందించిన పుస్తకమిది. మొదటి రెండు ఉటంకింపులలో రెండోదీ, పక్కన ఉన్న రాజ్యాంగం ముఖచిత్రానికి ఒక తాత్త్విక బంధమే కనిపిస్తుంది. 'ఎన్ని బలహీనతలైనా ఉండవచ్చు గాక, జాతీయత అనే సమున్నత భావనకు గీటురాయి దేశ భవిష్యత్తు పట్ల అచంచలమైన విశ్వాసం ఉండడమే' అంటుందా ఆ ఉటంకింపు. రాజ్యాంగ నిర్మాతల ఆశయం ఇదే కదా! తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్లాలి. స్వేచ్ఛ, సమత్వం, సౌభ్రాత్రం అనే మాటలతో ఉంటుంది రాజ్యాంగ పీఠిక. ఆ మూడు సమున్నత భావనల విలువ, ఆ మూడు పదాల చరిత్రను వివరిస్తూ అరవిందుల సంపూర్ణ రచనల నుంచి తీసుకున్న ఒక పేరాను ఇచ్చారు. మొదటి భాగం (ది యూనియన్ అండ్ టెరిటరీ)కి నందలాల్ వేసిన బొమ్మ– మొహెంజదారో తవ్వకాలలో దొరికిన అద్భుతమైన ఎద్దు బొమ్మ ముద్రిక. నిజానికి వ్యవస్థను పాలించేది నైతిక, సామాజిక, న్యాయ, సంప్రదాయికంగా వస్తున్న న్యాయం కలగలసిన ధర్మమేనని, రాజు కంటే ఇవే గొప్పవని చెబుతూ అరవిందులు చెప్పిన మాటను ఈ ప్రకరణానికి ఇవ్వడం అద్భుతమే. మూడో అధ్యాయం 'ప్రాథమిక హక్కులు' ముందు రామాయణంలోని పాత్రల ఆత్మలను ఆవిష్కరించే ఒక పేరాను ఇచ్చారు. ఆదేశికసూత్రాలకు భారతంపై రాసిన వ్యాఖ్యాన భాగాన్ని ఇచ్చారు.




**ప్రతులకు : సొసైటీ హౌస్ నెం. 11, మార్టిన్ స్ట్రీట్, పుదుచ్చేరి–605 001**

ఒక పక్క రాజ్యాంగం మూల ప్రతిలోని పుటనూ, పక్క పేజీలో ఆ శీర్షికకు సంబంధించి నందలాల్ వేసిన చిత్రంతో పాటు, అరవిందుల వ్యాఖ్యనూ ప్రచురించడం అపురూపంగా అనిపిస్తుంది. ఈ పుస్తకం చదవడం వల్ల అరవిందుల సమున్నత తాత్త్విక రాజకీయ చింతనతో కాస్త పరిచయమే కాదు, రాజ్యాంగకర్తలు పురాతన భారతంలోని స్మృతికర్తలను ఎంత బాగా అధ్యయనం చేశారో, అవసరమైన మేరకు ఎలా తీసుకున్నారో కూడా అర్థమవుతుంది. ఇలాంటి పుస్తకం ప్రచురించాలన్న ఆలోచనతోనే శ్రీఅరబిందో సొసైటీ ఔన్నత్యం బోధపడుతుంది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల సందర్భం, అరవిందుల 150వ జయంతి ఏకకాలంలో రావడం, ఆ గొప్ప సందర్భాన్ని ఇలాంటి పుస్తకంతో అలంకరించడం ఎంతో సముచితంగా ఉంది. ఆఖరిగా భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్న వార్త విన్న తరువాత తనకున్న ఐదు కలల గురించి అరవిందులవారు తెలియచేశారు. వాటిని కూడా ఇందులో ఇచ్చారు. తన ఆధ్యాత్మిక మార్గదర్శకత్వంలో భారత్ ఓ కొత్త ప్రపంచాన్ని నిర్మించాలని కోరుకున్నారు. భారత్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించినా అదింకా ఐక్యతను సాధించవలసి ఉందని ఆయన చెప్పడంలో గొప్ప ఆంతర్యమే ఉంది. హిందూ–ముస్లిం సమస్య, అణగారిన వర్గాల స్వేచ్ఛవంటి విషయాల గురించి ఆయన ఎంత ఆలోచించారో ఇందులో తెలుస్తుంది. ఈ పుస్తకం చదవడం నేటితరం బాధ్యతలలో ఒకటి.

ఎన్ని అధికారణాలు ఉన్నాయో, ఎన్ని షెడ్యూళ్లు ఉంటాయో, ఎన్ని సవరణలు జరిగాయో తెలియడమొక్కటే రాజ్యాంగం మీద నిజమైన అవగాహనకు చాలదు. అలాగే అది దేశానికి అత్యున్నత చట్టమన్న సామాజిక దృష్టి మాత్రమే రాజ్యాంగ వైశాల్యమెంతో అంచనా వేయడానికి సరిపోయేదీ కాదు. సాంస్కృతిక ఐక్యత భారతదేశాన్ని చిరకాలం కలిపి ఉంచిన సంగతి చరిత్ర చెబుతుంది. తరువాత ఈ దేశం మీద భక్తి, ఈ దేశానికి స్వాతంత్ర్యం తేవాలన్న ఏకసూత్రం, అందుకు జరిగిన పోరాటం, సంఘర్షణ మరికొంత కాలం జాతిని కలిపి ఉంచిన తాత్త్వికతలు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ దేశ మూలాల ప్రాతిపదికగా సాంస్కృతిక ఏకాత్మతతో; రాజకీయ, భౌగోళిక ఐక్యతను నిర్మించినదే భారత రాజ్యాంగం. ఈ అన్ని అంశాలు భావి భారత పౌరులకు తెలియడం అవసరమే కాదు అనివార్యం. నిజానికి చాలామంది నేటి వయోజనులలో కూడా రాజ్యాంగం గురించిన కనీస అవగాహన లోపిస్తున్నదన్న ఆరోపణ ఉంది. కానీ సమాజంలో నీ స్థానాన్ని నిర్దేశిస్తున్నదీ, నీ హక్కులేమిటో ప్రకటిస్తున్నదీ, వాటి రక్షణకు భరోసా ఇస్తున్నదీ ఆ అత్యున్నత చట్టమే. కాబట్టే రాజ్యాంగ రచన చరిత్ర, అందులోని తాత్త్విక, రాజకీయ చింతనల

**గణతంత్ర దినోత్సవ ప్రత్యేకం**

పట్ల కనీస అవగాహన ఈ దేశ పౌరులమైన మనకు అవసరమే.


'మన రాజ్యాంగం ఆమోదం పొందిన నాటి నుంచి డెబ్బైరెండేళ్ల తర్వాత కూడా అది రక్షించ వలసిన అధికారం ఇవ్వవలసిన భారత ప్రజలే దాని గురించి అవగాహన లేకుండా మిగిలి పోయారు. రాజ్యాంగసభ సభ్యులు అది సామాజికంగా పరివర్తన చెందే పత్రమనీ, దేశ మూలస్తంభమనీ కార్యనిర్వాహక, శాసనపరమైన అతిక్రమణలను వివక్షనూ మెజారిటీ పోకడలను వ్యతిరేకించే బలమైన అడ్డుగోడలా నిలుస్తుందనీ ఆశించారు' అన్నారు శ్రీదేవి మురళీధర్. అది నిజం. స్వాతంత్ర్యం తరువాత కొన్ని సందర్భాలలో మినహా రాజ్యాంగం తన బాధ్యతను నిర్వర్తించింది. ఈ అంశాలన్నీ వర్తమానతరాలకి అందించడానికి ఆమె అందించిన పుస్తకమే 'సచిత్ర భారత సంవిధానం: తెలుగు బాల బాలికలు, యువత కోసం'.

చట్టాల రూపకల్పన ప్రక్రియ బ్రిటిష్

ఇండియాలోనే ఆరంభమైంది. అంతకు ముందు భారతదేశ చరిత్రలో చట్టాలు, న్యాయవ్యవస్థ లేవని కాదు. ఎన్నో స్మృతులు పుట్టాయి. అర్థశాస్త్రం కేవలం రాజ్య నిర్వహణను నిర్వచించేదే. కానీ చట్ట నిర్మాణం, అందులో మార్పులు రెండూ కాలానుగుణంగా ఉంటాయి. ఆ క్రమంలోనిదే ఆధునిక చట్ట నిర్మాణ ప్రక్రియ. 1909 భారత ప్రభుత్వ చట్టం వంటివి ఆ కోవలోనివే. 1919, 1935 చట్టాలు రాజ్యాంగ రచనకు దారి చూపాయనీ చెప్పవచ్చు. తరువాత డిసెంబర్ 6, 1946న స్వతంత్ర భారత రాజ్యాంగ రచనకు శ్రీకారం చుట్టారు. అంటే భారత స్వాతంత్ర్యోద్యమానికి పరాకాష్ట రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు. పురాతనమూ, సమున్నతమూ అయిన సంస్కృతి, సాంస్కృతిక వైవిధ్యం, ఏడెనిమిది వందల ఏళ్ల విదేశీ పాలన భారతీయతకు, జాతికి చేసిన గాయాలు వంటి ఎన్నో అంశాలను గమనించు కుంటూ రాజ్యాంగం నిర్మించే బాధ్యత పరిషత్ మీద పడింది. రాజ్యాంగ ఆవిర్భావ క్షణాలకు ఉన్న మరొక

రాజ్యాంగం. అలాగే విధులను గుర్తు చేసేదే కూడా. ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అనే అంశంలో ఒక చరిత్రాత్మక పరిణామాన్ని రచయిత్రి ఉటంకించారు. 1975లో ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితి విధించారు. అది ఆమెకు రాజ్యాంగం ఇచ్చిన హక్కే, కానీ ఆ పేరుతో ఆమె రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధంగా వ్యవహరించారు. అందుకే 1977లో రాజ్యాంగబద్ధంగా జరిగిన ఎన్నికలలో ఓటు హక్కు ఆయుధంతో ప్రజలు ఇందిరను ఓడించారు. ఇది దేశ చరిత్రలోనే పెద్ద ఘట్టం. ఒకరి హక్కు ఇంకొకరి హక్కులు హరించే ఆయుధం కారాదు. ఇదే మన రాజ్యాంగం చెబుతోంది.

రెండవ ప్రకరణాన్ని రాజ్యాంగ పీఠికను విశ్లేషించడానికి కేటాయించారు. దీనికి ఎంతో ప్రాధాన్యం ఉంది. 'భారత ప్రజలమైన మేము...' అనే పదాలతో ప్రారంభమైన ఈ పీఠిక ప్రతి భారతీయుడి సంక్షేమం కోసం ఉద్దేశించి నటువంటిది'. వందల ఏళ్ల బానిసత్వంలో మగ్గి,



**సచిత్ర భారత సంవిధానం**
**తెలుగు బాలబాలికలు, యువత కోసం**
**రచన :** శ్రీదేవీ మురళీధర్
ఇమెయిల్: ProjectNishedh@gmail.comg

# ఐక్యతామంత్రం.. గణతంత్ర సూత్రం

సంక్లిష్ట నేపథ్యం, 'కొత్త రాజ్యాంగం ఆవిష్కరించే నాటికి భారతదేశం నైతికత, మనస్సాక్షి, ప్రేరణ యొక్క స్వరాన్ని కోల్పోయిన విషాద సమయం. మహాత్మా గాంధీ జనవరి 30, 1948 నాడు హత్యకు గురైనారు'. ఇన్ని పరిణామాలనూ, గుణపాఠాలనూ గమనిస్తూ ఆధునిక కాలంలో ఉన్నామన్న స్పృహతో ప్రజాస్వామ్యాన్ని ప్రతిష్టించగలిగే రాజ్యాంగ రచన బాధ్యతను నిర్వర్తించారు వారు. రాజ్యాంగ పరిషత్ గొప్పదనం ప్రాచీన భారతదేశం కూడా న్యాయ శాస్త్రంలో తనదైన ప్రమాణాలు కలిగి ఉన్నదని నమ్మకం కలిగి ఉండడం. 'రాజ్యాంగ సభ సభ్యులందరూ దేశానికి చెందిన అతి ముఖ్యమైన రాజ్యాంగ పత్రాన్ని రూపొందించేటప్పుడు ఈ సామాజిక ఆర్థిక సమస్యలను దృష్టిలో పెట్టుకున్నారు.' డిసెంబర్ 9, 1946న పరిషత్ తొలి సమావేశం జరిగింది. ఈ విషయమంతటినీ పన్నెండు ప్రకరణలలో రచయిత్రి శ్రీదేవీ మురళీధర్ పొందు పరిచారు. ఇందులో కొన్ని పూర్తిగా రాజ్యాంగంలోని అంశాల గురించి విశ్లేషిస్తాయి. కొన్ని స్వాతంత్ర్యో ద్యమ ఘట్టాలను గుర్తు చేస్తూ రాజ్యాంగ పరిషత్ సభ్యులు అంతరంగాన్ని ఆవిష్కరించే పనిచేస్తాయి.

మొదటి ప్రకరణం పేరు 'రాజ్యాంగం అంటే ఏమిటి?' దేశాన్ని ప్రజాస్వామ్య బద్ధంగా, సమానత్వంతో, సహనంతో, సభ్య సమాజంగా స్థిరపరచాలంటే ఆ పని రాజ్యాంగం ఒక్కటే చేయగలదు. పౌరులందరి హక్కులు రక్షించేది

విముక్తమైన భారతజాతి గొంతు ఈ పీఠికలోనే ధ్వనిస్తుందని రచయిత్రి అంటారు. ఇందులో తరువాతి కాలాలలో చేర్చిన 'లౌకికవాదం' (సెక్యులరిజం) పదం వివాదాస్పదమైనదని ఆమె సరిగానే వ్యాఖ్యానించారని చెప్పవచ్చు. రాజ్యాంగ సభ ఏర్పాటు తీరుతెన్నులు, ముస్లింలీగ్ రాజకీయాలు, కాంగ్రెస్ పోరాటం, పరిషత్‌లో ఉప సంఘాలు, వాటి కృషి మూడో ప్రకరణలో చదువుతాం. నిజానికి అదొక గొప్ప చర్చా వేదిక. చరిత్రాత్మకమైన మేధోమథనం. ముసాయిదా సంఘం అధ్యక్షులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక నేపథ్యం, అనుభవం రాజ్యాంగ రచనలో ఏ విధంగా ప్రతి బింబించినదీ రేఖామాత్రంగా రచయిత్రి పరిచయం చేశారు. ఆయన ముద్ర రాజ్యాంగానికి మరింత సామాజిక దృష్టిని ఇచ్చిందంటే సత్యదూరం కాదు. ఇంకా నాటి తాత్కాలిక ప్రభుత్వ సారథి నెహ్రూ, డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్, సర్దార్ పటేల్, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, ఎస్ఎన్ ముఖర్జీ, బెనెగల్ నరసింగరావు, జైపాల్ సింగ్ మూండా వంటి వారి సేవలతో పాటు; సరోజినీ నాయుడు, సుచేతా కృపలానీ, ఏనీ మాస్కరీన్, అమ్రిత్ కౌర్, లీలా రాయ్, విజయలక్ష్మి పండిట్, అమ్ము స్వామినాథన్, దాక్షాయణి వేలాయుధన్, బేగం ఐజాక్ రసూల్, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, హంసా జీవరాజ్ మెహతా వంటి పరిషత్‌కు సేవలు అందించిన పదిహేను మంది మహిళల గురించి కూడా ఈ ప్రకరణలో

పరిచయం చేశారు. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు అంటే ఏమిటో, వారి పరిధి ఏమిటో తెలియచెబుతుంది ఐదో ప్రకరణం. తరువాతి ప్రకరణాలలో ప్రభుత్వ నిర్మాణం, శాసన నిర్మాణం, న్యాయవ్యవస్థ వాటి పరిధుల గురించి, గణతంత్ర భారతం, ఓటు హక్కు, మొదటి ఎన్నికలు, రాజ్యాంగం స్వీకరించిన గణతంత్ర చిహ్నాలు, మొదటి గణతంత్ర దినోత్సవం వంటి అంశాలు ఇచ్చారు. రాజ్యాంగ ప్రతిని మన పురాతన వ్యవస్థలలోని ముఖ్యుల చిత్రాలతో, ఘట్టాలతో అలంకరించారు. ఇందులో నందలాల్ బోస్ కృషి ఎంతటిదో చదివి తెలుసు కోవాలి. పదకొండవ ప్రకరణాన్ని రాజ్యాంగాన్ని పిల్లల కోసం సంక్షిప్తంగా పరిచయం చేయడానికి కేటాయించడం ఎంతో సబబుగా అనిపిస్తుంది.

భారత స్వాతంత్ర్యోద్యమాన్ని అధ్యయనం చేయించడం దగ్గరే వర్తమాన తరం విఫలమయ్యే పరిస్థితిలో ఉంది. ఆజాదీ కా అమృతోత్సవ్ వంటి సందర్భాలలోనే చరిత్ర చదవాలన్న నియమం లేదు. అది మన గతం. మనను భవిష్యత్తులోకి నడిపించే చోదకశక్తి. దీనికి పరాకాష్ట వంటిది రాజ్యాంగ రచన. 1857 నుంచి 1947 వరకు స్వాతంత్ర్యం పోరాటం చదవడం ఒక అనుభవం. డిసెంబర్ 9, 1946 నుంచి జనవరి 26, 1950 వరకు జరిగిన రాజ్యాంగ రచనా ప్రక్రియను అధ్యయనం చేయడం అద్భుత అనుభవం. దీనిని పిల్లల కోసం విడమరచి రాయడం స్వాగతించదగినదే. ★

నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలు

**తెలంగాణ విముక్తి పోరులో నిరంకుశ నిజాం పాలకుల గర్వాన్ని అణచివేసే ప్రయత్నంలో గడ్డిపోచ కూడా కత్తిలా మారి యుద్ధ పటిమను చూపించిందనే చెప్పాలి. హైదరాబాద్‌లో అరాచక నిజాం పాలన కుప్పకూలడంలో ప్రజా ఉద్యమం కీలకంగా నిలిచింది. సుమారు రెండున్నర శతాబ్దాల పాటు పాలించిన అసఫ్‌జాహి రాచరిక పాలనకు వ్యతిరేకంగా సామాన్య ప్రజలతో పాటు, విద్యార్థులు, మేధావులు, రాజకీయ నాయకులు, మరెందరో అజ్ఞాతవీరులు కృషి చేశారు. ఈ అందరి పోరాట ఫలితమే హైదరాబాద్ విమోచన.**



## హైదరాబాద్ ప్రజల్లో చైతన్యం నింపిన


# బస్వా మానయ్య!

చదువులు పూర్తి చేసి ప్రబుద్ధులు కావలసిన విద్యార్థులు.. దురహంకార పొగలు కప్పుకొని, సెగలు కక్కుతున్న నిజాం నేలలో తెలుగు లేని చదువులేమిటి? చదివి సాధించేదేమిటి? అని ఆవేశంతో ఈ రాజ్యం దాస్యశృంఖలాల నుండి విముక్తి చెందిన తర్వాతే.. 'తల్లీ నిన్ను దలంచి పుస్తకంబు చేతన్ బూనుతామ'ని చదువుల తల్లికి దండం పెట్టి పాఠశాలలనూ, కళాశాలలనూ వదిలి స్వాతంత్ర్య సమర రంగంలోకి దూకిన బస్వా మానయ్య కూడా ఒకరు.

తెలంగాణ విముక్తి ఉద్యమంలో హిందూ సమాజంలో జాగృతిని కలిగించి, ఐక్యతను నిర్మించి, సమరోన్ముఖులుగా తీర్చిదిద్దింది ఆర్యసమాజ్ అనే చెప్పాలి. ఆర్యసమాజ్ స్ఫూర్తితో నాడు ఎందరో నిజాంపై ఉద్యమించారు. రాజ్యకాంక్షతో మూసుకు పోయిన నిజాం కళ్లు తెరిపించడానికి ఆర్యసమాజ్ 1938, డిసెంబర్ 25 నుండి 29 వరకు అఖిల భారత ఆర్యమహా సమ్మేళనాన్ని మాధవరావు అషే అధ్యక్షతన షోలాపూర్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో దీర్ఘకాలిక ఉద్యమానికి రూపకల్పన చేశారు. నిశ్శస్త్ర ప్రతీకార మండల్ పేరుతో హిందూ మహాసభ, ఆర్యసమాజ్ సంయుక్తంగా సత్యాగ్రహాలు ప్రారంభించాయి. ఈ ఉద్యమానికి సర్వాధికారిగా మహాత్మా నారాయణస్వామిని నియమించారు. ఈ ఉద్యమ ప్రభావం తెలంగాణలోని సుమారుగా అన్ని గ్రామాలకూ పాకింది. ఆ గ్రామాల్లో బస్వా మానయ్య స్వగ్రామం జోగిపేట (గతంలో దీనిపేరు ఆందోళ్– జోగిపేట) కూడా ఒకటి.

బస్వా మానయ్య 1923లో జోగిపేట (ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో ఉంది)లో ఆర్య వైశ్య కుటుంబంలో జన్మించారు. ఏడవ తరగతి చదువుతున్న సమయంలోనే స్వాతంత్రోద్యమం వైపు దృష్టి సారించారు. ఆర్యసమాజ్‌కి చెందిన పండిట్ నరేంద్రజీ, రామచంద్ర దేహల్వి ఉపన్యాసాలన్నా, ఆర్యసమాజ్ సిద్ధాంతాలన్నా బాగా ఇష్టపడే వాడు. స్థానికంగా మెట్రిక్యులేషన్ పూర్తి చేసి హైదరాబాద్‌లో న్యాయశాస్త్రం చదివారు. ఆర్యసమాజ్‌లో చేరి నిజాం పాలకుల ప్రభుత్వ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. నిజాంకి బాసటగా నిలిచిన రజాకార్ల ఆగడాలను అడ్డుకోవడానికి గ్రామాల్లో తిరిగి ప్రజల్లో చైతన్యం నింపారు. అనేకమంది ఆర్యవీరులకు స్వయంగా వ్యాయామ శిక్షణనిచ్చారు. అందోళ్, అలాదుర్గం, సదాశివపేట, సంగారెడ్డి ప్రాంతాలలో ఆర్యసమాజ్ శాఖలను ప్రారంభించి ప్రజల్లో స్వాతంత్ర్య జ్వాలను రగిలించారు. ఆయన చివరి వరకు ఆర్యసమాజ్ సిద్ధాంతాలే ఊపిరిగా బతికారు. లాల్‌బహదూర్ శాస్త్రి, సర్దార్ పటేల్, నెహ్రూలతో స్వయంగా మాట్లాడగలిగే పరిచయాలు మానయ్యకు ఉండేవి.

మానయ్య నిజాంకు వ్యతిరేకంగా జోగిపేటలో ప్రజల్ని సంఘటిత పరుస్తున్నారనే విషయం రజాకార్లకు తెలిసింది. ఓ రోజు రాత్రి మానయ్య ఇంటిపై రజాకార్లు మారణాయుధాలతో దాడిచేశారు. ఈ దాడిలో అతని భార్య లక్ష్మీనరసమ్మ, అతని పెద్ద కుమారుడు, అతని అన్న మరణించారు. మానయ్యను అరెస్టు చేసి రెండు సంవత్సరాలు గుల్బర్గా జైల్లో నిర్బంధించారు. ఆర్యసమాజ్ నాయకుల ఆచూకీ చెప్పమని బాగా కొట్టేవారు. ఆ దెబ్బలకు పక్కటెముకలు విరిగాయి. అయినా ఆచూకీ చెప్పలేదు. ఈ దెబ్బలు చూసి జైలులో పనిచేసే ఒక వార్డర్ జైలు గేటు తాళాలు ఇస్తాను, పారిపొమ్మ న్నాడు. 'అలా చేస్తే నీ ఉద్యోగం పోతుంది. నిన్ను చిత్రహింసలు పెడతారు.' అని వద్దని చెప్పారు. 'మీ లాంటి వ్యక్తి బయటకు వెళితే వెయ్యి మంది వీరులను తయారు చేస్తారు.



**కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు

నిజాం ఆటకట్టిస్తారు. నా ఉద్యోగం పోయినా పరవాలేదు' అని మానయ్యను అతను వదిలిపెట్టాడు. జైలు నుండి తప్పించుకున్న మానయ్య జైలు దుస్తులు మార్చి గోచీ పెట్టుకుని కాలి నడకన వికారాబాద్ చేరుకుని తన మిత్రుడు 'మద్ద మల్లప్ప'ను కలుసుకున్నారు. మల్లప్ప అతనికి కొత్త బట్టలు, 13 రూపాయలు ఇచ్చాడు. తర్వాత కొన్నాళ్లు అనంతగిరి అడవుల్లో దాక్కున్నారు. ఓసారి నిజాం పోలీసులు తారసపడగా పొలాల్లో ఉన్న రైతులు మానయ్యను తప్పించారు.



ఈ ప్రాంతంలో రాయకోడ్ అనే గ్రామం ఉండేది. చుట్టుపక్కల అదే పెద్ద వ్యాపార కేంద్రం. ఒకసారి రజాకార్లు ఆ గ్రామాన్ని దోచుకుని తగులబెట్టారు. విషయం తెలుసుకున్న మానయ్య కొందరు రైతులతో కలిసి మంటలు ఆర్పేందుకు వెళ్లారు. అంతేకాదు, రాయకోడ్ చుట్టుపక్కల గ్రామాల ప్రజల్లో చైతన్యం నింపి విముక్తి ఉ ద్యమంలో వారిని కూడా భాగస్వాముల్ని చేశారు. రాయకోడ్‌లో మానయ్య తీసుకువచ్చిన చైతన్యానికి అక్కడి ప్రజలు ఆయన మీద పాటలు గట్టి...

***'బుడ గుడ్డ పంచాలు భుజాన వేసుకుని***
***సభ చెప్ప బయలెల్లినాడే మానయ్య***
***పట్టపగలే పట్నమంతా కాలిపోయే***
***రాయకోడ్ రక్షింప వచ్చాడయ్యా మానయ్య***
***మమ్ము రక్షింప వచ్చాడయ్యా మానయ్యా'***

అంటూ పాడుకునేవారట.

***'ఏ దేశమువారైనా / ఏ కులము వారైనా***
***నిత్య నూతన వికాసంతో కళకళలాడేదెపుడు***
***చివరి నిరంకుశాధికారిని / ఉరితీసినపుడు***
***ఆనందమయ జీవితానికి నాంది-ప్రస్థావన'***

– వెల్దుర్తి మాణిక్యరావు

హైదరాబాద్ రాష్ట్రమే ఒక జైలుగా మారిన 1940-1948 ప్రాంతం నాటి విశేషాలను ప్రత్యక్షంగా చూసి గ్రంథీకరించినవారు వెల్దుర్తి మాణిక్యరావు. ఇంటిల్లిపాది చెమటోడ్చి పండించిన పంటను రజాకార్లు కత్తులు ఝళిపిస్తూ ఎత్తుకు పోతుంటే ఇన్నాళ్లు చేసిన కష్టం ఏటి పాలైందని విలవిల ఏడ్చిన కర్షకుల ఆర్తనాదాలను స్వయంగా చూశారాయన. మాణిక్యాలరావు.. బస్వా మానయ్యతో కలిసి విముక్తి ఉద్యమంలో పనిచేసినట్లు తన పుస్తకంలో రాసుకున్నారు.

రజాకార్ల ఆగడాలు పెచ్చు పెరిగిపోయాయి. ప్రజల ప్రాణాలు పోతున్నాయి. ఇక తప్పదు. పోలీస్ యాక్షన్ తీసుకోవాల్సిందేనని సర్దార్ వల్లభాయి పటేల్‌తో మాట్లాడి, ఒప్పించి తిరిగి వస్తుండగా మానయ్యను రజాకార్లు మళ్లీ బంధించారు. ఈసారి చంచల్‌గూడ, గుల్బర్గా, సంగారెడ్డి, ఔరంగాబాద్ జైళ్లలో నిర్బంధించారు. పోలీస్ చర్య (1948) తరువాత విడుదలై కాంగ్రెస్, నెహ్రూ విధానాలను వ్యతిరేకించారు. సుమారు 8 ఏళ్లు జోగిపేట సర్పంచ్‌గా, అనేక సంవత్సరాలు మున్సిపల్ ఛైర్మన్‌గా సేవలందించారు. 1957 అసెంబ్లీ ఎన్నికల్లో ఆందోళ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రుక్నుద్దీన్‌పై బస్వా మానయ్య స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి, ఘనవిజయం సాధించారు. స్వయంగా నెహ్రూ రుక్నుద్దీన్ తరుపున ప్రచారానికి వచ్చి 'మానయ్యకి ఓటు వేస్తే ఆందోళ్ నియోజకవర్గం ఓ పిచ్చి ఆసుపత్రిగా మారిపోతుంది. కాబట్టి కాంగ్రెస్ పార్టీకి ఓటువేయాల'ని అభ్యర్థించినా ఫలితం లేకుండా పోయింది. అంతటి ప్రజాదరణ కలిగిన వ్యక్తి బస్వా మానయ్య. తరువాత ఆయన నెహ్రూను సవాలు చేస్తూ తన నియోజకవర్గంలో పిచ్చి ఆసుపత్రి ఎప్పుడు కడతారని చమత్కరించారు. బస్వా మానయ్య అసెంబ్లీలో తన ప్రసంగాలతో పాలక పక్షంపై నిప్పులు కురిపించేవారు. ఆయన ఉపన్యాసాలపై ఒక సందర్భంలో ఆంధ్రభూమి పత్రికలో బుర్రా శాస్త్రి సంపాదకీయం కూడా రాశారు. మానయ్య ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి అరెస్ట్ కూడా అయ్యారు. ఒకసారి స్థానిక స్వాతంత్ర్య ఉద్యమ కారులకు మెజిస్ట్రేట్ సంతకం అవసరమైంది. ఆ మెజిస్ట్రేట్ నూరు రూపాయలు ఇస్తేనే సంతకం చేస్తానని చెప్పారు. అప్పుడు మానయ్య.. ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రితో మాట్లాడి సదరు మెజిస్ట్రేట్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై జోగిపేటలో ధర్నా కూడా నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. అంతేకాదు, స్థానిక పార్కులో గాంధీ విగ్రహం ఏర్పాటుచేయాలని ఉద్యమించి సఫలీకృతు దయ్యారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన ఓ కార్యక్రమంలో మానయ్యను తామ్రపత్ర పురస్కారంతో సత్కరించారు. జనవరి 8, 1977న మానయ్య స్వర్గస్తులయ్యారు. ఆయన పోరాటం నేటితరం యువకులకు ఎంతో స్ఫూర్తిదాయకం. ★






ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, నారాయణ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ఒక చర్చ్ అది. పేరు సేక్రెడ్ హార్ట్ చర్చ్. ఈ సంవత్సరం జనవరి 2వ తేదీన రెండువందల మంది దాని మీద దాడి చేశారు. ఒక వ్యక్తి బలమైన కర్రతో ప్రాంగణంలోని కన్యమేరీ విగ్రహాన్ని బద్దలుకొట్టాడు. రెండేళ్లుగా బస్తర్ డివిజన్‌లో సంప్రదాయక గిరిజనులు, క్రైస్తవంలోకి మారిన గిరిజనులు మధ్య సాగుతున్న ఘర్షణకు ఇది దాదాపు పరాకాష్ట. లేదా, ఆ అడవులలో రెండువర్గాలుగా చీలిపోయిన గిరిజనుల వైఖరిలో రాబోతున్న పెనుమార్పునకు అంకురార్పణ కూడా అనుకోవచ్చు. కారణాలు ఎన్నయినా ఉండవచ్చు. అవి ఎలాంటివయినా కావచ్చు. అటవీ ప్రాంతంలోని గిరిజనులు ఒక్కసారిగా క్రైస్తవ ప్రార్థనా మందిరం మీద కర్రలు, వెదురుబొంగులు, ఇనప కడ్డీలతో దాడికి దిగడం ముమ్మాటికి పెనుమార్పు. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ కొండలలో వినిపిస్తున్న వాదనలు ఇవే. విదేశీమతం క్రైస్తవం తీసుకున్నవాళ్లు గిరిజనులు కారు. కాబట్టి వారు అడవిని వీడి బయటకెళ్లి బతకాలి. లేదా క్రైస్తవం వదిలిపెట్టి తిరిగి అక్కడి మట్టి మీద, గాలి మీద, నీటి మీద భక్తితో, కాళీమాత సాక్షిగా సంప్రదాయక గిరిజనులుగా బతకాలి. మరొక ముఖ్య అంశం- క్రైస్తవంలోకి మారినందున రాజ్యాంగం ద్వారా దఖలు పడిన ఎస్‌టీ హోదాను అనుభవించడానికి వారికి అర్హత ఉండకూడదు.

# సిలువ మీద

‘క్రైస్తవమతం తీసుకుంటే వాళ్లు గ్రామాలు వదిలిపోవాలి. ఎందుకంటారా? గిరిజనుడుగా ఉండడం ఒక పరంపరకు చెందినది. ఆ పరంపరలో ఉన్నప్పుడే గిరిజనులవుతారు. గిరిజనులు కానివారు ఇక్కడ ఉండడానికి అర్హులు కారు’ అన్నారు నారాయణ్‌పూర్ జిల్లాలోని గౌర్రా గ్రామ సర్పంచ్ సునీత్ మాండ్వి. 2022, డిసెంబర్ మూడోవారం నుంచి నారాయణ్‌పూర్ ప్రాంతంలో ‘సంప్రదాయ గిరిజనులు’, ‘క్రైస్తవంలోకి మారిన గిరిజనులు’ మధ్య రగులుతున్న చిచ్చు గౌర్రా గ్రామం నుంచే ఆరంభమైంది. తాము గిరిజన సంస్కృతిలోనే ఉన్నామనీ, కానీ క్రీస్తును నమ్ముతున్నామని, తమకు అటవీ ప్రాంతంలో ఉండే హక్కు ఉందని క్రైస్తవంలోకి మారిన గిరిజనులు చెబుతున్నారు. ఈ వాదనే ఇప్పుడు అక్కడ అగ్గి రాజేస్తున్నది. గడచిన మూడు మాసాలుగా జిల్లాలోని 15 గ్రామాల నుంచి దాదాపు 400 మందిని సంప్రదాయ గిరిజనులు తరిమివేశారు. ఈ క్రమంలోనే జనవరి 2వ తేదీన నారాయణ్‌పూర్‌లోని సేక్రెడ్ హార్ట్ చర్చ్ మీద దాడి జరిగిందనిపిస్తుంది. అంతకంటే ముందు జరిగిన మతాంతరీకరణలకు నిరసన తెలియచేయడానికి గౌర్రా గ్రామంలో ఒక సమావేశం జరిగింది. నిజానికి ఆ ముందురోజు, కొన్ని గంటల ముందు జరిగిన క్రైస్తవ మిషనరీల కార్యకలాపాలు కూడా స్థానికులను బాధించాయి. గౌర్రాలోనే రెండు వర్గాలు ఘర్షణలకు దిగాయి. క్రైస్తవం తీసుకున్న గిరిజనులు ఊరు విడిచి వెళ్లిపోయారు. మతం తీసుకున్నారన్న ఆగ్రహంతో కొండగావ్, నారాయణ్‌పూర్ జిల్లాల్లో ‘రైట్‌వింగ్’ కార్యకర్తలు కొందరిని తరిమివేశారు. క్రైస్తవాన్ని వీడి ఘర్‌వాపసీ చేయాలని వీరు చెప్పడంతోనే వారంతా ఊళ్లు విడిచివెళ్లిపోయారని వార్తలు వచ్చాయి.



అప్పటి నుంచి ఆ రెండు జిల్లాలలోని గ్రామాలలో చెదురుమదురుగా ఇందుకు సంబంధించిన దుర్ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. అన్నీ బలవంతపు మత మార్పిడికి నిరసనలే. ఇలాంటి వాతావరణాన్ని హిందూ సంఘాలకు, బీజేపీకి వ్యతిరేకంగా మలచడానికి ఎప్పుడూ ప్రయత్నాలు జరుగుతూనే ఉంటాయి. ఇప్పుడు కూడా ఆ రెండు జిల్లాలలోని 30 గ్రామాలలో ‘నిజ నిర్ధారణ సంఘాలు’ పర్యటించాయి. ఇర్ఫాన్ ఇంజనీర్, నికోలస్ బర్లా అనే నిజ నిర్ధారకులు వెంటనే తమ నివేదిక ఇచ్చేశారు. ఇక్కడ క్రైస్తవం తీసుకున్న గిరిజనులను తిరిగి హిందూత్వంలోకి మార్చడానికి పెద్ద ఎత్తున ప్రయత్నం జరిగిందంటూ ఆ ఇద్దరు తేల్చేశారు. కానీ అసలు ఈ వివాదంలో బలవంతపు మత మార్పిడుల సమస్యే లేదని ప్రభుత్వ యంత్రాంగం చెప్పడం మరొక వింత. వీళ్ల ఉద్దేశం ఏమిటంటే, ఇది క్రైస్తవులుగా మారిన గిరిజనులకు, సంప్రదాయక గిరిజనులకు మధ్య తాజా ఘర్షణ మాత్రమే.

నిజమైన వివాదం గురించి ఒక వర్గం మీడియా అయినా నిజం చెప్పడానికి ప్రయత్నిస్తున్నది. అది- గడచిన కొంతకాలంగా మధ్య భారతంలోని గిరిజనులను క్రైస్తవంలోకి మార్చడాన్ని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వ్యతిరేకిస్తున్నది. ఈ మత మార్పిడి ప్రక్రియ ఇప్పటిది కూడా కాదు. స్వాతంత్ర్యం రావడానికి ముందు నుంచి ఇది యథేచ్ఛగా సాగిపోతోంది. తరువాత సంఘ్‌కు అనుబంధంగా వనవాసి కల్యాణ్ ఆశ్రమం జస్పూర్ కేంద్రంగా కార్యకలాపాలు ఆరంభించింది. 1952లో వనవాసి కల్యాణ్ ఆశ్రమం ఆరంభించిన తరువాత అది బాగా విస్తరించిందని చెబుతారు. మతం మారిన వారిని తిరిగి హిందూత్వంలోకి తీసుకురావడం ఈ సంస్థ ఆశయం. అలాగే గిరిజనుల నిజమైన అస్తిత్వం హిందూత్వంలోనే అని ప్రచారం చేయడం. క్రైస్తవ సంస్కృతి గిరిజనులను హిందూత్వం నుంచి వేరు చేస్తున్నదని వారి ఆరోపణ. వనవాసి కల్యాణ్ ఆశ్రమంతో పాటు తరువాత సేవాభారతి కూడా ప్రవేశించింది. క్రైస్తవ మిషనరీలు మతం మార్చడానికి వేటిని అడ్డం పెట్టు కుంటున్నారో – విద్య, వైద్యం– వాటిని సేవాభారతి అందించడం ఆరంభించింది. 1990లో ముస్లిం మతోన్మాదం కూడా విజృంభించడంతో గిరిజన ప్రాంతాల మీద వీరు మరింత శ్రద్ధ పెట్టారు. క్రైస్తవం విదేశీమతం, ఆ మతం వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తుందని వారు బాహాటంగానే చెబుతారు. ఇందుకు సంబంధించి చారిత్రక ఆధారాలు ఎన్నో ఉన్నాయి కూడా. కొండా కోనలలో గిరిజన సంస్కృతి పరిరక్షణ లేదా క్రైస్తవ వ్యాప్తి నిరోధాన్ని ఆర్‌ఎస్‌ఎస్ తీవ్రంగా పరిగణిస్తున్నది. ఒకప్పుడు క్రైస్తవ మతాంతరీకరణలను నిరోధించడానికీ, ఘర్‌వాపసీ కార్యకలాపాలకీ పూర్తి మద్దతు ఇచ్చిన కేంద్ర మాజీ మంత్రి దిలీప్‌సింగ్ జుదేవ్ విగ్రహావిష్కరణకు ఆర్‌ఎస్‌ఎస్ సరసంఘ చాలక్ మోహన్‌జీ భాగవత్ హాజరయ్యారంటేనే ఆ సంస్థ ఇస్తున్న ప్రాధాన్యం అర్థమవుతుంది. ఇది 2022లోనే జరిగింది. ఆ విధంగా జుదేవ్ వారసత్వాన్ని వర్తమాన తరానికి గుర్తు చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ భావించింది. అందుకు క్షేత్రస్థాయిలో



# గిరిసీమల ఆగ్రహం

బలంగా పనిచేస్తున్నది. నక్సల్స్ కంటే మిషనరీలే మరింత ప్రమాదకారులని బీజేపీ భావిస్తోంది.

ఇలాంటి నేపథ్యంలోనే నవంబర్ 11, 2020న జార్ఖండ్ అసెంబ్లీ 'సర్నా ధర్మ' బిల్లును ఆమోదించింది. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఉండే ప్రధాన తెగను ఈ పేరుతో ఏకం చేస్తున్నారు. వీరి మతం వేరు అని చెబుతూ సర్నా స్మృతిని తీసుకువచ్చే ప్రయత్నం జరుగుతోంది. అంటే ఇక్కడి గిరిజనులు హిందుత్వకు చెందరు అన్న వాదనకు రాజ్యాంగబద్ధత కల్పిస్తున్నారు. ఇది ఆర్ఎస్ఎస్, అనుబంధ సంస్థలు గిరిజనులు హిందువులేనంటూ చేస్తున్న పోరాటానికి పూర్తి విరుద్ధమైనది. ఈ బిల్లు కూడా కొన్ని ఉద్రిక్తతలకు, దీర్ఘకాలిక సమస్యలకు కారణమైంది. అయితే ఈ బిల్లు ప్రస్తుతం కేంద్రం వద్ద ఎటూ తేలకుండా ఉంది. కాబట్టి, సంప్రదాయ గిరిజనులు చేస్తున్న వాదన, ఆవేశం ఈ బిల్లుతో వచ్చే ప్రమాదాన్ని గుర్తించిన తరువాతి పరిణామాలను బట్టేనని అర్ధమవుతుంది.

ఈ మొత్తం పరిణామాల గురించి, క్రైస్తవ మిషనరీల కుట్రల గురించి మీడియా పెద్దగా విశ్లేషించడం లేదు. పట్టించుకున్నవాటిలో మళ్లీ ఒక వర్గం దీనిని రెండు వర్గాల మధ్య ఘర్షణగానే వక్రీకరించింది. అలాగే సంప్రదాయక గిరిజన వర్గం 'రైట్‌వింగ్' నాయకుల నాయకత్వంలో ఈ చర్యకు దిగిందని కూడా పేర్కొన్నది. నిజానికి ఇదంతా బలవంతపు మత మార్పిడులు సృష్టిస్తున్న శాంతి భద్రతల సమస్య. అస్తిత్వ సమస్య. ఆత్మగౌరవ సమస్య కూడా. మతాంతరీకరణల కారణంగా తమ జనాభా సమీకరణలలోనే ఎగుడుదిగుళ్లు సంభవిస్తాయని, అంతిమంగా ఇది గిరిజనులకు రాజ్యాంగం ఇస్తున్న మొత్తం ప్రయోజనాలకు ఎసరు పెట్టే అవకాశం ఉందని వారు వాపోతున్నారు.

జనవరి 2న గిరిజనులు దాడి చేసిన చర్చ్ విశ్వ దీప్తి ఉన్నత పాఠశాల (నారాయణ్‌పూర్) ప్రాంగణంలో ఉంది. కిటికీలు, అద్దాలు, కుర్చీలు బద్దలు కొట్టడంతో పాటు కన్యమేరీ, జీసస్ విగ్రహాలను కూడా గిరిజనులు ధ్వంసం చేశారు. దాదాపు నలభయ్ మంది మీద ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. ఇందులో బీజేపీ నారాయణ్‌పూర్ జిల్లా శాఖ అధ్యక్షుడు రూప్ సాయిసాలం కూడా ఉన్నారు. ఇందులో ఆశ్చర్య పడవలసిన పనిలేదు. కానీ ఈ దాడిని ఆపడానికి వచ్చిన పోలీసుల మీద కూడా గిరిజనులు తీవ్ర స్థాయిలోనే ప్రతిదాడికి దిగారు. ఈ ప్రతిదాడిలో సాక్షాత్తు నారాయణ్‌పూర్ పోలీస్ సూపరింటెండెంట్ సదానంద్ కుమార్‌కు తలకు గట్టి గాయమే తగిలింది.

ఈ వివాదాన్ని దేశం దృష్టికి తీసుకువెళ్లాలన్న తలంపు సంప్రదాయ గిరిజనులలో ఉందో లేదో కానీ, ఆ సమస్య దేశం దృష్టికి వెళ్లక తప్పని పరిస్థితి వచ్చింది. క్రైస్తవం తీసుకున్న గిరిజనులపై దాడికి నిరసనగా, నిజానికి చర్చ్ మీద దాడికి నిరసనగా, నారాయణ్‌పూర్ బంద్‌కు మొదట అవతలి వర్గం పిలుపునిచ్చింది. ఈ పిలుపుతో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగాయి. అదనపు బలగాలను రప్పించడంతో నారాయణ్‌పూర్ కంటోన్మెంట్‌ను గుర్తుకు తెచ్చింది. ఈ సందర్భంగానే బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు రూప్ సాయిసాలమ్‌ను, మరొక పదిమందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ పరిణామాలకూ, గిరిజనుల మతాంతరీకరణలకూ నిరసన పేరుతో సంప్రదాయ గిరిజనులు జనవరి 5న బస్తర్ బంద్‌కు పిలుపునిచ్చారు. దీనికి చాంబర్ ఆఫ్ కామర్స్ మద్దతు పలకడంతో మంచి స్పందనే కనిపించింది కూడా. సర్వ ఆదివాసీ సమాజ్ పేరుతో ఈ బంద్‌కు వారు పిలుపునిచ్చారు.

అస్తిత్వ పోరాటంలో ఉన్న గిరిజనుల వాదనలు, తాజా పరిణామాలు చూస్తే ఇంత పెద్ద దాడి ఒక్కరోజులో కొందరు ఆవేశపరులు చేసినది కాదని తెలుస్తుంది. 15 గ్రామాలలో సంప్రదాయ, క్రైస్తవ గిరిజనులకు నడుమ ఘర్షణలు, భౌతికదాడులు జరుగుతూనే ఉన్నాయి. ఇదంతా బ్రిటిష్ కాలం నుంచి జరుగుతున్న మత మార్పిడులకు కొనసాగింపేనని దేశం అర్ధం చేసుకోవాలి. ఆ క్రమంలోనే జనవరి 1వ తేదీన కూడా గొర్రా గ్రామంలో రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇది తాజా దాడి మాత్రమేనని, గడచిన సంవత్సరం నుంచి ఇలాంటి దాడులు ఇక్కడ జరుగుతున్నా చర్యలు తీసుకోవడంలో పాలనా యంత్రాంగం విఫలమైందని, తాజాగా జరిగింది కూడా అదేనని ఛత్తీస్‌గఢ్ క్రిస్టియన్ కమ్యూనిటి ఫోరమ్ అధ్యక్షుడు అరుణ్ పన్నాలాల్ వ్యాఖ్యానించాడు. ఇక్కడ పరిస్థితిని బట్టి ఇలాంటి పరిస్థితి రాక తప్పని పరిస్థితులే ఉన్నాయని అనిపిస్తుంది. ఈ ప్రాంతంలో తాము క్రైస్తవేతరులైన గిరిజనుల చేతిలో వివక్షకు గురి అవుతున్నామని క్రిస్టియన్ సంఘాలు చాలాకాలం క్రితమే గగ్గోలు ఆరంభించాయి. జనవరి 1 నాటి గొర్రా గ్రామ ఘర్షణలు, మరునాడు జరిగిన చర్చ్ మీద దాడి వెనుక మరొక కారణం కనిపిస్తున్నది. డిసెంబర్ 18, 2022న బొర్వాండ గ్రామానికి చెందిన 14 కుటుంబాలను గ్రామస్థులు వారి ఇళ్ల నుంచి తరిమేశారు. మళ్లీ గ్రామంలో అడుగు పెట్టవద్దని శాసించారు. తమను చర్చల కోసం గొర్రా గ్రామం రావలసిందని అంతా చెప్పినా, గ్రామంలోకి ప్రవేశించిన తరువాత నిరాయుధంగా ఉన్న తమ మీద సాయుధులు దాడి చేశారని క్రైస్తవం తీసుకున్న గిరిజనులు కొందరు చెప్పారు.

హిందూ సమాజంలో కొద్దికాలం నుంచి కనిపిస్తున్న చైతన్యం మరింత పదునెక్కుతున్న చిహ్నాలు కనిపిస్తూనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న ఒక వినాయక ఆలయాన్ని సాక్షాత్తు చర్చ్ ఫాదర్ వచ్చి కూలగొట్టే ప్రయత్నం చేయడం, అందుకు మహిళల నుంచి ప్రతిఘటన రావడం ఇటీవలి పరిణామం. తరువాత హిందూ సంఘాల ఆందోళనతో ఆ మతోన్మాదిని అరెస్టు చేశారు. ఇస్లాం సర్‌తన్ సె జుదా అంటుంది. క్రైస్తవం చాపకింద నీరులా దేశ సమగ్రతకు, హిందుత్వకు చేటు చేయాలని చూస్తున్నది. ఇందుకు అనేక అడ్డదారులు ఎంచుకుంది. మిషనరీల దుండగీడుతనానికి ఇంత మద్దతు ఎక్కడ నుంచి వస్తున్నదో అందరికీ తెలుసు. కాబట్టి హిందూ సమాజం ఐక్యత తక్షణ కర్తవ్యంగా భావించాలి. కొండకోనలైనా, మైదానాలైనా ఇప్పుడు హిందుత్వం ఆపదలో ఉన్న మాట నిజం. దీనికి సరైన సమాధానం చెప్పాలి. అందుకు ఏకం కావాలి. ★

# పూర్ణ స్వరాజ్‌ను మొదట

భారత్ ఏటా జనవరి 26న గణతంత్ర దినోత్సవాలు జరుపుకుంటోంది. ఈ తేదీనే 1930 నుంచి 1947 వరకు 'స్వాతంత్ర్య దినం'గా జరుపుకున్నామన్న సంగతి చాలామందికి తెలియకపోవచ్చు. గణతంత్ర దిన వేడుకల్లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఎందుకు పాల్గొనడంలేదని సంఘ్ వ్యతిరేకులు చేసే విమర్శ. జనవరి 26, 1930న మొట్ట మొదటిసారి 'పూర్ణస్వరాజ్' దినం జరుపుకున్నారు. 1950 నుంచి ఇదే రోజును 'గణతంత్ర దినోత్సవం'గా జరుపుకుంటున్నాం. మరి జనవరి 26,1930న సంఘ్ ఎక్కడుంది? అదేవిధంగా జనవరి 26, 1950న ఈ సంఘ్ ఏమైపోయింది? ఈ ప్రశ్నలకు సంఘ్ ఆర్కైవ్స్, మహారాష్ట్ర నుంచి వెలువడిన 'కేసరి' పత్రికల ఆధారంగా ఈ వ్యాసంలో సమాధానాలు ఇచ్చాం. జనవరి 26, 1950 తేదీనే గణతంత్ర దినోత్సవంగా ఎందుకు నిర్ణయించాల్సి వచ్చింది?



ఇండియన్ ఇండిపెండెన్స్ యాక్ట్-1947 నాటి భారత్‌ను రెండు స్వతంత్ర అధినివేశ ప్రాంతాలుగా విడగొట్టింది. ఒకటి భారత్, రెండవది పాకిస్తాన్. ఆ విధంగా విడగొట్టిన తేదీ ఆగస్టు 15, 1947. దీంతో అప్పటి వరకు శాసన కార్యకలాపాలను నిర్వహించిన ఇంపీరియల్ కౌన్సిల్ నుంచి, భారత రాజ్యాంగ సభ అధికారాలను హస్తగతం చేసుకుంది. 1949, నవంబర్ 26న ఇది రాజ్యాంగ ముసాయిదాను ఆమోదించింది. ఇక రాజ్యాంగం అమల్లోకి వచ్చే తేదీని నిర్ణయించడమే మిగిలింది. కొత్త సంవత్సరం జనవరి 1వ తేదీ ఇందుకు అనుకూలమన్నది బ్రిటిష్ పాలకుల అభిప్రాయం. జనవరి ఆఖరి తేదీని నిర్ణయించాలంటే మహాత్మా గాంధీని హత్యచేసిన రోజుకు సమీపంగా ఉండటంతో కాంగ్రెస్‌కు ఇష్టంలేదు. అందువల్ల జనవరి నెలలో ఏదో ఒక తేదీ నిర్ణయించవచ్చు. కానీ అప్పటికి సరిగ్గా ఇరవయ్యేళ్ల క్రితం జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలోని భారత జాతీయ కాంగ్రెస్ యాదృచ్ఛికంగా జనవరి 26, 1930ను "పూర్ణ స్వరాజ్" దినంగా ప్రకటించింది (కేసరి, జనవరి 27,1950). ఈ నేపథ్యంలో ఇదే తేదీని భారత జాతీయ కాంగ్రెస్ గణతంత్ర దినోత్సవానికి ఎంచుకుంది. అప్పటికి ఐదు దశాబ్దాల కాలంలో ఎంతో మంది విప్లవకారులు తమ ప్రాణత్యాగాలు చేశారు. వారి కుటుంబాలు హత్యలు, దేశ బహిష్కరణకు గురయ్యారు. జైళ్లపాలయ్యారు. వారి ఆస్తులు జప్తులకు గురయ్యాయి. మరి వీరందరూ ఇంతటి త్యాగాలు చేసింది పూర్ణస్వరాజ్యం కోసమే కదా! కనీసం వారిని తలుచుకోవడానికి కూడా అవకాశాలు లేవు. మరి అంతటి త్యాగశీలురైన విప్లవకారులకు ఏవిధమైన మన్నన లేకుండా, కాంగ్రెస్‌కు ప్రత్యేకించి నెహ్రూకు చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ తేదీని సర్వసత్తాక, ప్రజాస్వామ్య గణతంత్ర భారత్‌కు నిర్ణయించారు.

**సంతోషం, ఆగ్రహం**

గణతంత్ర దేశం ఆవిర్భవించిన సందర్భాన్ని పురస్కరించుకొని 1950, జనవరి 26, 27 తేదీల్లో వేడుకలు జరుపుకోవాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఈవిధంగా భారత్ గణతంత్రరాజ్యంగా అవతరించడంపై దేశంలోని వివిధ రాజకీయ వర్గాల అభిప్రాయం ఎలా ఉన్నదనేది తీసుకుంటే, అప్పటికి రాజకీయాధిపత్యం కలిగిన కాంగ్రెస్ మాటకే ఎక్కువ విలువ. ముఖ్యంగా గాంధీజీ హత్యను సాకుగా తీసుకొని, నెహ్రూ అఖిల భారత హిందూమహాసభ (ఏబీహెచ్ఎం), సంఘ్‌లను అణగ దొక్కేశారు. నెహ్రూ దేశ సంధానకరణకు సంబంధించిన తన దృక్కోణంలో ఈ గ్రూపులకు అసలు స్థానమే కల్పించలేదు. మహాత్మాగాంధీ హత్యకు ఆగ్రహంతో వినాయక్‌రావ్ దామోదర్ సావర్కర్‌పై విచారణ జరపగా, గణతంత్ర రాజ్యం ఆవిర్భావానికి కేవలం ఒక ఏడాది ముందు జైలునుంచి విడుదలయ్యాడు. అప్పుడు సావర్కర్ ఒక గొప్ప ప్రకటన చేశారు. అదే, "దేశంలోని ప్రతి పౌరుడికి తన మాతృభూమి పట్ల హృదయపూర్వకమైన సంపూర్ణ విధేయత ఉన్నదనడంలో ఎటువంటి సందేహం లేదు. బ్రిటిష్ దాస్య శృంఖలాల నుంచి బయటపడిన నేపథ్యంలో జరుపుకునే వేడుకల్లో వీరు కూడా పాల్గొనగలరు. అయితే మనం ప్రాంతీయత, మూర్తిమత్వ భావన, పార్టీల మధ్య ఉన్న జగడాలను పక్కనపెట్టి ఈ ఉత్సవాలను ఒకే వేదికపై నిర్వహించాలి. ఆ వేదికే మన మాతృభూమి. మన విజయాన్ని ప్రపంచానికి చాటాలి"–(బొంబే క్రానికల్, ఏప్రిల్ 5, 1950). అప్పటికి కొత్త రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ నిర్దేశంతో, వయసు మీరుతున్నప్పటికీ వీర్ సావర్కర్ తన సేవలను కొనసాగించారు.

ఏబీహెచ్ఎం ఉపాధ్యక్షుడు, పార్లమెంటరీ బోర్డు ఛైర్మన్ అశుతోష్ లహిరిని స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నందుకు అప్పటి ప్రభుత్వం అండమాన్ జైల్లో ఖైదు చేసింది. ఆయన ఇప్పుడు అన్ని హిందూ యూనిట్లను సమీకృతం చేసి రాజ్యాంగం అమల్లోకి వచ్చిన సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో పాల్గొనేలా కృషి చేశారు (కేసరి, జనవరి24, 1950). జనవరి 27, 1950న బొంబాయిలో ఏర్పాటు చేసిన ఏబీహెచ్ఎం కమిటీ సమావేశం భారత్ రిపబ్లిక్‌గా ఏర్పడటాన్ని స్వాగతిస్తూ తీర్మానం చేసింది (కేసరి, జనవరి 31, 1950).

అయితే భారత్ రిపబ్లిక్‌గా ఏర్పడటం కొందరిలో ఆగ్రహం కలిగించింది. జనవరి 26న కమ్యూనిస్టులు బొంబాయిలోని కాలాచౌక్‌లో ధర్నా జరిపారు. పోలీసులు వారిని వెనక్కి వెళ్లమని కోరగా, యాసిడ్ బాంబులను విసిరారు. ఈ సంఘటనలో ఇద్దరు పోలీసు సబ్-ఇన్‌స్పెక్టర్లకు గాయాలయ్యాయి. దీంతో పోలీసులు నాలుగు రౌండ్లు కాల్పులు జరపగా ఎనిమిదిమంది గాయపడ్డారు. ఈ సందర్భంగా 55 మంది కమ్యూనిస్టులను అరెస్ట్ చేశారు (జనవరి 27, 1950, కేసరి). బొంబాయిలోని కొలాబా ప్రాంతంలో పతాక వందన కార్యక్రమాల వద్దకు వెళ్లిన కమ్యూ

డాక్టర్ శ్రీరంగ్ గొడ్బొలె

# ప్రతిపాదించినది ఆర్‌ఎస్‌ఎస్

నిస్టులు ఈ పతాకాలను దించేసి నల్లజెండాలను ఎగురవేయాలని కోరారు. ఇది గొడవలకు దారితీసింది (జనవరి 31,1950). ఫార్వర్డ్ బ్లాక్, పెజెంట్ అండ్ వర్కర్స్ పార్టీ ఇతర సంస్థల కార్యాలయాలపై నల్లజెండాలను జనవరి 26న ఎగుర వేసినట్టు కేసరి పత్రిక ప్రచురించింది. బొంబాయి, కలకత్తా నగరాల్లో రిపబ్లిక్ వేడుకలను అడ్డుకునేందుకు కమ్యూనిస్టులు దుష్టయత్నాలు చేశారు. (ఫిబ్రవరి 3, 1950,కేసరి).


కామ్టీ (సెంట్రల్ ప్రావెన్స్) ప్రాంతంలో ఒక మసీదు వద్ద, రిపబ్లిక్ డే ఊరేగింపును అడ్డుకున్నారు. ఊరేగింపులో సంగీతం వాయిస్తున్నారన్న కారణంతో ఈ చర్యకు పూనుకున్నారు. సంగీతం ఆపిన తర్వాత మాత్రమే ఈ ఊరేగింపు ముందుకు సాగడానికి అనుమతించారు. ఈ ఊరేగింపు తిరుగు ప్రయాణం సందర్భంగా లాఠీలు ధరించిన హిందూయేతరులు దాడులు జరపడానికి సిద్ధంకాగా, సాయుధ పోలీసులు ఏవిధమైన అవాంఛనీయ సంఘటన జరగకుండా అడ్డుకున్నారు (ఫిబ్రవరి 6,1950, కేసరి).

జనవరి 24,1950న కేసరి పత్రిక ఈ విధంగా ప్రకటించింది. ''కాంగ్రెస్ సేవాదళ్, స్కౌట్ విద్యార్థులు, రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ ఇతర సంస్థలు కలసి జనవరి 26న వేకువ సమయంలో ప్రభాత్ ఫేరీలు నిర్వహిస్తాయి". కాంగ్రెస్ సేవాదళ్ కార్యకర్తలు, బాల స్వయంసేవక్‌లు, కాంగ్రెస్ సేవాదళ్, సోషలిస్ట్ రాష్ట్ర సేవాదళ్‌లతో కలిసి రెండు రోజుల ఉత్సవాల్లో పాల్గొన్నారని కూడా కేసరి రాసింది (జనవరి 27,1950,). బొంబాయిలో సంఘ్ కార్యక్రమం గురించి కేసరి పత్రిక రాస్తూ 'జనవరి 26న చౌపట్టీలో సంఘ్ ఆధ్వర్యంలో జెండా వందన కార్యక్రమం ఎంతో ఆకర్షణీయంగా జరిగింది. ఈ సందర్భంగా వీరు ప్రదర్శించిన క్రమశిక్షణ, వైభవం నిజానికి పోలీసులు, సైన్యానికి ఏమాత్రం తీసిపోవు' (జనవరి 31,1931).

**సంపూర్ణ స్వరాజ్యంపై కాంగ్రెస్ వైఖరి**

డిసెంబర్ 27, 1927న జరిగిన మద్రాస్ సమావేశంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్య దర్శి జవహర్‌లాల్ నెహ్రూ సంపూర్ణ స్వరాజ్యానికి సంబంధించిన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానం ఈ విధంగా ఉంది. "భారత ప్రజల లక్ష్యం సంపూర్ణ స్వరాజ్యమని కాంగ్రెస్ ప్రకటిస్తోంది" (1927లో మద్రాస్‌లో జరిగిన 42వ భారత జాతీయ కాంగ్రెస్ సమావేశం: ఆహ్వాన సంఘం,42వ భారత జాతీయ కాంగ్రెస్ సమావేశం మద్రాస్ పేజీ నెం.15). సంపూర్ణ స్వరాజ్యం, బ్రిటిష్ వస్తువుల బహిష్కరణ అనే ఈ తీర్మానంలోని అంశాలు గాంధీజీకి ఇష్టం కానివి (డి.జి. తెందూల్కర్, మహాత్మా: లైఫ్ ఆఫ్ మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ, విఠల్‌భాయ్.కె ఝువేరీ, డి.జి. తెందూల్కర్, ముంబయి 1951, వాల్యూమ్–2, పేజీలు 402, 429–430). ఇక ముందు వలసవాద స్వయంపాలన అనేది భారత జాతీయ కాంగ్రెస్ అభిమతమై ఉండాలి. అప్పటి ఐ.ఎన్.సి. అధ్యక్షులు ముక్తార్ అహ్మద్ అన్సారీ తాను సమావేశానికి అధ్యక్షత వహించబోనని మోతీలాల్ అప్పట్లో స్పష్టం చేశారు. అప్పుడు గాంధీ ఒక మధ్యేమార్గాన్ని ప్రతిపాదించారు. " డిసెంబర్ 31, 1930కి ముందు ఆమోదం పొందనట్లయితే ప్రతిపాదిత రాజ్యాంగానికి కాంగ్రెస్ బద్ధురాలై ఉండదు. ఇక రెండో విషయం ఏమంటే ఈ రాజ్యాంగాన్ని డిసెంబర్ 31, 1930లోగా బ్రిటిష్ పార్లమెంట్ ఆమోదం తెలపకపోతే కాంగ్రెస్, అహింసాయుత పద్ధతిలో సహాయ నిరాకరణోద్యమం చేపడుతుంది" (తెందూల్కర్ పేజీలు 439:440).

గాంధీ చెప్పిన గడువు ముగియక ముందే అంటే



**ఇది 1963 నాటి గణతంత్ర దిన వేడుక. అంటే ప్రథమ ప్రధాని నెహ్రూ కాలం నాటిది. ఆనాటి వేడుకలో పూర్తి గణవేశ్‌తో ఘోష్‌తో 3500 మంది స్వయంసేవకులు పాల్గొన్నారు. అసలు ఆర్ఎస్ఎస్‌కు గణతంత్ర వేడుక చరిత్రకు సంబంధమే లేదని వాదిస్తున్నకాలంలో ఈ ఫోటో ప్రచురించడం అసందర్భం కాదు.**

'సాధ్యమైతే బ్రిటిష్ సామ్రాజ్యంలో, అవసరమైతే అందులో భాగం కాకుండా' (మద్రాస్ కాంగ్రెస్ రిపోర్ట్, అనుబంధం 1, పేజీ 3).

డిసెంబర్ 28, 1928 నుంచి జనవరి 1, 1929 వరకు కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమా వేశంలో నాయకుల మధ్య విభేదాలు పొడచూపాయి. జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్‌లు సంపూర్ణ స్వరాజ్య భావనకు మద్దతివ్వగా, మహాత్మా గాంధీ, ఐ.ఎన్.సి–ఎలక్ట్ అధ్యక్షులు మోతీలాల్ నెహ్రూ అధినివేశ ప్రతిపత్తికి మద్దతు పలికారు. భవిష్యత్ భారత రాజ్యాంగం ఎట్లా ఉండాలనే దానిపై ఏర్పాటు చేసే అఖిలపక్ష సమావేశాన్ని పురస్కరించు కొని ఈ అధినివేశ ప్రతిపత్తి ఆధారంగానే మోతీలాల్ తన నివేదికను తయారుచేశారు. ఈ నివేదికకు అనుకూలంగా మెజారిటీ సభ్యుల మద్దతు లేకపోతే,

అక్టోబర్ 31, 1929న వైస్రాయ్ ఇర్విన్ ఒక ప్రకటన చేస్తూ, భారత రాజ్యాంగ రచన అధినివేశ ప్రతిపత్తి దిశగా పురోగతిలో సాగుతున్నదని చెప్పారు. ఇదే సమయంలో ఆయన గాంధీ, జిన్నా వంటి నాయకులకు 'రౌండ్ టేబుల్ సమావేశం ఎప్పుడు నిర్వహించే తేదీని ఇపుడే చెప్పడం సాధ్యంకాదని' స్పష్టం చేశారు. అంటే అధినివేశ ప్రతిపత్తి ఇచ్చే విషయంలో ఏ విధమైన హామీ ఇవ్వలేదని అర్థం. దీంతో ఆశలు అడియాశలైన గాంధీ తక్షణమే పూర్ణ స్వరాజ్యమే లక్ష్యమని ప్రకటించారు. 1929 డిసెంబర్‌లో లాహోర్‌లో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ జాతీయ సదస్సు, జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సు పుణ్యమాని సంపూర్ణ స్వరాజ్య ప్రకటన కోసం దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది (ఆర్.సి. ముజుందార్,

హిస్టరీ ఆఫ్ ఫ్రీడమ్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా, ఫిర్మా, కె.ఎల్. ముఖోపాధ్యాయ – కలకత్తా వ్యాల్యూమ్–3, పేజీలు 322, 325).

కాంగ్రెస్ రచించిన రాజ్యాంగంలోని అధికరణ–1లో పేర్కొన్న ‘స్వరాజ్’ అంటే సంపూర్ణ స్వరాజ్యమని అర్థమంటూ లాహోర్ సదస్సులో మహాత్మా గాంధీ ప్రకటించారు. దీంతో మోతీలాల్ నెహ్రూ రూపొందించిన నివేదిక బుట్టదాఖలైంది. ఇకముందు కాంగ్రెస్‌వాదులు సంపూర్ణ స్వరాజ్య సాధన దిశగా పూర్తిస్థాయిలో పనిచేస్తారన్న ఆశ వ్యక్తమైంది (44వ వార్షిక కాంగ్రెస్ లాహోర్ సదస్సుపై భారత జాతీయ కాంగ్రెస్ నివేదిక, రిసెప్షన్ కమిటీ పేజీ. 88).

పూర్ణ స్వరాజ్ సిద్ధాంతాన్ని దేశప్రజల ముందుంచేందుకు వీలుగా భారత జాతీయ కాంగ్రెస్ జనవరి 2, 1930న ఒక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం ఏటా జనవరి 26వ తేదీని దేశ వ్యాప్తంగా ‘పూర్ణ స్వరాజ్య దినం’గా పాటించాలి. దీనికి సంబంధించిన మేనిఫెస్టోను మహాత్మా గాంధీ తయారుచేయగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఇక గ్రామాలు, పట్టణాల్లోని ప్రజలు, సదస్సులో పాల్గొన్న ప్రేక్షకులు కేవలం ఈ మేనిఫెస్టోకు అనుకూలంగా చేతులెత్తడం ద్వారా సమ్మతి తెలపడం తప్ప చేసేదేం లేదు. (మజుందార్ –పేజీ.331).

**హెడ్గేవార్ హర్షం**

ఏటా జనవరి 26న పూర్ణ స్వరాజ్ దినంగా పాటించాలని నిర్ణయించడం దేశభక్తులందరిలో ఆనందం నింపింది. అటువంటి వారిలో రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ వ్యవస్థాపకులు డా.కేశవరావ్ బలిరామ్ హెడ్గేవార్ ఒకరు.

హెడ్గేవార్ తొలి నుంచి సంపూర్ణ స్వరాజ్యం



కోసమే కోరారు. ఇందుకోసం ఆయన ఏబీహెచ్‌ఎం, ఐఎన్‌సీల్లో పనిచేస్తూనే విప్లవ పంథాను అనుసరించారు. అయితే హిందువుల సంఘటన ద్వారానే ఇది సాధ్యమవుతుందని ఆయన బలంగా నమ్మారు. ఈ లక్ష్యంతోనే 1925లో సంఘ్‌ను స్థాపించారు. ఈ నేపథ్యంలో భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్ కోసం తీర్మానించడం ఆయనకు ఆనందం కలిగించింది. స్వయంసేవకులంతా తమ స్థాయిని బట్టి జాతీయ కార్యకలాపాల్లో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ నేపథ్యంలో జనవరి 21, 1930న ఆయన దేశవ్యాప్తంగా స్వయం సేవకులకు లేఖ రాస్తూ, ‘భారత జాతీయ కాంగ్రెస్ ఎట్టకేలకు పూర్ణ స్వరాజ్ లక్ష్యాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో 1930, జనవరి 26న దేశవ్యాప్తంగా ఉన్న అన్ని శాఖలు, సాయంత్రం సరిగ్గా ఆరుగంటలకు జాతీయ పతాకానికి వందనం చేయాలి’. (సంఘ్ ఆర్కీవ్‌లు, హెడ్గేవార్ పేపర్స్, ఎ పత్రక్ బై డా॥ హెడ్గేవార్ టు ది స్వయంసేవక్, జనవరి 21,1930).

అయితే ఆనాడు సంఘ్ ఎక్కువగా మరాఠీ మాట్లాడే ప్రాంతాలైన నాగ్‌పూర్, వార్ధా, చందా (నేటి చంద్రాపూర్), భందరల్లో వ్యాప్తిలో ఉండేది. అమరావతి, బుల్ఢన, అకోలా, యావత్ మాల్ ప్రాంతాల్లో సంఘ్ కార్యకలాపాలు తక్కువ.

హెడ్గేవార్ నిర్దేశం మేరకు దేశవ్యాప్తంగా సంఘ్ శాఖలు, కాంగ్రెస్‌ను ప్రశంసిస్తూ తీర్మానాలు చేశాయి. జనవరి 26, 1930 సాయంత్రం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు విశ్వనాథ్ వినాయక్ కేల్కర్ నేతృత్వంలో స్వాతంత్ర్య దిన వేడుకలు నాగ్‌పూర్‌లో జరిగాయి. ప్రధానవక్తగా నారాయణ్ వైద్య వ్యవహరించారు. హెడ్గేవార్, లక్ష్మణ్ వాసుదేవ్ పరంజపె, నవాథే తదితరులు పాల్గొన్నారు.

**చందాలో కార్యక్రమం**

జనవరి 29, 1930న చందా ప్రాంత సంఘ కార్యదర్శి రామచంద్ర రాజేశ్వర్ అలియాస్ తాత్యాజీ దేశ్‌ముఖ్, అక్కడ నిర్వహించిన కార్యక్రమానికి సంబంధించిన నివేదికను హెడ్గేవార్‌కు పంపారు. దీని ప్రకారం, హెగ్డేవార్ లేఖ అందడానికి ముందే స్వాతంత్ర్య దినోత్సవం జరపాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం తర్వాత లేఖ అందింది. కాంగ్రెస్ కార్యదర్శి అభ్యర్థన మేరకు జనవరి 26 ఉదయం స్వయంసేవకులు చందాలో ఒక పెద్ద ఊరేగింపు జరిపి, జాతీయ పతాకానికి వందనం సమర్పించారు. ఇక సాయంత్రం తాలూకా కాంగ్రెస్ కార్యదర్శి, తమ పార్టీ తరపున నిర్వహించే ఊరేగింపులో పాల్గొనాలని ఆహ్వానించినా సంఘటన్ నిర్వహించాలని అప్పటికే నిర్ణయం జరగడంతో అందులో పాల్గొన లేక పోయారు. ఇదే విషయాన్ని సంఘ్ కాంగ్రెస్ తాలూకా కార్యదర్శికి తెలియజేసింది.

సాయంత్రం 4.30 గంటలకు జరిగిన సంఘటన్ సందర్భంగా కేశవరావ్ బొడకే, దేశ్ ముఖ్‌లు ప్రసంగించారు. ఈ సందర్భంగా భాగవత్ సంక్షిప్తంగా మంచి ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా పూర్ణ స్వరాజ్‌ను సమర్థిస్తూ తీర్మానాన్ని ఆమోదించారు. నిజానికి కాంగ్రెస్ కంటే ఎంతో ముందే సంఘ్ పూర్ణ స్వరాజ్‌ను తీర్మానించింది. ఈ కారణంగానే కాంగ్రెస్ తీర్మానానికి మద్దతు తెలిపింది.

అను: జమలాపురపు విఠల్‌రావు





అతివేగం ప్రాణాంతకం.. ఈ మాట క్రికెట్‌కు మాత్రం వర్తించదు. ప్రపంచ క్రికెట్లో మెరుపు వేగంతో బౌలింగ్ చేయగల ఫాస్ట్ బౌలర్లున్న జట్లే విజయాలతో ఆధిపత్యం ప్రదర్శిస్తాయి. ప్రస్తుత భారత క్రికెట్లో మాత్రమే కాదు, ప్రపంచ క్రికెట్లోనే అత్యంత వేగంగా బంతులు విసిరే ఫాస్ట్ బౌలర్లలో ఒకడిగా యువ ఫాస్ట్‌బౌలర్, జమ్ము ఎక్స్‌ప్రెస్ ఉమ్రాన్ మాలిక్ గుర్తింపు తెచ్చుకున్నాడు.

# ప్రపంచ క్రికెట్లో భారత బుల్లెట్!

ప్రపంచ క్రికెట్‌ను శాసించాలంటే ఏ జట్టుకైనా మెరికల్లాంటి ఫాస్ట్ బౌలర్లు ఉండి తీరాలి. గతంలో అగ్గిపిడుగుల్లాంటి నలుగురేసి ఫాస్ట్ బౌలర్లతో వెస్టిండీస్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా జట్లు ప్రపంచ క్రికెట్‌నే గడగడలాడించాయి. అయితే స్పిన్ బౌలర్లకు పుట్టినిల్లుగా పేరుపొందిన భారత క్రికెట్ చరిత్రలో నాణ్యమైన ఫాస్ట్ బౌలర్లు కొందరు మాత్రమే కనిపిస్తారు.

1932లో ఇంగ్లండ్ గడ్డపైన టెస్టు క్రికెట్ అరంగేట్రం చేసిన భారతజట్టులో మహ్మద్ నిస్సార్, అమర్ సింగ్‌లతో ఓ మెరుపు ఫాస్ట్ బౌలర్ల జోడీ సంచలనం సృష్టించింది. టెస్టు క్రికెట్లో తొలి వికెట్ పడగొట్టిన భారత మొట్టమొదటి ఫాస్ట్ బౌలర్‌గా షేక్ మహ్మద్ నిస్సార్ రికార్డుల్లో చేరాడు. ఆ తర్వాత భారత్ మరో నిఖార్సయిన ఫాస్ట్ బౌలర్ కోసం కపిల్ దేవ్ ఆగమనం వరకూ వేచిచూడాల్సి వచ్చింది. ఒక్కమాటలో చెప్పాలంటే కపిల్ దేవ్ రాకతో భారత్‌లో ఫాస్ట్ బౌలర్ల విప్లవానికి తెరలేచింది. అప్పటి వరకూ స్పిన్ బౌలింగే ప్రధాన అస్త్రంగా నెట్టుకొంటూ వచ్చిన భారత్‌కు జవగళ్ శ్రీనాథ్, జహీర్‌ఖాన్ లాంటి ఫాస్ట్ బౌలర్లు, మనోజ్ ప్రభాకర్, రోజర్ బిన్నీ, కర్సన్ ఘావ్రీ, మదన్ లాల్, చేతన్ శర్మ, ఇర్ఫాన్ పఠాన్, రుద్రప్రతాప్ సింగ్ లాంటి మీడియం పేస్ స్వింగ్ బౌలర్లే దిక్కయ్యారు.

ఆస్ట్రేలియా పేస్ బౌలింగ్ దిగ్గజం డెన్నిస్ లిల్లీ పర్యవేక్షణలో ఏర్పాటైన ఎమ్మారెఫ్ పేస్ అకాడమీ ద్వారా పలువురు యువ ఫాస్ట్ బౌలర్లు తెర మీదకు వచ్చినా ఎక్కువకాలం నిలబడలేకపోయారు. జవగళ్ శ్రీనాథ్, జహీర్‌ఖాన్ ఫాస్ట్ బౌలర్లుగా భారత క్రికెట్‌కు అసమాన సేవలు అందించారు. ఇర్ఫాన్ పఠాన్, ఆర్పీ సింగ్ లాంటి ఎడమచేతి వాటం స్వింగ్ బౌలర్లు సైతం తమవంతు పాత్ర పోషించారు. 2008లో ప్రారంభమైన ఐపీఎల్‌తో భారత్‌లో ఫాస్ట్, స్వింగ్ బౌలర్ల ప్రాధాన్యం పెరిగింది. స్వింగ్ కింగ్ భువనేశ్వర్ కుమార్, ఫాస్ట్ బౌలర్ల త్రయం మహ్మద్ షమీ, ఉమేశ్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రాలతో భారత జట్టు టెస్టు క్రికెట్లో ప్రపంచ నంబర్‌వన్ స్థాయికి చేరుకోగలిగింది. ఐసీసీ టెస్టు లీగ్‌లో సైతం రన్నరప్‌గా నిలువగలిగింది.

**156 కిలోమీటర్ల వేగంతో..**

భారత ఫాస్ట్ బౌలర్ల వేగం గత దశాబ్ద కాలంలో గంటకు 130 కిలోమీటర్ల స్థాయి నుంచి 156 కిలోమీటర్ల స్థాయికి పెరిగిపోయింది. మహ్మద్ షమీ, ఉమేశ్ యాదవ్ గంటకు 135 నుంచి 140 కిలోమీటర్ల వేగంతో బౌల్ చేస్తుంటే, గుజరాత్ నుంచి భారత క్రికెట్లోకి దూసుకొచ్చిన యార్కర్ల కింగ్ జస్‌ప్రీత్ బుమ్రా 153.36 కిలోమీటర్ల స్థాయికి చేర్చాడు. భారత క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకూ అత్యంత వేగంగా బంతులు విసిరిన బౌలర్ల వరుసలో బుమ్రా, షమీ, నవదీప్ సైనీలు నిలిచారు. బుమ్రా 153.36 కిలో మీటర్లు, మహ్మద్ షమీ 153.3 కిలోమీటర్లు, నవదీప్ సైనీ 152. 85 కిలోమీటర్ల వేగంతో బంతులు విసరడం ద్వారా ఇప్పటి వరకూ మొదటి మూడు స్థానాలలో కొనసాగుతూ వచ్చారు.

**జమ్ము ఎక్స్‌ప్రెస్ ఉమ్రాన్..**

జమ్ములో గుజ్జర్‌నగర్‌లోని ఓ పండ్ల దుకాణం యజమాని ఇంట జన్మించిన ఉమ్రాన్ మాలిక్ 19 ఏళ్లకే బుల్లెట్ వేగంతో బంతులు విసిరే ఫాస్ట్ బౌలర్‌గా పేరు తెచ్చుకొన్నాడు. ఐపీఎల్‌లో హైదరాబాద్ సన్ రైజర్స్ జట్టులో సభ్యుడిగా ఉమ్రాన్ ప్రభంజనమే సృష్టించాడు. ఇతన్ని 4 కోట్ల రూపాయలకు వేలం ద్వారా హైదరాబాద్ ఫ్రాంచైజీ సొంతం చేసుకోగలిగింది. 2022 సీజన్లో తన సుడిగాలి బౌలింగ్‌తో 13 మ్యాచ్‌ల్లో 21 వికెట్లు పడగొట్టడం ద్వారా భారతజట్టులో చోటు సంపాదించాడు. ఓ ఐపీఎల్ సీజన్‌లో 20 అంత కంటే ఎక్కువ వికెట్లు తీసిన అతిపిన్న వయస్కుడైన భారత బౌలర్‌గా (22 ఏళ్ల 176 రోజులు) రికార్డు సృష్టించాడు. ఉమ్రాన్‌కు ముందు ఈ రికార్డు ముంబై ఇండియన్స్ పేసర్ బుమ్రా పేరిట ఉండేది. 2017 ఐపీఎల్ సీజన్‌లో బుమ్రా 23 ఏళ్ల 165 రోజుల వయసులో 16 మ్యాచ్‌ల్లో 20 వికెట్లు పడగొట్టాడు.

ఐపీఎల్ ద్వారా భారత సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించిన 22 ఏళ్ల ఉమ్రాన్ 2022 జూన్‌లో తన తొలి అంతర్జాతీయ టీ-20 మ్యాచ్‌ను ఐర్లాండ్, తొలి వన్డే మ్యాచ్‌ను న్యూజిలాండ్‌పై 2022 నవంబర్‌లోనూ ఆడాడు. అయితే, 2023 సిరీస్‌లో భాగంగా ముంబై వాంఖడే స్టేడియం వేదికగా శ్రీలంకతో జరిగిన తొలి వన్డేలో గంటకు 155 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేసి సరికొత్త రికార్డు నెలకొల్పిన ఉమ్రాన్.. గువాహతి బార్సపారా స్టేడియం వేదికగా శ్రీలంకతోనే జరిగిన తొలి వన్డేలో 156 కిలోమీటర్ల వేగాన్ని అందుకోడం ద్వారా తన రికార్డును తానే అధిగమించాడు. భారత క్రికెట్ చరిత్రలోనే సగటున 150 కిలోమీటర్లు, అత్యధికంగా 156 కిలోమీటర్ల వేగంతో బౌల్ చేసిన తొలి, ఏకైక బౌలర్‌గా, భారత ఫాస్టెస్ట్ బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. ఉమ్రాన్ రానున్నకాలంలో ఇదే స్థాయిలో రాణించగలిగితే ప్రపంచంలోనే ఫాస్టెస్ట్ బౌలర్‌గా నిలిచినా ఆశ్చర్యపోనక్కరలేదు. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్






# విలువలతో కూడిన విద్య శిశు

విద్యాభారతి విద్యారంగంలో అనేక నూతన ప్రయోగాలు, పరిశోధనలు చేస్తూ ప్రశంసలు అందు కుంటోందని ఆర్.ఎస్.ఎస్. అఖిల భారతీయ కార్య కారిణి సదస్యులు రాంమాధవ్ తెలిపారు. చదువును చెప్పడం మాత్రమే కాకుండా అది విలువలతో కూడిన విద్యను అందించడం మన లక్ష్యంగా ఉండాలని అన్నారు. చదువు అంటే కేవలం పాఠ్యాంశాల బోధన, అభ్యాసమే కాదని, సమాజ అధ్యయనం, వ్యక్తిలో శీల నిర్మాణం జరగాలని చెప్పారు. వివేకానంద జయంతి (జనవరి 12)ని పురస్కరించుకుని కర్నూల్‌లో శ్రీ సరస్వతీ విద్యాపీఠం విజయవాడ, అనంతపురం సమితుల ఆధ్వర్యంలో జరిగిన పూర్వ విద్యార్థులు, పూర్వాచార్యుల సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. వెనుకబడిన ప్రాంతాలలో కూడా నిర్మాణాత్మక విద్యాబోధనను అందించవలసి ఉందని అన్నారు. వెనుకబడిన బస్తీ లను తీర్చిదిద్దాలని, అందుకు సమాజంలోని విశిష్ట వ్యక్తులను జోడించు కుంటూ ఈ సేవా కార్య క్రమాలలో వారిని భాగ స్వాములను చేయవలసిన బాధ్యత తమందరిపైన ఉందని అన్నారు.

శ్రీ సరస్వతీ శిశుమందిరాలు మన దేశాన్ని పరమవైభవ స్థితికి తీసుకురావడానికి నిత్యం ప్రయత్ని స్తున్నాయని విద్యాభారతి అఖిల భారత అధ్యక్షులు దూసి రామకృష్ణ చెప్పారు. శిశుమందిరాలలో చదివిన వేలాది మంది దేశ విదేశాలలో ఉన్నత స్థానా లలో ఉంటూ, వివిధ సామాజిక సేవాకార్యక్రమాలలో భాగస్వాములవుతున్నారని తెలిపారు. వనవాసీ ప్రాంతాలలో ఏకోపాధ్యాయ పాఠశాలలు, వెనుక బడిన బస్తీలలో బాల సంస్కార కేంద్రాలలో సేవాకార్య క్రమాలలో పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు.

నీరసపడి పోతున్న జాతికి స్వామి వివేకానందుడి స్ఫూర్తితో పూర్వవైభవం తీసుకురావాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. శిశుమందిరాలు సామాజిక పరివర్త నకు నాంది కావాలని, ఇవి చేపడుతున్న సామాజిక కార్యక్రమాలు, అమలు చేస్తున్న పాఠ్యాంశాలు ఇతరు లకు స్ఫూర్తిదాయకంగా ఉంటున్నాయని అన్నారు. సమాజం మనవైపే చూస్తోందని, శిశుమందిరాలు కేంద్రంగా నిర్వహించే సేవా కార్యక్రమాలలో పూర్వ

## నివాళి

# దిలీప్ సహానే జీవితం స్వయం

దిలీప్ కిషోర్ సహానే జనవరి 16న భాగ్య నగర్‌లో కన్నుమూశారు. మహారాష్ట్రలోని పర్భని జిల్లా హద్‌గావ్‌లో జన్మించిన సహానే చిన్నతనం నుండే స్వయంసేవక్. ఆర్ఎస్ఎస్‌లో అనేక బాధ్యతలు నిర్వర్తించారు. మొదట మహారాష్ట్రలోని అకోలాలో, తరువాత భాగ్యనగర్‌లో సంఘ పని చేశారు. భాగ్య నగర్ విభాగ్‌లోని గౌలిగూడ నగర కార్యవాహగా, బర్కత్‌పురా భాగ్ కార్యవాహగా, భాగ్యనగర్ విభాగ్ కార్యకారిణి సదస్యులుగా పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ ప్రాంత గోసేవా ప్రముఖ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సహానేకి భార్య, కూతురు, అల్లుడు, ఒక సోదరుడు, ముగ్గురు సోదరీమణులున్నారు. ఈయన తండ్రి కిషోర్ సహానే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు.

**ప్రతిక్షణం సంఘ పని కోసమే..**

దిలీప్ సహానే ఒక కర్మయోగి. ఆదర్శం అంటే ఎలా ఉంటుందో, దాన్ని ఎలా స్వీకరించాలో, స్వీక రించిన ఆదర్శాన్ని ఎలా పాటించాలో, స్వయంసేవక్ అంటే ఏమిటో, స్వయంసేవకత్వాన్ని ఎలా స్వీకరిం చాలో, స్వీకరించిన స్వయంసేవకత్వాన్ని ఎలా పాటిం చాలో తన జీవితంలో దర్శించి ఎందరో స్వయం సేవకులకు దారి దీపమయ్యారు. మహారాష్ట్ర సీడ్ కార్పొరేషన్‌లో మహారాష్ట్ర, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా ఏ ప్రాంతానికెళ్లినా అక్కడి స్వయం సేవకులను కలిసి మరుసటి రోజు ఉదయం శాఖలో ఉండేవారు. సంస్థ కేటాయించిన గెస్ట్ హౌస్‌లో ఉండ కుండా సంఘ కార్యాలయాల్లోనే ఉండి ప్రచారక్‌లు, విస్తారక్‌లు, విద్యార్థులతో కలిసి సంఘ కార్యక్రమాల గురించి చర్చించేవారు.

ఆయన ఏ ప్రాంతానికి వెళ్లినా.. తాను ఆ ప్రాంతానికి కొత్త అయినప్పటికీ, అక్కడి స్వయం సేవకులను వెంట తీసుకొని శాఖ జరిగే పరిసరాలలో ఉన్న ఇళ్లవారిని పలకరిస్తూ ఆప్యాయంగా మాట్లాడే వారు. సంఘాన్ని కొత్తవారికి ఎలా పరిచయం చేయాలో స్వయంసేవకులకు నేర్పించేవారు. ఇలా గటపని చేయడమే సంఘానికి ప్రాణం అని చెప్పేవారు.

కర్నూలు జిల్లాలో ఉన్న గిరిజన సమూహాలు.. ముఖ్యంగా శ్రీశైలం-నల్లమల అటవీ ప్రాంతంలో జీవిస్తున్న 'చెంచు'లు పౌష్టికాహారం లోపంతో అనారోగ్యం పాలయ్యేవారు. కొందరు దంపతులకు బలహీనత కారణంగా సంతానాన్ని కనే యోగ్యత కూడా లోపించింది. 2003 సంవత్సరం కర్నూల్‌లో శాఖ అనంతరం చెంచులకు మందులు సరఫరా చేసేందుకు వారి గూడేలకు వెళుతున్న డాక్టర్ రామశర్మ, సత్యం ఈ పరిస్థితిపై మాట్లాడుతుండగా దిలీప్ సహానే అక్కడికి వచ్చారు. 'చెంచులకు గతంలో







# మందిరాల లక్ష్యం

విద్యార్థులు మరింత చురుకుగా పాల్గొనాలని పిలుపు నిచ్చారు. విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యకారిణి సదస్యులు శ్రీ సరస్వతీ విద్యాపీఠం అనంతపురం సమితి అధ్యక్షులు డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లా డుతూ, శ్రీ సరస్వతీ విద్యాపీఠానికి ఇది స్వర్ణోత్సవ సంవత్సరమని అన్నారు. కోవిడ్ కారణంగా అనేక సమస్యలు ఎదురైనప్పటికీ పూర్వ విద్యార్థులు, సమాజం శిశుమందిర వ్యవస్థ కోసం విశేష సేవలు అందించడం అభినందనీయమని, ఈ కృషిని కొన సాగించాలని అభిలషించారు. ప్రపంచం సాంకేతిక పరిజ్ఞాన దిశలో పయనిస్తోందని, దానికి తగినట్లుగానే శిశుమందిరాలను తీర్చిదిద్దుకోవలసిన అవసరం ఉందని సూచించారు.

విద్యతోపాటు ఆధ్యాత్మిక చింతన అవసరమని, జీవిత విలువలను నేర్పే భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదవవలసిన అవసరం ఉందని ప్రవచన కర్త, మహా సహస్రావధాని గరికపాటి నరసింహారావు అన్నారు. రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన కలగాలంటే ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవలసి ఉందని చెప్పారు. చదువుతోపాటు దేశభక్తి, సంస్కారాన్ని నేర్పేవి ఈ శిశుమందిరాలు మాత్రమేనని, ఇక్కడ చదివిన వారెందరో ఉన్నత స్థానాలలో స్థిరపడడమే అందుకు ఉదాహరణ అని ఆయన అభిప్రాయపడ్డారు.

పూర్వ విద్యార్థి పరిషత్ క్షేత్ర సంయోజకులు, తెలంగాణ ప్రాంత పూర్వ విద్యార్థిపరిషత్ అధ్యక్షులు రెడ్డిగారి హరిస్మరణ్ రెడ్డి మాట్లాడుతూ, వివిధ విద్యా సంస్థలు చదువు నేర్పుతున్నప్పటికీ విద్యాభారతి దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న శిశుమందిరాలకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. శిశుమందిర పూర్వ విద్యార్థులుగా మనం నేర్చుకున్న విషయాలను నిత్య జీవితంలో ఆచరిస్తూ, ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని కోరారు. విద్యాబుద్ధులు నేర్పిన సంస్థతో పాటు సమాజం కోసం, దేశం కోసం సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో చోటు చేసుకుంటున్న అసాంఘిక శక్తులను ఎదిరించాలని, మనం ధర్మబద్ధంగా ఉంటూనే మన పవిత్ర గ్రంథాలు, దేవీదేవతల పట్ల జరుగుతున్న అవమానా లను తిప్పికొట్టాలని అన్నారు. ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర సహక్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్, విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి, విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యకారిణి సదస్యులు, తెలంగాణ ప్రాంత అధ్యక్షులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ★

---

పండ్లు, ఇతర ఆహార పదార్థాలు దొరికేవి. అవి తిని జీవనం గడిపేవారు. కాని నేడు అడవులు తగ్గిపోయి వారికి ఆహారం కరవవుతోంది. కాబట్టి ఈ అడవుల్లో పండ్లు, కూరగాయలు కాసే మొక్కలు నాటుదాం. మా సంస్థలోనే సుమారు 20-30 రకాల కూరగా యల విత్తనాలు ఉన్నాయి. వాటిని చెంచులతో నాటిద్దాం.' అని సలహా ఇచ్చారు. మరుసటి రోజే

# సేవకులకు ఆదర్శం

20 పెద్ద పెద్ద సంచుల్లో పది రకాల కూరగాయల విత్తనాలు అక్కడి కార్యాలయానికి వచ్చాయి. టీబీ బారిన పడిన చెంచులకు మందులు సరఫరా చేసే మన వాహనంతో పాటే స్వయంసేవకులు బయల్దేరి వచ్చారు. ఆ మొక్కల్ని చెంచులతో కలిసి ఆ ప్రాంతాల్లో విస్తృతంగా నాటారు. కొన్నిరోజులకు అవి మొలకెత్తి, కాయలు కాయడం ప్రారంభమైంది. అవి తమ ఆహారంలో నిత్యం తీసుకోవడం ద్వారా



1955-2023

చెంచులకు పౌష్టికాహారం పుష్కలంగా లభించి నట్లైంది. ఈ విధంగా దిలీప్ సహానే ఎందరి జీవితా ల్లోనో వెలుగులు నింపారు. ఇలా ఒక సమస్యకు తన పరిధిలో ఉన్నటువంటి వనరులతో గొప్ప పరిష్కారాన్ని అందించగల నేర్పరి ఆయన. తర్వాత వనవాసీ కల్యాణ ఆశ్రమం మాధ్యమంగా కూడా ఈ పని చాలా కాలం కొనసాగింది.

2008 తర్వాత పశ్చిమ ఆంధ్రప్రదేశ్ బాధ్య తలో ఉండగా భాగ్యనగర్‌లో శని, ఆదిరారాలు గడిపేవారు. ఆ రెండు రోజులు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలోని గోరక్ష విభాగంలో, ముఖ్యంగా గోవిజ్ఞాన పరీక్ష పనిలో నిమగ్నమయ్యేవారు. ఈ విధంగా దిలీప్ కిషోర్ సహానే ఎక్కడున్నా ప్రతిక్షణాన్ని సంఘం కోసం, సమాజం కోసమే కేటాయించేవారు. సామాన్యులకు కూడా అసామాన్యంగా జీవించగలిగే నేర్పరితనాన్ని అందించిన సంఘ కార్యపద్ధతిని సంపూర్ణంగా అందిపుచ్చుకున్న స్వయంసేవక్ ఆయన. ఆయన లేని లోటు వారి కుటుంబానికే కాకుండా సంఘానికి కూడా తీర్చలేనిది. ★

# బాల జాగృతి


## తెలుసుకుందాం

## వరద్వినాయక ఆలయం- పుణే



ఈ ఆలయం మహారాష్ట్రలోని పుణే జిల్లా, ఖలాపూర్ తాలూకా, మహ్డ్ గ్రామంలో కొలువుదీరింది. అష్టవినాయక దేవాలయాల్లో ఇదీ ఒకటి. 1725లో దీనిని సుభేదార్ రామ్జీ మహాదేవ్ బివాల్కర్ నిర్మించారు. ఇక్కడి వినాయక స్వామి విగ్రహం తూర్పు ముఖంగా ఉండగా, తొండం ఎడమవైపునకు తిరిగి ఉంటుంది. ఈ ఆలయంలోని నూనె దీపం 1892 నుండి నిరంతరాయంగా వెలుగుతూనే ఉంది. ఈ ఆలయంలో మూషిక, నవగ్రహ దేవతలు, శివలింగ విగ్రహాలు కూడా ఉన్నాయి. ఏడాది పొడవునా భక్తులు వరద్వినాయకుడిని సందర్శిస్తారు.

## కథ | ఎవరు చెప్పారు?



ఒక ముసలావిడ పని మీద వేరొక ఊరికి నడుచుకుంటూ వెళ్తోంది. ఆమె రెండు చేతుల్లోనూ రెండు బరువైన మూటలు ఉన్నాయి.

అప్పుడే ఒక గుర్రపు రౌతు ఆమెను దాటి ముందుకు వెళ్లాడు.

అతడిని ఆగమంటూ ఆమె పెద్దగా కేక పెట్టింది.

అతడు ఆగగానే 'అబ్బాయి! ఈ మూటలు కాస్త నీ గుర్రంపై తీసుకుపోయి, పొరుగునున్న గ్రామంలో నా కోసం వేచి ఉండగలవా? నేనక్కడికి వచ్చి మూటలు తీసుకుంటాను' అన్నది.

కానీ అసహనంగా ఉన్న గుర్రపు రౌతు ఆమె మాటలను పట్టించుకోలేదు.

'నీ కోసం వేచి చూసేంత సమయం ఎవరికుంది?' అంటూ ఆమెను నిర్లక్ష్యంగా చూస్తూ గుర్రాన్ని పరుగు తీయించాడు.

కొంత దూరం వెళ్లాక అతడిలో ఒక దురాలోచన కలిగింది.

'ఆ ముసలిది నాకిచ్చే మూటలో విలువైన వస్తువులే ఉండవచ్చు! ఆ మూటను తీసుకుని నా దారంట నేను పోతే అడిగేదెవరు? ఆమె ఎలాగూ నన్ను పట్టుకోలేదు.' అని ఆలోచిస్తూ వెనక్కి తిరిగాడు.

ముసలావిడ దగ్గరికి వచ్చి ఆ మూటలు

## పద్యం

నీచగుణములెల్ల నిర్మూలమైపోవు
కొదవలేదు సుజన గోష్ఠి వలన
గంధ మలద మేనికంపడగినయట్లు
విశ్వదాభిరామ! వినుర వేమ!

**భావం :** సుగంధ భరితమైన చందనాన్ని శరీరానికి పూసుకుంటే దేహానికుండే దుర్గంధం ఎలా పోతుందో, అలాగే సుజన గోష్ఠి వలన మనలోని చెడు గుణాలన్నీ దూరమైపోతాయి. అందుచేత సదా సజ్జన సాంగత్యాన్నే కోరుకోవాలి.

## సూక్తిరత్నం

'విద్వాన్ సర్వత్ర పూజ్యతే

విద్వత్త్వం చ నృపత్వం చ నైవ తుల్యం కదాచన
స్వదేశే పూజ్యతే రాజా విద్వాన్ సర్వత్ర పూజ్యతే

**భావం :** పాండిత్యం, రాజరికం ఎప్పటికీ సమానం కానేకావు. రాజుకు తన దేశం/రాజ్యంలోనే గౌరవ ప్రతిష్ఠలు ఉంటాయి. విద్వాంసుడు గౌరవం పొందడానికి స్వదేశం, ఈ దేశం, పరదేశం అనే భేదం లేదు.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| తరువు | సముద్రం |
| కడలి | పండుగ |
| పృథ్వి | ఆకాశం |
| అంబరం | చెట్టు |
| పర్వం | భూమి |

సమాధానాలు : తరువు–చెట్టు; కడలి–సముద్రం; పృథ్వి–భూమి; అంబరం–ఆకాశం; పర్వం–పండుగ.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### యర్రమల కొండప్ప



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. ఏపీలోని అనంతపురం జిల్లాలో 1867లో జన్మించారు. 1902లో తిలక్ బెంగళూరు నుండి బొంబాయికి రైలులో వెళ్తూ గుంతకల్లు స్టేషన్లో ప్రజలనుద్దేశించి చేసిన ఉపన్యాసం విని ప్రభావితుడై తన పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేసి స్వాతంత్ర్య ఉద్యమంలో చేరారు. ఉప్పుసత్యాగ్రహం, సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. 1934లో గాంధీజీ అనంతపురం వచ్చినప్పుడు తన రెండు ఎకరాల భూమిని హరిజనోద్ధరణ కోసం దానం చేశారు. మార్చి 24, 1971న తుదిశ్వాస విడిచారు.

## జనరల్ నాలెడ్జ్

1. భారతదేశ మొట్టమొదటి ఉపరాష్ట్రపతి ఎవరు?
2. జాతీయ ఓటర్ల దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?
3. ఉత్తరాఖండ్ రాష్ట్ర శీతాకాల రాజధాని ఏది?

సమాధానాలు : 1. సర్వేపల్లి రాధాకృష్ణ 2. జనవరి 25; 3. డెహ్రాడూన్.



తనకివ్వమని, తీసుకొని పోయి పక్క గ్రామంలో వేచి ఉంటానని చెప్పాడు.

కానీ ఆమె ఈసారి అతడి మాటలను తోసిపుచ్చింది. 'లేదు లేదు. నా మూటలు నేనే మోసుకొస్తాను' అని చెప్పింది.

ఆ రౌతు ఆశ్చర్యపోతూ 'నువ్వు మోయడం దేనికి, ఇందాక నన్ను తీసుకెళ్లమన్నావు కదా?' అని అడిగాడు.

'ఎందుకంటే ఇప్పుడు నేను నిన్ను నమ్మలేను కాబట్టి!' అన్నదావిడ. ఆమె ముఖం కాస్త పైకి ఎత్తి నిలబడింది. కళ్లు మెరుస్తున్నాయి.

'ఇలా మాట్లాడమని నీకెవరు చెప్పారు?' అన్నాడా రౌతు అసహనంతో. 'వెనక్కి రమ్మని నీకు సలహా ఇచ్చిన వాడే చెప్పాడు' అంటూ తిరుగులేని సమాధానం చెప్పిందామె. ★

## మెదడుకు మేత

ఎందరు ఎక్కినా విరగని మంచం, ఏమిటది?

జవాబు : అరుగు

## మంచిమాట

నిన్నటి కంటే నేడు నీ వివేకం పెరగకపోతే నీ జీవితంలో ఒకరోజు వ్యర్థమయినట్టే!



# వారఫలాలు

**23-29 జనవరి 2023**

### మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

అనుకున్న రాబడి అందుతుంది. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. విద్యార్థులకు శుభవార్తలు. ఇంటి నిర్మాణ యత్నాలు సానుకూలం. వ్యాపారులకు ఆశించిన లాభాలు తథ్యం. ఉద్యోగులకు విధుల్లో చిక్కులు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలకు కొత్త ఆశలు చిగురిస్తాయి. రచయితలు, క్రీడాకారులకు మరింత అనుకూలం. 26, 27 తేదీల్లో ఖర్చులు. గణేశ్ స్తోత్రం పఠించండి.

### వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. భూములు, వాహనాలు కొనుగోలు యత్నాలు సఫలం. ఇంటిలో శుభకార్యాల ప్రస్తావన. వాక్చాతుర్యంతో అందర్నీ మెప్పిస్తారు. వ్యాపార లావాదేవీలు అనుకూలిస్తాయి. ఉద్యోగస్తులకు కొత్త బాధ్యతలు. రాజకీయవేత్తలకు విదేశీ పర్యటనలు. వైద్యులు, పరిశోధకులకు ఉత్సాహవంతమైన కాలం. 23, 24 తేదీల్లో స్వల్ప వివాదాలు. ఆరోగ్యపరమైన చికాకులు. శివాష్టకం పఠించండి.

### మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

సమాజంలో పేరుప్రతిష్ఠలు పెంపొందుతాయి. చిరకాల స్వప్నం నెరవేరుతుంది. విద్యార్థుల ఆశలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు శుభవార్తలు. ఇంటి నిర్మాణయత్నాలు కలసివస్తాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగులకు సంతోషకరమైన సమాచారం. రాజకీయవేత్తలకు విశేష గౌరవం. 24, 25 తేదీల్లో వ్యయప్రయాసలు. మానసిక అశాంతి. నవగ్రహ స్తోత్రం పఠించండి.

### కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆశించిన రాబడి ఉంటుంది. విద్యార్థులకు అనుకూల ఫలితాలు. వ్యాపారాలలో లాభాలు అందుతాయి. ఉద్యోగులకు ఉన్నత హోదాలు దక్కవచ్చు. కళాకారులకు ఊహించని అవకాశాలు. వైద్యులు, శాస్త్రవేత్తల కృషి ఫలిస్తుంది. 25, 26 తేదీల్లో స్నేహితులతో విభేదాలు. ఆరోగ్య సమస్యలు. కనకధారా స్తోత్రం పఠించండి.

### సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

రాబడి ఆశాజనకం. విద్యార్థులు, నిరుద్యోగులకు అనుకూల ఫలితాలు. చేపట్టిన కార్యక్రమాలు సజావుగా సాగుతాయి. తీర్థయాత్రలు చేస్తారు. ఇంటి నిర్మాణ యత్నాలు కలసివస్తాయి. వ్యాపారాల్లో లాభాలు. ఉద్యోగులకు పదోన్నతులు. రాజకీయవేత్తల యత్నాలు సఫలం. కళాకారులు, రచయితలకు నూతనోత్సాహం. 26, 27 తేదీల్లో స్వల్ప అనారోగ్యం. ధనవ్యయం. హనుమాన్ చాలీసా పఠించండి.

### కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

ఆర్థిక విషయాల్లో పురోగతి. ఆరోగ్యపరంగా చికాకులు ఎదుర్కొంటారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగులకు ఉద్యోగలాభం. గృహ, వాహన యోగాలు. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగులకు కొత్త హోదాలు. రాజకీయవేత్తల దీర్ఘకాలిక సమస్య పరిష్కారమవుతుంది. రచయితలు, క్రీడాకారులకు సన్మానాలు. 23, 24 తేదీల్లో ఆరోగ్య, కుటుంబ సమస్యలు. కనకధారా స్తోత్రం పఠించండి.

### తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు


కొద్దిపాటి ఆరోగ్య, ఆర్థిక సమస్యలు ఎదురైనా క్రమేపీ అనుకూలిస్తాయి. విద్యార్థులకు అనుకూల ఫలితాలు. ఇంటి నిర్మాణాలలో ఆటంకాలు తొలగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు గుర్తింపు. రాజకీయవేత్తలకు అనుకూల సమాచారం. క్రీడాకారులు, వైద్యుల ఆలోచనలు కలసివస్తాయి. 25, 26 తేదీల్లో బంధువిరోధాలు. విష్ణుసహస్ర నామ పారాయణం చేయండి.

### వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

జీవిత భాగస్వామి ద్వారా ఆస్తి లేదా ధనలాభం. కొన్ని వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం వహిస్తారు. వాహనయోగం. వ్యాపారాలు లాభిస్తాయి. పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు ఉన్నత హోదాలు రాగలవు. పారిశ్రామికవేత్తలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. రచయితలు, శాస్త్రవేత్తలు అనుకున్నది సాధిస్తారు. 25, 26 తేదీల్లో వృథా ఖర్చులు. అనారోగ్యం. శివస్తుతి మంచిది.

### ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు.




సింహంభట్ల సుబ్బారావు
6300674054


సంతానరీత్యా కొద్దిపాటి చికాకులు ఎదుర్కొంటారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి. నిర్ణయాలలో తొందరపాటు వద్దు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగ యత్నాలు నత్తనడకన సాగుతాయి. వ్యవసాయదారులు, క్రీడాకారుల యత్నాలలో అవాంతరాలు. 24, 25 తేదీల్లో ధనలబ్ధి. సమస్యల నుంచి ఉపశమనం. హనుమాన్ చాలీసా పఠించండి.

### మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

అప్రయత్న కార్యసిద్ధి. విద్యార్థులకు శుభవార్తలు. అదనపు రాబడి పెరుగుతుంది. ఆరోగ్యం కొంత మందగిస్తుంది. వాహనాలు, భూములు కొంటారు. వ్యాపారాల్లో ఆటుపోట్లు తొలగుతాయి. ఉద్యోగులకు సంతోషకరమైన సమాచారం. కళాకారులకు విశేష గుర్తింపు. రచయితలు, వైద్యుల సేవలకు తగిన గుర్తింపు రాగలదు. 27, 28 తేదీల్లో బంధువిరోధాలు. ప్రయాణాలు. అన్నపూర్ణాష్టకం పఠించండి.

### కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తిచేస్తారు. ఆస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. గృహయోగం. చర్చలు ఫలిస్తాయి. ధార్మిక కార్యక్రమాలు చేపడతారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగుల కష్టం ఫలిస్తుంది. రాజకీయ వర్గాలకు అవకాశాలు అనూహ్యంగా దక్కుతాయి. క్రీడాకారులు, పరిశోధకులకు ఆహ్వానాలు. 23, 24 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబ సమస్యలు. ఆదిత్య హృదయం పఠించండి.

### మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

క్రమేపీ అనుకూల పరిస్థితులు నెలకొంటాయి. ఆర్థిక విషయాలు సంతృప్తికరం. పరపతి పెరుగుతుంది. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఇంతకాలం పడిన శ్రమ ఫలిస్తుంది. ఆరోగ్యం కుదుటపడుతుంది. వ్యాపారాలలో ముందడుగు వేస్తారు. ఉద్యోగులకు సంతోషకరమైన విషయాలు. క్రీడాకారులు, శాస్త్రవేత్తలకు గుర్తింపు. 26, 27 తేదీల్లో చికాకులు. దూర ప్రయాణాలు. దుర్గా స్తోత్రం పఠించండి. ★

# పదరసం-400

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | | 2 | | 3 | | 4 | ✠ | 5 |
| 6 | | ✠ | | ✠ | | ✠ | 7 | 8 | |
| 9 | | 10 | | ✠ | ✠ | 11 | | | |
| | ✠ | | ✠ | 12 | 13 | | ✠ | | ✠ |
| ✠ | 14 | | | ✠ | | ✠ | 15 | ✠ | 16 |
| 17 | ✠ | | ✠ | 18 | ✠ | 19 | | | |
| 20 | | ✠ | 21 | | | | | ✠ | |
| | ✠ | 22 | | | ✠ | | ✠ | 23 | ✠ |
| 24 | | | ✠ | 25 | 26 | ✠ | 27 | | 28 |
| | ✠ | 29 | | ✠ | 30 | | | ✠ | |

పదరసం – 400

పేరు : ..............................................................................

చిరునామా:..............................................................................

..............................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..................................................

## ఆధారాలు

**అడ్డం**

1. రిపబ్లిక్ డే (7)
6. జనావళి (2)
7. గడచిపోయినది (3)
9. సమవర్తికే వ్యవహారం! (4)
11. భగత్‌సింగ్ వలె ఉరికంబమెక్కిన ఒడిస్సా స్వాతంత్ర్య యోధుడు (4)
12. సుభాష్ చంద్రబోస్ (3)
14. నూనె (3)
19. పొసగనిది, సరికానిది (4)
20. అర్థ వివరణము (2)
21. ప్రధాని మోదీ రేడియో ప్రసంగ శీర్షిక నెలనెలా (5)
22. ఈ కోయిలారా నేపాలీ అయినా హిందీ తెలుగు సినీ పరిశ్రమలో హిరోయిన్‌గా రాణించింది (3)
24. చనిపోయిన వాని కళ్లు.... అని నుడి (3)
25. అటుగా సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకునేది ఏదో ఒకటి (2)
27. నుడికారము వంటిదే! (3)
29. దేవళము (2)
30. రోజు (3)

**నిలువు :**

1. పన్నెండు అడుగులు, ఓ ఏనుగు (3)
2. తెలంగాణ జాతీయ పుష్పం (3)
3. చిన్న గుట్ట, ఉన్నత భూమి (2)
4. తలక్రిందయిన ప్రపంచం (3)
5. ఓ రకం కంపు, వాసన (3)
6. కృషి, ఫలితం కన్నా ముందు ఇది ముఖ్యం (3)
8. దెబ్బలాట (3)
10. అగస్త్య మహర్షి భార్య (4)
11. సంధి పరస్పరం (2)
13. మాతా లేక పితామహుడు (2)
15. ఉత్తరాది వసంత పంచమి (3)
16. పిఱుదు (3)
17. “బేటీ పఢావో.....” ప్రధాని మోదీని నినాదంలోని భాగం (5)
18. హిందీ చిల్లీ కొట్టు (4)
19. బాలుడు కానివాడు, యువకుడు (3)
21. ఇంగ్లీషు డబ్బు (2)
22. కొలను (3)
23. అతడుతో బాటు ఉప్పల లక్ష్మణరావు నవల పేరు (2)
26. జ్ఞాపకము, గుర్తు (2)
27. వ్యాయామము (2)
28. కుతూహలము, ఆపేక్ష (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 ఫిబ్రవరి 06 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 396 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | ✠ | 1 ము | 2 గి | 3 సి | న | ✠ | 4 ది | ✠ | ✠ |
| ✠ | 5 రో | ✠ | 6 రి | క్క | ✠ | 7 భ | వి | 8 త | ✠ |
| 9 కా | గి | 10 తం | ✠ | 11 ము | 12 ని | ✠ | 13 జా | లు | 14 ము |
| షా | ✠ | 15 తా | ళి | ✠ | 16 జం | 17 ట | లు | ✠ | గ్గ |
| 18 యం | 19 త్ర | ము | ✠ | 20 త | ✠ | పా | ✠ | 21 కౌ | ✠ |
| ✠ | ప | ✠ | 22 న | ల | 23 క | ✠ | 24 ది | ను | 25 సు |
| 26 చెం | ✠ | 27 ము | క్క | ✠ | 28 ల | వం | గం | ✠ | తు |
| 29 ప | 30 న | స | ✠ | 31 చే | ప | ✠ | 32 తం | 33 గే | డు |
| ✠ | 34 స | ల | హో | ✠ | 35 ర | 36 తి | ✠ | లి | ✠ |
| ✠ | ✠ | ము | ✠ | 37 స | ము | స్త | తం | ✠ | ✠ |

**విజేతలు:** బి.ఇందుశేఖర్, ఎం.విజయలక్ష్మి, పి.రాజేశ్వర్‌రావు, టి.వి.నారాయణ–హైదరాబాద్, ఎ.గాయత్రి–వికారాబాద్, ఎం.పార్వతమ్మ–యాదాద్రి, వి.పద్మారంగనాథ్–నిజామాబాద్, జి.చంద్రము–భువనగిరి, టి.వెంకాయమ్మ–ఒంగోలు, పి.సీతామహాలక్ష్మి–చిత్తూరు, ఆర్.శేషు–తూర్పుగోదావరి, ఆర్.కౌముది–తెనాలి, సి.హెచ్.దేవలక్ష్మి–నిర్మల్, ఎన్.రాజ్యలక్ష్మి, కె.సత్యనారాయణ–విశాఖపట్నం, కె.శంకరరావు–కాకినాడ, డి.స్వాతి, ఆర్.అంజనీదేవి–విజయవాడ, టి.శ్రీలక్ష్మీ నాగజ్యోతి–నెల్లూరు, వి.ఉమామహేశ్వరశర్మ, ఆర్.సి.కాశీభట్ల–అనంతపురం, ఎస్.రాజు–కర్నూలు, వి.భాస్కరయ్య–చెన్నై, కె.ఎన్.స్వామి–భువనేశ్వర్.

**విజేత : ఆర్.అంజనీదేవి-విజయవాడ**

సినిమా

అరుణ

2023 సంక్రాంతికి రెండు అనువాద చిత్రాలతో పాటు మూడు స్ట్రయిట్ సినిమాలు జనం ముందుకు వచ్చాయి. జనవరి 11న మొదలైన సినిమాల విడుదల జాతర నాలుగు రోజుల పాటు సాగింది. చిత్రం ఏమంటే.. ఈ ఐదింటిలో వీసమెత్తు కొత్తదనం కూడా కానరాలేదు. అయితే ఈ సినిమాలన్నీ ఆయా హీరోల అభిమానులను అలరించేలా దర్శకులు రూపొందించారు. దానికి తోడు పండగ సీజన్ కలిసి రావడంతో ఇవన్నీ కమర్షియల్ హిట్స్‌గా నిలిచాయి. ఆ రకంగా ఈ యేడాది సంక్రాంతి ఇటు తెలుగు, అటు తమిళనాట చిత్రసీమకు శుభారంభాన్ని అందించిందనే చెప్పుకోవాలి.



# సంక్రాంతి చిత్రాలకు పాస్ మార్కులు!

సంక్రాంతి కానుకగా విడుదలైన 'వీరసింహా రెడ్డి'లో నందమూరి బాలకృష్ణ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేశాడు. తండ్రి వీరసింహారెడ్డి రాయలసీమలో కొన్ని వర్గాలకు దేవుడైతే, మరికొంద రికి శత్రువు. అతనికే తెలియని కొడుకు జై సింహా ఇస్తాంబుల్‌లో తల్లితో పాటు ఉంటాడు. కొడుకు పెళ్లి సంబంధం కారణంగా అతనికి తండ్రి గురించి, తాను ఆయన్ని ఎందుకు వదిలేసి విదేశాలకు రావాల్సి వచ్చిందన్న విషయాన్ని తల్లి తెలియచేస్తుంది. భార్య, కొడుకు కోసం టర్కీ వచ్చిన వీరసింహారెడ్డిని అతని సవతి చెల్లి అతి దారుణంగా భర్తతో కలిసి హత్య చేస్తుంది. దానికి కారణం ఏమిటీ? తన తండ్రిని హత్య చేసిన వారిపై జై సింహా ఎలా కక్ష తీర్చుకున్నాడన్నది మిగతా కథ. సిస్టర్ సెంటి మెంట్ ప్రధానంగా సాగిన ఈ సినిమాలో ప్రారంభం నుండి ముగింపు వరకూ ఒక్క కొత్త సన్నివేశం లేదు సరికదా, అంతా నరుక్కోవ డమే! కొన్ని పోరాట సన్ని వేశాలు... అందులో పారించిన రక్తం... ఎగిరిపడే తలకాయలు చూస్తే ఈ చిత్రానికి యు/ఎ సర్టిఫికెట్ ఎలా ఇచ్చారా? అనే సందేహం కలుగుతుంది. వీరసింహారెడ్డి భార్యగా నటించిన హనీరోజ్ నటన కొంతలో కొంత హుందాగా ఉంది. శ్రుతీహాసన్ పాత్ర మరీ దారుణం. వరలక్ష్మీ శరత్ కుమార్ నటన ఆకట్టు కున్నా, ఆమె వాచకం తేలిపోయింది. కన్నడ నటుడు దునియా విజయ్ ప్రతి నాయకుడి పాత్రలో మెప్పించాడు. తండ్రీ కొడుకులుగా బాలకృష్ణ ద్విపాత్రా భినయం చేసినా... అన్నదమ్ములు మాదిరిగానే తెర మీద కనిపించారు. వయసు ప్రభావం స్పష్టంగా కనిపి స్తోంది. అయితే యాక్షన్ సన్నివేశాలలో మాత్రం ఫుల్ ఎనర్జీని ప్రదర్శించి, అభిమానులను ఆకట్టుకున్నారు బాలకృష్ణ. దాంతో ఆయన ఫాన్స్‌కు ఈ సినిమా ఓ విజువల్ ఫీస్ట్‌గా మారిపోయింది.



'వాల్తేరు వీరయ్య' విషయానికి వస్తే... ఇందులో వింటేజ్ చిరంజీవిని చూపించడానికి దర్శకుడు బాబీ తెగ తాపత్రయ పడ్డాడు. అందులో కొంతవరకూ సఫలీకృతుడయ్యాడు. 'వీరసింహారెడ్డి'లో సవతి చెల్లి సెంటిమెంట్‌ను చూపిస్తే, ఇందులో సవతి తమ్ముడి సెంటిమెంట్‌ను చూపించారు. తమ్ముడిగా రవితేజ ద్వితీయార్థంలో ఎంట్రీ ఇచ్చాడు. ఫస్ట్ హాఫ్ అంతా చిరంజీవి తనదైన శైలిలో కామెడీతో మెప్పిస్తే, ద్వితీయార్థంలో రవితేజ ఎంట్రీతో యాక్షన్ అండ్ సెంటిమెంట్ మోడ్‌లోకి మూవీని తీసుకెళ్లారు. ఈ రెండు సినిమాల్లోనూ ఐటమ్ సాంగ్స్ పెట్టారు. తలలు లేపడం బాలకృష్ణే కాదు... చిరంజీవీ చేయగల డంటూ క్లయిమాక్స్‌లో చూపించారు. కానీ దానికి కారణమైన సన్నివేశాలను బలంగా చూపించలేక పోయారు. ఇదిలా ఉంటే... చిరంజీవిని కొన్ని సన్నివేశాలలో రవితేజ పక్కన తక్కువ చేసి చూపించా రంటూ మెగాభిమానులు కొందరు కినుక వహిస్తు న్నారు. అయితే సగటు ప్రేక్షకుడు చిరంజీవి నుండి కోరుకునే వినోదం ఇందులో లభిస్తుంది. 'వీరసింహా రెడ్డి'లో సంభాషణలు రాజకీయ నేపథ్యంలో సాగితే, 'వాల్తేరు వీరయ్య'లో డైలాగ్స్ సోషల్ మీడియాలోని అంశాలతో సరదాగా సాగాయి. ఈ రెండు చిత్రాల లోనూ నాయికగా నటించిన శ్రుతీహాసన్‌కు చిరంజీవి సినిమాలోని పాత్రే కాస్తంత గుర్తింపును, గౌరవాన్ని తెచ్చిపెట్టే విధంగా ఉంది. 'ధమాకా'తో తిరిగి సక్సెస్ ట్రాక్ ఎక్కిన రవితేజ 'వాల్తేరు వీరయ్య' విజయానికి తన వంతుగా భుజం కాశాడు.

ఈ రెండు తెలుగు సినిమాలతో పాటు వచ్చిన సంతోష్ శోభన్ 'కళ్యాణం కమనీయం' మూవీలో అందరినీ అలరించే సన్నివేశాలు ఉన్నాయి. కానీ కథలో హీరో, హీరోయిన్ల మధ్య కాన్‌ఫ్లిక్ట్‌కు బలమైన కారణాలు చూపని కారణంగా తేలిపోయింది. ఈ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన హీరోయిన్ ప్రియ భవానీ శంకర్‌కు మంచి భవిష్యత్తే ఉంది. ఇక తమిళ అనువాద చిత్రాలు అజిత్ 'తెగింపు' బ్యాంకింగ్ వ్యవస్థలోని లూప్‌హోల్స్ నేపథ్యంలో తెరకెక్కింది. దాంతో కేవలం అజిత్ అభిమానులను, ఆ తరహా యాక్షన్ మూవీస్‌ను ఇష్టపడే వారికి మాత్రమే నచ్చే చిత్రంగా మారిపోయింది. దీనితో పోల్చితే విజయ్ 'వారిసు' (తెలుగులో 'వారసుడు') కొంతలో కొంత బెటర్ మూవీ. ఇది ఫ్యామిలీ ఆడియెన్స్‌ను టార్గెట్ చేసి తీసిన సినిమా. మూవీని 'దిల్' రాజు భారీగా తీసినా, దర్శకుడు వంశీ పైడిపల్లి కష్టపడి తెరకెక్కిం చినా, కొత్తదనం లేని సీన్ ఒక్కటీ లేకపోవడంతో తెలుగు ప్రేక్షకులు పెదవి విరుస్తున్నారు. అయితే తమిళనాట ఈ రెండు సినిమాలకు భారీ ఓపెనింగ్సే వచ్చాయి. ఇక్కడ కూడా 'వీరసింహారెడ్డి' మొదటి రోజు కలెక్షన్స్ 'వాల్తేరు వీరయ్య'ను మించగా, వీకెండ్‌లో మాత్రం చిరంజీవి సినిమాదే పైచేయిగా ఉంది. మొత్తం మీద పండగ నేపథ్యంలో వచ్చిన ఈ సినిమాలకు ప్రేక్షకులు ఘన విజయాన్ని కట్టబెట్టకపోయినా.. పాస్ చేసి పంపారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# మఘ్ బిహు



జ్యోతిష్యశాస్త్రం ప్రకారం మకర సంక్రాంతికి విశేష ప్రాధాన్యం ఉంది. ఇది అందరికీ తెలిసిందే. కానీ అస్సాంలో ఈ పండుగను సంవత్సరాదిగా జరుపుకుంటారు. అక్కడ ఉన్న పేరు మఘ్ బిహు. మకర సంక్రాంతి నుంచి సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించి ఉత్తర దిశగా ప్రయాణిస్తాడు. అదే ఉత్తరాయణం. అక్కడ ఈ సంవత్సరం జనవరి *15*న జరుపుకున్నారు. ఇంకా బోహగ్ బిహు, కొంగలి బిహు పండుగలు కూడా ఏప్రిల్, అక్టోబర్ మాసాలలో అస్సాం ప్రజలు జరుపుకుంటారు. భారతదేశం నలుమూలలా మకర సంక్రమణాన్ని ఉత్సవంగా జరుపుకుంటారు. రాత్రి సమయం తగ్గి, వెలుగు వెల్లువెత్తుతుంది కాబట్టి ఈ పండుగ చేసుకోవడం సంప్రదాయం. రోజులో వెలుగు భాగం ఎక్కువ కావడంలో పంటలు ఇంటికి చేరతాయి. కాబట్టి అక్కడ కూడా మకర సంక్రాంతిని ప్రధానంగా రైతులు పండుగగానే పరిగణిస్తారు.



మఘ్ బిహు పండుగకు అంతా కొత్త దుస్తులు ధరిస్తారు. వారి సంప్రదాయక  బిహు నృత్యంలో అంతా పాల్గొంటారు. అందుకే ఆరోజున కర్షకులంతా ప్రకృతి మాతకు కృతజ్ఞత తెలియచేసే కార్యక్రమం కూడా ఉంటుంది. అలాగే బ్రాయి శిబ్రాయ్ అనే దేవతను పూజిస్తారు. బ్రాయి శిబ్రాయ్ సుఖసంతోషాలను ప్రసాదించే దేవత. బిహు నృత్యమే కాకుండా గ్రామాలలో బాలికలు, బాలురు సంప్రదాయంగా పంచె, గామోసా ధరించి ఒక ప్రత్యేక నృత్యం చేస్తారు. కొన్ని ప్రత్యేక వంటకాలు కూడా ఆ రోజు భుజిస్తారు. వాటి పేరు అలూ పిటికా, జాక్, మాసోర్, టెంగా వంటివి. ఆలూ పిటికా బంగాళదుంపతో పచ్చిమిర్చి, కొత్తిమీర వంటి దినుసులు కలిపి చేసి, అన్నంతో కలిపి తింటారు. టెంగా చేపలతో తయారు చేసే వంటకం.




మకర సంక్రాంతి అంటే భారతీయ సంస్కృతిలోని ఏకాత్మతకు అద్దం పట్టే పండుగ.




From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 14



# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు














వెల : ₹.200/- | వెల : ₹.200/- | వెల : ₹.390/- | వెల : ₹.300/- | వెల : ₹.200/-

















వెల : ₹.200/- | వెల : ₹.200/- | వెల : ₹.200/- | వెల : ₹.250/- | వెల : ₹.250/-












వెల : ₹.599/- | వెల : ₹.695/- | వెల :₹.799/- | వెల : ₹.799/- | వెల : ₹.549/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244